epaper.vaartha.com
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
23-9-2025
మంగళవారం సంపుటి: 31
సంచిక: 233 పేజీలు: 8
వెల: 6.50
WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam



సోమవారం హైదరాబాద్‌లో అగ్రసేన్ మహరాజ్ జయంతి వేడుకలో పూలమాలవేస్తున్న తెలంగాణ సిఎం రేవంత్. చిత్రంలో అఖిలభారత వైశ్‌ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# ఆదాయ మార్గం ఆక్వా, హార్టికల్చర్

## ప్రతి నిర్ణయం రైతు సంక్షేమానికే

## ఐటిపై మాట్లాడినా సాగుపైనే ఆలోచన

## ట్రంప్ కారణంగా ప్రింప్ విలవిల

## మైక్రో, డ్రిప్ ఇరిగేషన్‌తో వనరుల ఆదా

## వ్యవసాయంపై అసెంబ్లీలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,సెప్టెంబరు 22, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వ్యవసాయం కోసమేనని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.రాష్ట్రానికి అత్యధిక ఆదాయం ఇచ్చే వనరు వ్యవసాయరంగమన్నారు.తరచు నేను ఐటీ గురించే మాట్లాడుతానని అనుకుంటారు. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని. నేను చేసిన పనులన్నీ రైతులకు ఉపకరించేవే. నీరుచెట్టు, రిజర్వాయర్లు, చెక్ డ్యాములు, కాలువలు ఇలా ప్రతీ అంశాన్నీ వ్యవసాయ రంగానికి అనుకూలమైన ఆలోచనలే చేశానన్నారు. సోమవారం అసెంబ్లీలో వ్యవసాయ శాఖపై లఘు చర్చజరిగింది. ఈ సందర్భంగా సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే వ్యవసాయ శాఖపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు.. రైతులకు లబ్ది చేకూర్చిన అంశాలను చెప్పడంతో పాటు.. భవిష్యత్తులో రైతు సంక్షేమం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నామనే విష యాలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతి నిర్ణయమూ రైతు కోసమే తీసుకుంటున్నానని, వ్యవసాయాన్ని లాభదాయకం చేసే అంశం మీదే ప్రతి నిమిషం ఆలోచిస్తున్నానని స్పష్టం చేశారు. వ్యవసాయం మీద ఆధారపడే ఆర్థిక వ్యవస్థ మనది. అందుకే ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలని నిర్ణయించాం. ప్రతి పంటకు గిట్టుబాటు ధర దక్కేలా చూస్తున్నాం. అందుకే రకరకాల పంటలను ప్రోత్స హిస్తున్నాం. ఏ పంట వేస్తే గిట్టుబాటు ఉంటుందో చూసి ఆ పంటలు వేసేలా ప్రోత్సహిస్తాం అని సీఎం చెప్పారు.

ప్రతీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నెలకు ఒక్క రోజు పొలం దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడాలి. అక్టోబరు నుంచి ప్రతీ నెలా రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు విని పరిష్కారం చేస్తాం. ఈ మేరకు కార్యాచరణ రూపొందిస్తాం. పురుగు మందులు, ఎరువుల వాడకంలో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ ఉంది. తెగుళ్లను గుర్తించి నివారణ చర్యల కోసం డ్రోన్లను వాడొచ్చు. అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల ఆక్వాలో అగ్రస్థానంలో ఉన్న ఏపీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి న పరిస్థితి. రైతులకు సంపద రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ తగ్గించడానికి టెక్నాలజీతో రైతును ఆదుకుంటాం అని సీఎం స్పష్టం చేశారు.

రైతులకు వాస్తవాలు చెప్పి పురుగుమందులు, ఎరువులు వాడుతుంటే వారికి అవగాహన కల్పించాలి. వరదలు, వర్షాలతో ఎరువు కొట్టుకుపోవటం వల్ల బూస్టర్ డోస్ ఇచ్చారు. రాష్ట్రంలో 1.16 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది అదనంగా పంట వేశారు. 25 శాతం మేర యూరియా ఎక్కువ వినియోగించారు. ఖరీఫ్ సీజన్ కు 16.70 లక్షల మెట్రిక్‌టన్నుల మేరయూరియా అలాట్మెంట్ వచ్చిది. ప్రస్తుతం 5.54లక్షల మెట్రిక్ టన్నుల యూరియా >>2

## దేశ వికాసం, సంఘ సేవలో 2లో

# వైశ్ సమాజ్ కీలకం

## ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న వైశ్ సమాజ్ సంఘటితమవ్వాలి

## అఖిల భారత్‌వైశ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపి డా.గిరీష్‌కుమార్ సంఘీ

## ఘనంగా అగ్రసేన్ మహరాజ్ జయంతి ఉత్సవం

## వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ ప్రభృతులు



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సిఎం రేవంత్, డిసిఎం భట్టి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ, షబ్బీర్ అలీ, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

## తెలుగు సంస్కృతికి దర్పణం

# 'విజయవాడ ఉత్సవ్'

## దసరా వేడుకలను ప్రారంభించిన మంత్రి లోకేష్, వెంకయ్య నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుసంస్కృతి, ఆచారాలకు దర్పణం పట్టే విధంగా విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. ఈ ఉత్సవ్‌తో విజయవాడకు నూతన శోభ సంతరించుకుందని చెప్పారు. విజయవాడ ఉత్సవ్ ద్వారా విజయవాడ గొప్ప తనాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. మంచి చేసే >>2



సోమవారం విజయవాడ సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

## రేపు తిరుమలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సిఎం చంద్రబాబు

**తిరుమల,సెప్టెంబరు 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదిరోజుల పాటు జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేదందుకు బుధవారం సాయంత్రం ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ వస్తు న్నారు.అలాగే ఆనవాయితీ >>2

# జిఎస్టీ సంస్కరణలతో బలోపేతం

## అవగాహన పెంచడానికి మంత్రుల కమిటీ: సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ సంస్కరణలతో మేడిన్ ఇండియా మరింత బలోపేతం అవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బలమైన, సమతుల్యమైన సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలతో ఏపీ ప్రజలకు రూ.8వేల కోట్ల లాభం కలుగుతుందని తెలిపారు. స్వదేశీ, మేకిన్ ఇండియా ప్రచారం మరింత ఊపందుకోవాలని సూచించారు. ఇవాళ(సోమవారం) జీఎస్టీ సంస్కరణలపై ఏపీ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు.గృహోపయోగ వస్తువుల వినియోగం బాగా పెరుగుతోందని చెప్పుకొచ్చారు. దేశీయ ఉత్పత్తులు కొనాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. దసరా నుంచి దీపావళి వరకు జీఎస్టీ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు వారాల్లో జీఎస్టీపై 65 సమావేశాలు ఏపీలో నిర్వహిస్తామని వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలు భవిష్యత్‌లో గేమ్ ఛేంజర్ అని ఉద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయని చెప్పుకొచ్చారు. స్వర్ణాంధ్ర దిశగా ముందుకెళ్లేందుకు జీఎస్టీ సంస్కరణలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. జీఎస్టీపై ఓ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అని ప్రధానమంత్రి నరేంద్ మోదీ చెప్పారు. జీఎస్టీ ఫలితాలు పేదలు, అన్నివర్గాల స్టేక్ హోల్డర్‌లకు చేర్చాలి. దీనికి 30 రోజులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. దీని అమలుకు ఒక కమిటీ వేశాం. హెచ్‌ఆర్డీ మంత్రి లోకేష్, ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, ట మంత్రి కందుల దుర్గేష్‌లతో ఈ కమిటీ వేశాం. జీఎస్టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త దశకు నాంది పలుకుతున్నాయని ప్రధాని మోదీఅన్నారు. ఏపీకి సంబంధించి ప్రగతిశీల విధానాల ద్వారా పేద, మధ్యతరగతి జీవితాలను మార్చాలి.

## పనిమంతుల జనాభాలో

# ఫస్ట్ ఢిల్లీ, థర్డ్ ఎపి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనే 15-59 ఏళ్ల వయసున్న వారి జనాభా అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఢిల్లీ టాప్‌లో నిలిచింది. దేశ రాజధాని జనాభాలో వీరి వాటా 70.8 శాతంగా ఉన్నట్టు శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అర్థగణాంక నివేదికలో వెల్లడైంది. ఇక దేశవ్యాప్తంగా జనాభాలో వీరి వాటా 66శాతం. తెలంగాణలో 15-59 ఏళ్ల వయసున్న వారి వాటా 70.2 శాతం.70.1 శాతం వాటాతో ఏపీ మూడో స్థానంలోఉంది. దేశ జనాభాలో 0-14 ఏళ్ల వయసున్న చిన్నారుల వాటా తగ్గినట్టు కూడా ఈ గణాంకాలు చెబుతున్నాయి. 1971లో వీరి వాటా 41 శాతం కాగా 2023 నాటికి చిన్నారుల వాటా 24శాతానికి పడిపోయింది. అయితే, బీహార్ జనాభాలో 14ఏళ్ల లోపున్న చిన్నారుల వాటా అత్యధికంగా 32 శాతంగా ఉంది. కానీ వర్కింగ్‌ఏజ్ (15-59 ఏళ్లు)జనాభా పరంగా బీహార్ మిగతా రాష్ట్రాలకంటే చివరన ఉండటం గమనార్హం గ్రామీణ ప్రాంతాలు, పట్టణ,నగరాల మధ్య జనాభాపరంగా వ్యత్యాసాలుఉన్నట్టు ఈగణాంకాలు చెబుతున్నాయి.

# స్వచ్ఛమైన గాలి, నీరు



## భావితరాలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## కాలుష్య నియంత్రణ మండలిని బలోపేతం చేయాలి : డి.సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు22,ప్రభాతవార్తప్రతినిధి:** భావి తరాలకు సాధ్యమైనంత స్వచ్ఛమైన గాలి, నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అటవీ పర్యావరణ శాఖ శాఖను నిర్వహిస్తున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీ స్పష్టం చేసారు.పర్యావరణ ముఖ్య కార్యదర్శితో సమావేశమైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పలు అంశాలపై ఆయనతో చర్చించారు. మనకు మన పెద్దలు అందించినంత స్వచ్ఛమైన గాలి, నీరు భావి తరాలకు ఇవ్వగలమా? సాధ్యమైనంత స్వచ్ఛంగా ప్రకృతి వనరులను అందించే లక్ష్యంతో పని చేయాలి. గోదావరి పరీవాహక ప్రాంతంలో సైతం నీటిని కొనుక్కొని తాగాల్సి వస్తోంది. అక్కడి నీరు కలుషితం కావడానికి ఆక్వా రంగం, పేపర్ మిల్లులు కారణంగా ఉన్నాయి అని మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం శాసన సభ కార్యక్రమాలు నడుస్తున్న సందర్భంలో తన ఛాంబర్‌లో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజతో సమావేశమయ్యారు. కాలుష్య నియంత్రణ మండలిపై టిడిపి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేసిన ఆరోపణల క్రమం, వ సిబ్బంది, బాధ్యతలపై చర్చించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి అనేది చట్టబద్ధమైన సంస్థ అనీ, ఈ మండలి విధుల నిర్వహణలో ప్రభుత్వ పర్యవేక్షణ పాక్షికంగా ఉంటుందని అధికారులు వివరించారు. పంచాయతీరాజ్ లాంటి శాఖలపై ప్రభుత్వం నేరుగా పర్యవేక్షించి, నియంత్రణ ఉంటుందని. పీసీబీ నిర్ణయాలు, విధుల నిర్వహణపై పర్యవేక్షణలో కొన్ని పరిమితులు ఉంటాయని, పీసీబీ కార్యనిర్వహక మండలికి చట్టబద్ధంగా అధికారాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు దిశానిర్దేశం చేస్తూ రాష్ట్రానికి పెట్టుబడులకు ప్రోత్స హిస్తూనే కాలుష్య నియంత్రణకు సంబంధించిన నిబంధనలు అమలు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ పేరిట పారిశ్రామికవేత్తలను పారిపోయే పరిస్థితి తీసుకురాకూడదు. గత ప్రభుత్వంలో అలాంటి తప్పిదాలే చోటు చేసుకున్నాయి. ఎల్జీ పాలిమర్స్ లాంటి సంస్థలలో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. విశాఖ ప్రాంతంలో ఉన్న ఫార్మా సంస్థలు ఉన్నాయి. వాటిలో కాలుష్య నియంత్రణ నిబంధనలు అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. నిబంధనల అమలులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించిన తొలి రోజుల్లోనే పీసీబీపై సమీక్షించి దిశా నిర్దేశం చేశాం అన్నారు.ఇదే సమావేశంలో అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి ముందు ఉప ముఖ్యమంత్రి కొన్ని ప్రశ్నలు ఉంచారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో

# ప్రపంచస్థాయి లైబ్రరీ



## 24నెలల్లో ఏర్పాటు చేస్తాం

## 175 అసెంబ్లీ సెగ్మెంట్లలో మోడల్ లైబ్రరీలు: మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్త ప్రతినిధి:**అమరావతిలో రూ.150కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపడుతు న్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో లైబ్రరీల అభివృద్ధి, సెస్సు బకాయిలకు సంబంధించి ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, గణబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని 24నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం. రాష్ట్రంలో లైబ్రరీలకు సంబంధించి మోలిక వసతులతోపాటు మ్యాను స్క్రిప్ట్ కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి శోభా డెవలపర్స్ అనే సంస్థకు రూ.100 కోట్ల విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దాతల సహకారాన్ని కూడా తీసుకుని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. విశాఖపట్నంలో రూ.20కోట్లతో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. పిల్లల్లో పఠనాసక్తి పెంచే అంశాన్ని సీరియస్ గా తీసుకొని రాబోయే ఆరునెలల్లో మార్పులు తెచ్చేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నాం. గ్రంథాలయాల్లో కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఇందుకోసం కార్టూనిస్టులతో కూడా చర్యలు జరిపాం. మంగళగిరి నియోజకవర్గంలో మోడల్ లైబ్రరీ నిర్మాణం చివరి దశలో ఉంది, ఈ లైబ్రరీని అక్టోబర్ నెలలో ప్రారంభిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీల నిర్మాణాలను చేపడతాం. ప్రస్తుతం 13 మాత్రమే జిల్లా గ్రంథాలయాలు ఉన్నాయి, కొత్త జిల్లాల ప్రాతిపదికన 26జిల్లా గ్రం థాలయాలను ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించిన ఫైలు ఆర్థికశాఖలో ఉంది. గ్రంథాలయ సెస్సు బకాయిలకు సంబంధించి 2022-23లో 40శాతం, 202324లో 45శాతం, ప్రస్తుతం సంవత్స రం 52శాతం మాత్రమే వసూలయ్యాయి. పంచాయితీరాజ్, మున్సి పల్ శాఖల మం త్రులను సంప్రదించి బకాయిల వసూలుచేసేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రంథాలయాల్లో కాంపిటీటివ్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన అన్నిరకాల పుస్తకాలను అందుబాటులోకి తెస్తాం. ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు డిజిటల్ లైబ్రరీలపై దృష్టి సారించాం. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ను వందరోజుల్లో ఆవిష్కరిస్తాం. సభ్యుల సూచనలతో దేశానికే మోడల్ గా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇక అసెంబ్లీకి రావట్లేదంటేనే జగన్ ఎంత పిరికివాడో అర్థమవుతోందని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా చివరి రోజు వరకూ అసెంబ్లీలో పోరాడామని గుర్తు చేశారు.



## విజయవాడ, విశాఖ మెట్రో

# 2028లో పూర్తికి చర్యలు

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో రవాణా రంగంలో అద్భుతంగా మారనున్న విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులు పనులు వడి.వడిగా ముందుకు సాగుతున్నాయి.నిర్దిష్ట లక్ష్యాలకు అనుగుణంగా ఏపీలోని రెండు ప్రధాన కీలక నగరాలైన వైజాగ్.బెజవాడలకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకుని వచ్చే విధంగా ఈ మెట్రో రైలు వ్యవస్థలో అప్డెట్ కార్యచరణ చేపడుతున్నారు. ప్రాజెక్టులను 2028 నాటికి రికార్డు టైంలో పూర్తి చేయాలని, పనుల విభజన వల్ల నిర్మాణ వ్యయం పెరగకుండా చూడాలనేది ప్రభుత్వం ఉద్దేశమని చెప్పుకొచ్చారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లోని మెట్రో ప్రాజెక్టుల అధ్యయనం చేసి, పనులను ప్యాకేజీలుగా విభజించకుండా, పెద్ద స్థాయిలోనే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. విశాఖపట్నం మెట్రో టెండర్లకు అక్టోబర్ 10 చివరి తేదీగా, విజయవాడ మెట్రో టెండర్లకు అక్టోబర్ 14 గడువుగా నిర్ణయించామని ఎండీ రామకృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. సమయానికి టెండర్ల ప్రక్రియ పూర్తయితే, రెండు నగరాల్లో నిర్మాణ పనులు వేగంగా మొదలవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# దీపావళి తర్వాతే బీహార్ ఎన్నికలు

## ఈశాన్య రాష్ట్రాలను విస్మరించిన కాంగ్రెస్: పిఎం 5లో

# ఆదాయ మార్గం ఆక్వా, హార్టికల్చర్

>> రాష్ట్రంలో అందుబాటులో ఉంది. రాష్ట్రంలో హెక్టారుకు సగటున 255 కేజీల మేర యూరియా వినియోగం జరుగుతోంది. తద్వారా భూగర్భజలాలు, భూసారం కూడా దెబ్బతింటోంది. ప్రజారోగ్యంతో పాటు పంట ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతోంది. పీఎం ప్రణామ్ కింద రసాయన ఎరువుల వినియోగం తగ్గించిన రైతులకు రూ.800 సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాకే బదిలీ చేస్తాం. టెస్టింగ్ అండ్ ట్రేసింగ్ వల్ల రైతులు నష్టపోకూడదు. బాధ్యతలేని నాయకులు ఎరువులు ఇవ్వలేదని వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. సర్టిఫికేషన్ ఇచ్చిన ఆహారాన్నే తీసుకుంటున్న ఆ నేతలు రైతులను మోసగిస్తున్నారు. రైతులు ఉత్పత్తి చేసే పంటలపై శ్రద్ధపెట్టాలి, సేంద్రీయ ఎరువులు ఉపయోగించి, రసాయన పురుగు మందులు తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులు పండిద్దాం." అని చంద్రబాబు చెప్పారు. సమర్థ నీటి నిర్వహణ కారణంగా అన్ని రిజర్వాయర్లల్లో నీటితో కళకళలాడుతున్నాయి. నెల్లూరులో ఎప్పుడూ ఒక పంటే వేస్తారు. ఈసారి అక్కడ రెండు పంటలు వేశారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో వేస్తున్నాం. తొలి విడతగా రూ.7 వేల చొప్పున మొత్తంగా రూ.3173 కోట్లు రైతుల ఖాతాలో వేశాం. ఉల్లి ధరలు పడిపోతే హెక్టారుకు రూ.50 వేల నష్ట పరిహారం ప్రకటించాం. ఈ స్థాయిలో ఉల్లి పంటకు నష్టపరిహారం గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. అలాగే టమాటో ధర పడిపోయినా ప్రభుత్వం 1267 మెట్రిక్ టన్నుల టమాటాలను కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. మామిడికి రూ.194 కోట్ల మేర అదనంగా చెల్లింపులు చేసి రైతును ఆదుకున్నాం. మిర్చి, కోకో, పత్తి, పొగాకు రైతులను అన్ని రకాలుగా ఆదుకున్నాం. అనంతపురంలో అమలు చేసిన మైక్రో, డ్రిప్ ఇరిగేషన్‌ను నమూనాగా తీసుకుని ప్రధాని మోదీ గుజరాత్ లో అమలు చేశారు. అందుకే దేశంలో ఈ రెండు రాష్ట్రాలు మైక్రో ఇరిగేషన్ రంగంలో అగ్రస్థానంలో ఉన్నాయి. 90 శాతం సబ్సీడిని మైక్రో ఇరిగేషన్ వినియోగించే రైతులకు అందిస్తున్నాం. మైక్రో ఇరిగేషన్ ద్వారా లక్ష హెక్టార్లకు 15 టీఎంసీల నీరు ఆదా అవుతుంది. ఏడేళ్లలో 105 టీఎంసీల నీరు ఆదా అయినట్టే. అలాగే రూ 434 కోట్ల విలువైన 10,871 లక్షల కిలోవాట్ల విద్యుత్ ఆదా అవుతుంది. అలాగే 364 లక్షల పని దినాలు కూడా ఆదా చేసుకున్నట్టే. దీని విలువే రూ.1820 కోట్ల మేర ఉంటుంది. 35 వేల టన్నుల యూరియా కూడా రైతులకు ఆదా అవుతుంది. మొత్తంగా రూ.8 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని రైతులు సాధించినట్టే. ఆక్వా కల్చర్ తో పాటు వ్యవసాయ ఉత్పత్తుల్లోనూ ఏపీ నెంబర్ వన్ గా మారే పరిస్థితి తీసుకువస్తాం. ట్రంప్ దెబ్బకు ష్రింప్ విలవిల లాడుతోంది. రూ.21 వేల కోట్ల ఆక్వా ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. టారిఫ్ పెరిగిపోవటం వల్ల ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తున్నాం. రిజిస్ట్రేషన్లు చేసుకుంటే... జోన్లకు అతీతంగా అక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ ను అందిస్తున్నాం. రూ. 1000 కోట్ల భారం పడినా ఆక్వా రైతును అదుకునేలా చర్యలు చేపట్టాం. ఆక్వా ఫీడ్ కూడా కేజీకి రూ.9 చొప్పున ధర తగ్గించేలా కంపెనీలతో మాట్లాడాం. రాష్ట్రంలో 35 శాతం జీఎస్డీపీ వ్యవసాయ ఆధారితంగానే వస్తోంది. వ్యవసాయ రంగం ద్వారా రూ. 5.17 లక్షల కోట్లు, పారిశ్రామిక రంగం ద్వారా రూ. 3.40 లక్షల కోట్లు, సేవల రంగం ద్వారా రూ. 6.12 లక్షల కోట్ల గ్రాస్ వాల్యూ ఎడిషన్ వస్తోంది. ఒక్క పశు సంవర్ధక రంగం నుంచే రూ.1.95 లక్షల కోట్ల జీవీఏ వస్తోంది. 202526 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవల రంగం నుంచి రూ. 17.12 లక్షల కోట్ల జీవీఎను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ రంగాల్లో 17.11 శాతం వృద్ధి రేటు నమోదయ్యే అవకాశం ఉంది. ఉద్యాన రంగం రాష్ట్రంలో రెండో గేమ్ చేంజర్‌గా మారుతుంది. 18.57లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నాం. కూరగాయలు, పండ్లు, మసాలా దినుసులు తదితరాలను పెద్ద ఎత్తున పండించుకునే అవకాశం ఉంది. హార్టికల్చర్, ఆక్వా కల్చర్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చే రంగాలుగా మారతాయి. 2029 నాటికి రాష్ట్రంలో ఉద్యాన పంటలను 25 లక్షల హెక్టార్లకు పెంచుతాం. సమీప భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ దేశానికి హార్టికల్చర్ హబ్ గా మారుతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

# 'విజయవాడ ఉత్సవ్'

>> వారిని ఎప్పుడు గౌరవించాలన్నారు. సోమవారం మంత్రి నారా లోకేష్‌తో కలిసి వెంకయ్యనాయుడుతో విజయవాడ ఉత్సవ్ 2025లో భాగంగా సాంస్కృతిక ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ ప్రస్తుతం ఛిన్నా భిన్నం అవుతోంది. వంట విడిపోతే జంట విడిపోద్ది.. వంటను కాపాడుకోండి. భాష పోతే.. శ్వాస పోయినట్టే.. అందరూ మాతృ భాషను కాపాడుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఇవ్వాలని చంద్రబాబును కోరా అన్నారు. ఇవాళ తెలుగులో ఇచ్చారు సంతోషం. ప్రైవేట్ వ్యక్తులు ముందుకు వచ్చి విజయవాడ ఉత్సవ్ నిర్వహించడం మంచి పరిణామం. ఫాస్ట్ లైఫ్, ఫాస్ట్ ఫుడ్ కు అలవాటు పడిపోయారు. అది మంచిది కాదు. విజయవాడ ఉత్సవ్ సక్సెస్ కావాలంటే అందరూ కష్టపడి పనిచేయాలి అని వెంకయ్య నాయుడు అన్నారు.

విజయవాడ పేరులోనే విజయం ఉందని, చరిత్ర రాయాలన్నా, సృష్టించాలన్నా విజయవాడతోనే సాధ్యమని ఏపీ మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎనలేని కృషి చేశారని లోకేష్ చెప్పారు. జీవోలన్నీ తెలుగులో వస్తున్నాయంటే అది వెంకయ్య నాయుడితోనే సాధ్యమైందని చెప్పారు. వెంకయ్య నాయుడు ఏజ్.. ఆయనకు ఒక నంబర్ మాత్రమే. ముఖ్యమంత్రి చంద్రబాబు, వెంకయ్య నాయుడుతో పోటీ పడలేకపోతున్నా అని లోకేష్ చెప్పుకొచ్చారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుంది. అని వెంకయ్యనాయుడు చెప్పారు. రాజధాని విజయవంతం కావాలంటే ఎడ్యుకేషన్, ఎంటర్ టైన్ అవసరమన్నారు. లండన్‌లో వండర్ కార్నివాల్ బాగా ప్రసిద్ధి. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎంపీ కేశినేని చిన్ని కలిసి విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తామని చెప్పినప్పుడు ఆశ్చర్యానికి గురయ్యా. మెగా డిఎస్‌సి సభ కూడా ఈనెల 25న ఘనంగా నిర్వహిస్తాం అని లోకేష్ తెలిపారు విజయవాడకు విశిష్ట సేవలు అందించిన పుర ప్రముఖులను వెంకయ్య నాయుడు, లోకేష్ సన్మానించారు. విజయవాడ ఉత్సవ్ కు సంబంధించి 3 వేల మంది కళాకారులతో అతిపెద్ద కార్నివాల్ అక్టోబర్ రెండో తేదీన ఉండబోతుందని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. 11 రోజులపాటు విజయవాడ వైభవాన్ని తెలిపే విధంగా డ్రోన్ షో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా నిలుస్తుంది. పారా గ్లైడింగ్, హెలిరైడ్, లాంటి ఎంటర్టైన్మెంట్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. మైసూర్ దసరా ఉత్సవాలకు ధీటుగా విజయవాడ ఉత్సవాలు జరగాలని ఏపీ సర్కారు పట్టుదలతో ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన క్రాకర్స్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రివంగలపూడి అనిత, ఎంఎల్ఏలు వసంత కృష్ణ ప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, గద్దెరామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

23-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
విదియ తె.4.52
హస్త మ.1.41
వర్జ్యం : రా.10.34-12.20
దు.ఉ.8.22-9.10, 2) రా.10.55-11.43
శుభసమయం:ఉ.6.30-7.45
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక వ్యవహారాలలో పురోగతిని సాధిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**వృషభం:** నూతన పెట్టుబడులకు అనుకూలమైన కాలం. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మిథునం:** ఇంటా బయటా మీ మాటే చెల్లుబాటు కాగలదు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**కన్య :** ఇంటిలో శుభకార్యాలు జరుగుతాయి. బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు తీరతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**వృశ్చికం:** కొన్ని అవకాశాలు అనుకోకుండా లభిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

**మకరం:** కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. స్పెక్యులేషన్ మధ్యస్తంగా ఉంటుంది.

**కుంభం:** రావలసిన మొండి బాకీలు వసూలవుతాయి. నూతన పెట్టుబడులలో తొందరపాటు వద్దు.

**మీనం :** కుటుంబ సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# రేపు తిరుమలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సిఎం చంద్రబాబు

>> ప్రకారం సంప్రదాయంగా ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సిఎం చంద్రబాబునాయుడు రేపు తిరుమలకు చేరుకుంటూన్నారు. వీరితోబాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వస్తుండటంతో తిరుమల, తిరుపతిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇద్దరు ప్రముఖులు రేపు ,ఎల్లుండి తిరుమలలోనే ఉండటనుండటంతో భద్రతపై సోమవారం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్, తిరుపతి కమిషనర్ మౌర్యతో కలసి భద్రతా ఏర్పాట్లు, సౌకర్యాలుపై సమీక్షించారు. తిరుమలలో పద్మావతి విశ్రాంతి గృహం, బేడి ఆంజనేయస్వామి ఆలయం, శ్రీవారి ఆలయం, తిరిగి వాహనమండపం, అతిదిగృహం చేరుకోనుండటంతో పరిసరాల్లో భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణకు, డిఎస్పీ విజయ శేఖర్‌కు సూచనలు చేశారు. ప్రోటోకాల్ అంశాలు తదితర విధులుతోబాటు తిరుమలలో ముఖ్యమంత్రి పర్యటన ఆద్యంతం పోలీసు భద్రత నడుమ సాగనుంది.

# 108 సర్వీసులకు ఉరి: జగన్

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీప్రభుత్వం 108 సర్వీసులకు ఉరివేస్తోందని, దీంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. పాడేరు సమీపంలో ముల్లుమెట్టకు చెందిన నిండు గర్భిణీని తరలించేందుకు 108 సమయానికి రాలేదని పేర్కొన్నారు. దీంతో ఆటోను ఆశ్రయించడంతో అందులోనే ప్రసవించి శిశువు మరణించిందని తెలిపారు. వైసిపి హయాంలో పట్టణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 15నిముషాల్లోనే అంబులెన్సులు రావాలని నిబంధన ఉంటే అంతకంటే తక్కువసమయంలోనే వచ్చేవని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 17 నిముషాలు, గిరిజన ప్రాంతాల్లో 30 నిముషాల్లోలోపే వచ్చేవని వివరించారు. ఇప్పుడు ఎందుకు చేరుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పనిచేయడం లేదని ఈ ఘటనతో రుజువైందని తెలిపారు. ఇక ఈనెల 24వ తేదీన వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృత సమావేశం జరగనుంది. దీనికి రీజనల్ కోఆర్డినేటర్లు, ప్రధాన కార్యదర్శులు, పిఏసి మెంబర్లు, అన్నిస్థాయిల నాయకులు పాల్గొంటారని పార్టీ కార్యాలయం తెలిసింది.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
**E PROCUREMENT SHORT TENDER NOTICE**
**1. NIT No. 90/proc /MAU61-USI0HB(BG)/16/2025-HB, Dt.22-09-2025**
**NAME OF WORK :** "RFP for selection of Comprehensive Service Provider for Technical Facility Management services, House Keeping services, Security services and IT Operations & Maintenance services for APCRDA project office building at **Rayapudi, Amaravati Capital City**"
The bid can be downloaded on AP e-procurement portal from **23.09.2025** to **01.10.2025** up to **14.00 Hrs.** Pre-Bid Meeting Date. **25.09.2025.** Due date for submission of Bid **01.10.2025 up to 15.00 Hrs,** Technical bid opening **01.10.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**
Sd/- Commissioner, APCRDA, Vijayawada







సోమవారం హైదరాబాద్‌లో జరిగిన అగ్రసేన్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న అఖిలభారత వైశ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, వార్త సిఎండి డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ, హాజరైన ఫెడరేషన్ సభ్యులు

# దేశ వికాసం, సంఘ సేవలో వైశ్ సమాజ్ కీలకం

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 22:** వైశ్ సమాజ్ భగవత్ స్వరూపుడు అగ్రసేన్ మహారాజ్ 5149వ జయంతి వేడుకలను సోమవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. మహారాజ్ అగ్రసేన్ జయంతి సందర్భంగా అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ, వార్త సిఎండి డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు. అగ్రసేన్ జయంతిని పురస్కరించుకుని ఆలిండియా వైశ్ ఫెడరేషన్, తెలంగాణ అగర్వాల్ సమాజ్ సంయుక్తంగా హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని అగ్రసేన్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అఖిల భారత వైశ్య సమాఖ్య అధ్యక్షుడు గిరీష్ సంఘీతో పాటు ఇతర ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆలిండియా వైశ్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి, వార్త పత్రిక మేనేజింగ్ డైరక్టర్ గిరీష్ సంఘి మాట్లాడారు. దేశ అభివృద్ధిలో వైశ్ సమాజం కీలక పాత్రలో ఉందని, ఇదే సమయంలో సంఘ సేవలో కూడా ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశ వికాసంలో వైశ్ సమాజం ప్రధానంగా ఉందని, వైశ్ సమాజ్ లేకుండా ముందుకు వెళ్లలేదని, దేశ ఆర్థిక పరిస్థితిని శాసించే స్థితిలో వైశ్ సమాజ్ ఉందన్నారు. దేశ వికాసంలో, సంఘ సేవలో వైశ్ సమాజం ముందు వరుసలో ఉన్నందున ఇక నుంచి రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని డాక్టర్ గిరీష్ కుమార్ సంఘి పిలుపునిచ్చారు. దేశంలోని ప్రముఖ వ్యాపారసంస్థలు, పారిశ్రామిక సంస్థలు వైశ్ సమాజ్ చేతిలో ఉన్నాయని కానీ వైశ్ సమాజ్ సంఘటితంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే కాకుండా హైదరాబాద్‌లో వ్యాపారానికి పేరుగాంచిన బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, రాణిగంజ్ వైశ్ సమాజ్ చేతిలోనే ఉన్నాయన్నారు. పలు స్టీల్ ఫ్యాక్టరీలు తమ అధీనంలోనే ఉన్నాయన్నారు. ప్రముఖ బోయింగ్ ఫ్యాక్టరీ కూడా వైశ్ సమాజ్‌కి చెందిన వ్యక్తిదేనని తెలిపారు. వేలాది మందికి ఉద్యోగాలు ఇస్తున్న పలు సంస్థలు కూడా వైశ్ సమాజ్ చేతిలో ఉన్నాయన్నారు. వైశ్ సమాజ్ రాజకీయాలలో సమాజ్ నుంచి పేరున్న నాయకుడు ఒక్కరూ లేరన్నారు. వైశ్ సమాజ్ అధ్వర్యంలో ఎన్నో స్టార్టప్ కంపెనీలు, సంస్థలు ఉన్నాయని.. దేశ ఆర్థిక వ్యవస్థలో మనం కీలకంగా ఉన్నామన్నారు. ఇంత ఉన్నప్పటికీ రాజకీయంగా లేకపోవడం లోటని.. రాజకీయంగా మన నుంచి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయంగా ఎదగకపోవడంతో ఎన్నో అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని.. దీంతో అందరూ మనల్ని పిరికివారని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ డిజిపిగా కొనసాగుతున్న సీనియర్ ఐపిఎస్ జితేందర్ కూడా మన వైశ్ సమాజ్‌కి చెందిన వారేనని.. ఇంకా ఎంతో మంది ఐఏఎస్, ఐపిఎస్‌లు చాలా మంది ఉన్నారని చెప్పారు.

గతంలో వైశ్ సమాజ్ అధ్వర్యంలో భారీ బహిరంగ సభలను నిర్వహించిన చరిత్ర ఉందని గిరీష్ సంఘి గుర్తు చేశారు. ఎల్‌బి స్టేడియంలో, ఎన్‌టిఆర్ స్టేడియంలో భారీ బహిరంగ సభలను నిర్వహించామన్నారు. భవిష్యత్తుల్లోనూ అటువంటి భారీ బహిరంగ సభలను నిర్వహించాల్సిన అవసరం ఉందని.. అటువంటి పరిస్థితి కూడా వస్తుందన్నారు. అగ్రసేన్ మహారాజ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇక్కడకు వచ్చి పూలమాలలు సమర్పించడం ఆనందంగా, సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారులు ఏకే గోయల్, వినోద్ అగర్వాల్, అనిరుద్ గుప్తా (అగర్వాల్ సమాజ్ తెలంగాణ ప్రెసిడెంట్), గోపాల్ మోర్, భద్రి విశాల్ బన్సల్, సురేష్ అగర్వాల్(కార్యక్రమ కన్వీనర్), సునీల్‌కుమార్ పటోడియా, సురేష్ జగ్‌నాని(కో కన్వీనర్), మున్నాలాల్ అగర్వాల్, నరేంద్ర కుమార్ గోయల్ తదితరులు పాల్గొన్నారు. అగర్వాల్ సమాజం వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అగ్రసేన్ వేష ధారణతో ఊరేగింపుగా కళాకారులు వేదిక వచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రభుత్వ పాఠశాలల ఎదుట నో అడ్మిషన్ బోర్డులే నా లక్ష్యం: మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల వెలుపల నో అడ్మిషన్స్ బోర్డు పెట్టాలన్నదే నా లక్ష్యం. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వంద పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు పెట్టారు. రాష్ట్రంలోని 42వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇదేవిధమైన పరిస్థితి తీసుకువచ్చేలా పనిచేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. శాసనసభలో గత ప్రభుత్వం విడుదల జిఓ 117పై నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... ప్రాథమిక విద్యకు గొడ్డలిపోటులా పరిణమించిన జిఓ నెం.117, జిఓ నెం. 85లను 135 2025న రద్దుచేశాం. వాటి స్థానంలో వన్ క్లాస్ - వన్ టీచర్ ఉండేలా జి.ఓ. నెం.19,20,21 ద్వారా చర్యలు తీసుకున్నాం. గత ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెం.117 కారణంగా 10లక్షలమంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల లెర్నింగ్ అవుట్ కమ్స్ లో రాష్ట్రం వెనుకబడింది. ప్రాథమిక విద్యకు తీవ్రనష్టం కలిగించే 117 జిఓ రద్దుచేయాలని పాదయాత్రలో పలువురు ఉపాధ్యాయులు నన్ను కోరారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నతాధికారులతో 33 సమావేశాలు ఏర్పాటుచేసి, జిఓ నెం. 117 రద్దుచేసి, ప్రత్యామ్నాయ జిఓలు తెచ్చాం. అందుకు ప్రత్నామ్నాయంగా వన్ క్లాస్ వన్ టీచర్ మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకముందు కేవలం 1398 స్కూళ్లలో మాత్రమే వన్ క్లాస్ - వన్ టీచర్ ఉండగా, మేం వచ్చాక 9620 పాఠశాలలకు పెంచాం. అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు సంబంధించి గతంలో కేవలం 124 మాత్రమే ఉండగా, ప్రజాప్రభుత్వం వచ్చాక 729 పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశాం. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను దేశానికే మోడల్ గా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మన బడి -మన భవిష్యత్తు కింద ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటు చేసి దాతల ద్వారా పారదర్శక విధానంలో ఎస్ఎంసిల పర్యవేక్షణతో వివిధ పాఠశాలల అభివృద్ధికి చర్యలుచేపడుతున్నాం. దాతలు అందజేసే నిధుల ను బట్టి ఆయా పాఠశాలలకు వారి పేర్లు పెట్టే ప్రతిపాదన కూడా ఉంది. పాఠశాలలకు ఇప్పటికే స్టార్ రేటింగ్ ఏర్పాటుచేశాం. వన్‌స్టార్, 2స్టార్ పాఠశాలలను మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత శాసనసభ్యులపైఉంది. మౌలిక సదుపాయాలతోపాటు అటెండెన్స్, ఎగ్జామ్స్, పెర్ఫార్మెన్స్, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై కూడా శ్రద్ధ పెడుతున్నాం. రాబోయే రోజుల్లో ప్రైవేటు పాఠశాలల కన్నా మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, మంచి ఫలితాలు తీసుకురావడానికి కృషిచేస్తున్నాం.

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

**SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) నిబంధనల అనుసరించి జారీ చేయడమైనది.**

టు,
**ఋణగ్రహీత చిరునామా: 1)** మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్, డోర్ నెం.50-121-54/1/ఎ, డబుల్ రోడ్డు, బాలయ్య శాస్త్రి లేఅవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. **2)** మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్, డోర్ నెం.25-40/1/ఎ-ఎ, ప్లాటు నెం.21, సోమ హౌస్, వీధి నెం.1, అనంత సరస్వతి నగర్, ఈస్ట్ ఆనందభాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, తెలంగాణ-500047. **3) శ్రీ ఎ.ఎల్.ఎస్.వర్మ,** తండ్రి: ఎ.సీతారామచంద్రరాజు, డోర్ నెం.49-54-16/3, ఫ్లాట్ నెం.502, మాధురి రెసిడెన్సీ, బాలయ్య శాస్త్రి లేఅవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క మేనేజింగ్ పార్టనర్), 4) శ్రీ ఎ.ఎల్.ఎస్.వర్మ,** తండ్రి: శ్రీ ఎ.సీతారామచంద్రరాజు, డోర్ నెం.49-54-15/53/1, ఫ్లాట్ నెం.101, వినాయక రెసిడెన్సీ, బి.ఎస్.లేఅవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క మేనేజింగ్ పార్టనర్ మరియు హామీదారు), 5) శ్రీమతి ఎ.సువర్ణ,** భర్త : శ్రీ ఎ.ఎల్.ఎస్.వర్మ, డోర్ నెం.49-54-16/3, ఎఫ్.502, మాధురి రెసిడెన్సీ, బాలయ్య శాస్త్రి లేఅవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్ మరియు హామీదారు), 6) శ్రీమతి ఎ.సువర్ణ,** భర్త : శ్రీ ఎ.ఎల్.ఎస్.వర్మ, డోర్ నెం.49-54-15/53/1, ఫ్లాట్ నెం.101, వినాయక రెసిడెన్సీ, బి.ఎస్.లేఅవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-530013. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్ మరియు హామీదారు), 7) శ్రీ ఎ.సీతారామచంద్రరాజు,** తండ్రి: గోపాల కృష్ణంరాజు, డోర్ నెం.8-54, అంతర్వేదిపాలెం, చిన్నపాలెం, వి.వి.మెరక, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా-533251. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్ మరియు హామీదారు), 8) శ్రీమతి అల్లూరు రంగ వర ప్రసాద్ రమాదేవి,** భర్త : శ్రీ ఎ.సీతారామచంద్రరాజు, డోర్ నెం.8-54, అంతర్వేదిపాలెం, చిన్నపాలెం, వి.వి.మెరక, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా-533251. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్ మరియు హామీదారు), 9) శ్రీమతి జి.వి.యస్.పద్మావతి,** భర్త : శ్రీ జి.వి.వి.ఆర్.పి.వర్మ, డోర్ నెం.25-40/1/1ఎ-ఎ1, సోమ హౌస్, యస్‌టి-1, అనంత సరస్వతి నగర్, ఆనందభాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, తెలంగాణ-500047 **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్ మరియు హామీదారు అలాగే లేట్ శ్రీ జివివిఆర్‌పి వర్మ, హామీదారు గారి లీగల్ వారసులు). 10) శ్రీమతి జి.సురేఖ,** భర్త: శ్రీ.జి.స్యజన్, 25-40/1/1ఎ-ఎ1, సోమ హౌస్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, తెలంగాణ-500047. **(మెస్సర్స్ తాన్యా ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క హామీదారు లేట్ శ్రీ జివివిఆర్‌పి వర్మ గారి లీగల్ వారసులు).**

సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి **తేది.05-08-2017**న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.30-07-2017** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.7,67,79,435/-** (అక్షరాల ఏడు కోట్ల అరవై ఏడు లక్షల డెబ్బై తొమ్మిది వేల నాలుగు వందల ముప్పై అయిదు రూపాయలు మాత్రమే) **+ తేది.30.07.2017** నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున మీరు తనఖా పెట్టిన సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **దిగువ తెలిపిన తేదీలలో** స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది.18-02-2018న (సాక్షి : హైదరాబాద్, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల ఎడిషన్‌లో (తెలుగు)** మరియు **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : హైదరాబాద్, విశాఖపట్నం మరియు తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

**తేది.05-08-2017** నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల బ్యాంక్‌నకు తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం/బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

**ఆస్తి నెం.1 (స్వాధీనత తీసుకున్న తేది:12.02.2018):** రంగారెడ్డి జిల్లా, మల్కాజిగిరి మండలం, ఈస్ట్ ఆనంద్‌భాగ్, అనంత సరస్వతి నగర్, సర్వే నెం.574, ప్లాట్ నెం.21లోని 242 చ॥గ॥లు లేదా 202.0 చ॥మీ॥ల ప్లింత్ ఏరియాలో 3540 చ॥అ॥లు (క్రింద అంతస్తు 1770.0 చ॥అ॥లు మరియు మొదటి అంతస్తు 1770 చ॥అ॥లు) ప్లింత్ ఏరియాతో డి.నెం.25-40/1/1/ఎ-ఎ (పాత నెం.45-132/21) ఆర్‌సిసి రూఫ్ నివాస ఇల్లు **రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.3514/2010, తేది.19.10.2010** ప్రకారం **శ్రీ వి.వి.ఆర్.పి.వర్మ** గారికి చెందినది. **హద్దులు: తూర్పు:** 30 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** పొరుగువారి ఇల్లు, **పడమర :** హెచ్ నెం.45-132/20, **ఉత్తరం:** 20 అ॥ల వెడల్పు రోడ్డు.

**ఆస్తి నెం.2 (స్వాధీనత తీసుకున్న తేది:15.02.2018):** తూర్పు గోదావరి జిల్లా, సఖినేటపల్లి మండలం, వివి మెరక పంచాయితీ, అంతర్వేదిపాలెం, గవర్నమెంట్ హైస్కూల్ దగ్గర, ఆర్ సర్వే నెం.382/1, 383/4 & 383/6లోని 4840 చ॥గ॥ల విస్తీర్ణంలో డోర్ నెం.8-54/ఏతో గల 332.29 చ॥మీ॥లు + 95.31 చ॥మీ॥లు మండువా లోగిల్లు, 295 చ॥అ॥ల ఎసి షీట్ రూఫ్‌తో కూడిన యావధాస్తి **సేల్ డీడ్ నెం.1689/2007, తేది:08.08.2007** ప్రకారం **శ్రీ ఎ.సీతారామచంద్రరాజు, తండ్రి: లేట్ ఎ.గోపాలకృష్ణంరాజు** గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** ఎన్.డి.వరప్రసాద్ & ఇతరుల భూమి, **దక్షిణం:** సర్వే నెం.383/6లోని భూమి, **పడమర :** సర్వే నెం.383/1, 2, 3 & 4 మరియు 382/1లోని భూమి, **ఉత్తరం:** ఎయుఎంవిఎస్ఎస్ఎన్ రాజు గారి భూమి.

**ఆస్తి నెం.3 (స్వాధీనత తీసుకున్న తేది:15.02.2018):** తూర్పు గోదావరి జిల్లా, సఖినేటపల్లి మండలం, వివి మెరక పంచాయితీ, అంతర్వేదిపాలెం, గవర్నమెంట్ హైస్కూల్ దగ్గర, ఆర్ సర్వే నెం.383/1,2 & 382/1 లోని 2.04 సెంట్ల విస్తీర్ణంలో డోర్ నెం.8-51, 8-52 & 8-53తో గల రైస్ మిల్ షెడ్ (695.59 చ॥మీ॥లు) మరియు క్యాటిల్ షెడ్ (220.52 చ॥మీ॥లు)లతో కూడిన ఖాళీ స్థలం యావధాస్తి **గిఫ్ట్ డీడ్ నెం.1688/2007, తేది:08.08.2007 మరియు 1699/2007** ప్రకారం **శ్రీ ఎ.సీతారామచంద్రరాజు, తండ్రి: లేట్ ఎ.గోపాలకృష్ణంరాజు** గారి పేరున కలదు. **సర్వే నెం.382/1 ఎ.1.00కు హద్దులు: తూర్పు:** ఎన్. దేవ వరప్రసాద్ గారి భూమి, **దక్షిణం:** సర్వే నెం.383/4లోని భూమి, **పడమర :** మొండూరి చినవెంకటేశ్వర్లు గారిభూమి, **ఉత్తరం:** ఎ.సీతారామచంద్ర రాజు గారి భూమి. **సర్వే నెం.383/4 ఎ.0.40కు హద్దులు: తూర్పు:** సర్వే నెం.383/4లోని భూమి, **దక్షిణం:** పంట బోదె, **పడమర :** సర్వే నెం.383/6లోని భూమి, **ఉత్తరం:** ఈ సర్వే నెం.లోని భూమి.

**ఆస్తి నెం.4 (స్వాధీనత తీసుకున్న తేది:14.02.2018):** విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం యస్ఆర్‌ఓ, భీమునిపట్నం మండలం, చేపల ఉప్పాడ గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.16/2ఎలోని మొత్తం విస్తీర్ణం ఎ.1.57 సెంట్లులో ఎ.0.26 సెంట్లు లేదా 0.104 హెక్టార్ల ఖాళీ ప్లాటు యావధాస్తి **సేల్ డీడ్ నెం.4161/2014, తేది:23.08.2014** ప్రకారం **శ్రీ అల్లూరి లక్ష్మీనరసింహవర్మ, తండ్రి: సీతారామచంద్ర రాజుగారికి** చెందినది. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** శ్రీమతి ఎఆర్‌విపి రమాదేవిగారి భూమి, **పడమర :** రాస్తా మరియు టి.నూకన్న మరియు ఇతరుల డ్రై భూమి, **ఉత్తరం:** డా॥ఎ.సువర్ణ గారి భూమి.

**ఆస్తి నెం.5 (స్వాధీనత తీసుకున్న తేది:14.02.2018):** విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం యస్ఆర్‌ఓ, భీమునిపట్నం మండలం, చేపల ఉప్పాడ గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.16/2ఎలోని మొత్తం విస్తీర్ణం ఎ.1.57 సెంట్లులో ఎ.0.26 సెంట్లు లేదా 0.104 హెక్టార్ల ఖాళీ ప్లాటు యావధాస్తి **సేల్ డీడ్ నెం.4159/2014, తేది:23.08.2014** ప్రకారం **శ్రీమతి అల్లూరు సువర్ణ, భర్త: అల్లూరి లక్ష్మీనరసింహవర్మగారికి** చెందినది. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** డా॥ఎ.ఎల్.ఎస్.వర్మగారి భూమి, **పడమర :** రాస్తా మరియు టి.నూకన్న మరియు ఇతరుల డ్రై భూమి, **ఉత్తరం:** రోడ్డు.

**ఆస్తి నెం.6 (స్వాధీనత తీసుకున్న తేది:14.02.2018):** విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం యస్ఆర్‌ఓ, భీమునిపట్నం మండలం, చేపల ఉప్పాడ గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.16/2ఎలోని మొత్తం విస్తీర్ణం ఎ.1.57 సెంట్లులో ఎ.0.26 సెంట్లు లేదా 0.104 హెక్టార్ల ఖాళీ ప్లాటు యావధాస్తి **సేల్ డీడ్ నెం.4157/2014, తేది:23.08.2014** ప్రకారం **శ్రీ అల్లూరి సీతారామచంద్ర రాజుగారికి** చెందినది. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** రోడ్డు, **పడమర :** జివివిఆర్‌పి వర్మ & పద్మావతి గార్ల డ్రై భూమి, **ఉత్తరం:** శ్రీమతి ఎఆర్‌విపి రమాదేవిగారి భూమి

**ఆస్తి నెం.7 (స్వాధీనత తీసుకున్న తేది:14.02.2018):** విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం యస్ఆర్‌ఓ, భీమునిపట్నం మండలం, చేపల ఉప్పాడ గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.16/2ఎలోని మొత్తం విస్తీర్ణం ఎ.1.57 సెంట్లులో ఎ.0.26 సెంట్లు లేదా 0.104 హెక్టార్ల ఖాళీ ప్లాటు యావధాస్తి **సేల్ డీడ్ నెం.4156/2014, తేది:23.08.2014** ప్రకారం **శ్రీమతి అల్లూరి రంగా వర ప్రసాద్ రమాదేవి, భర్త: అల్లూరు సీతారామచంద్ర రాజుగారికి** చెందినది. **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** శ్రీ ఎ.ఎస్.రాజు గారి భూమి, **పడమర :** టి.నూకన్న & నాగరత్నం గార్ల డ్రై భూమి, **ఉత్తరం:** శ్రీ ఎఎల్ఎస్ వర్మగారి భూమి.

తేది: 19-09-2025
ప్రదేశం: విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలకు

# నేడు 'అంకురార్పణ'



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమలలో స్వయంగా బ్రహ్మదేవుడు నిర్వహించే శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సప్తగిరులు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం నుండి తొమ్మిదిరోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా నేటి(మంగళవారం) రాత్రి 'అంకురార్పణ' కార్యక్రమం వేదోక్తంగా చేపట్టనున్నారు. ఆలయానికి నైరుతివైపు ఉన్న వసంతోత్సవమండపంలో స్వామివారి సర్వసేనాధిపతి విశ్వక్సేనులవారి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పుట్టమన్నుసేకరించి దాంతో నవధాన్యాలు మొలకెత్తించే కార్యక్రమం శ్రీకారం చుడతారు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం మీనలగ్నంలో గోధూళి సమయంలో ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి శ్రీమలయప్పస్వామికి బుధవారం ఉదయం బంగారువాకిలిలో విశేష సమర్పణ చేస్తారు. యాగశాలలో సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఉత్సవర్లతో బాటు అనంత,గరుడ,చక్రత్తాళ్వార్, సేనాధిపతి ధ్వజపటం తదితరాలు తిరుచ్చిలో నాలుగుమాఢ వీధులప్రదక్షిణగా ఆలయానికి వేంచేపుచేస్తారు. సాయంత్రం 5.43గంటల నుంచి 6.15గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజ స్తంభంపైకి గరుడ పటాన్ని అధిరోహిస్తారు. ఈ గరుడ పటం ధ్వజా రోహణంతో వెంకన్న బ్రహ్మో త్సవ వాహన సేవలు మొదలవుతాయి. రేపు రాత్రి రాష్ట్ర ప్రభు త్వం తరపున ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దంపతులు తిరుమలకు చేరుకుని పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారు. తొలివా హనంగా బుధవారం రాత్రి 9గంటలకు వైకుంఠ శ్రీమహావిష్ణువు కలియుగప్రత్యక్షదైవంగా శ్రీనివాసుడు అవతారంలో ఏడుతలల పెద్దశేషవాహనంపై అధిరోహించి ఆలయమాఢవీధుల్లో ఊరేగుతారు. అక్టోబర్ 1వతేదీ బుధవారం రాత్రి అశ్వవాహనసేవవరకు వివిధ వాహనసేవలు ఉదయం,రాత్రి వేళల్లో ఆగమోక్తంగా జరుగుతాయి. 24వతేదీ రాత్రి రంగ నాయకుల మండపంలో 2026కు సంబంధించిన నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఆలయంలో జరిగే సుప్రభాతం మినహా మిగిలిన తోమాల,అర్చన ,కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలుతోబాటు తొమ్మిదిరోజులు అన్ని ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దుచేశారు. పూర్తిగా సర్వదర్శనంలో మాత్రమే భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఆలయ మాఢవీధుల్లో వాహనసేవలు నిర్వహిస్తుండటంతో దసరా సెలవులు ప్రారంభంతో భారీగా భక్తులు తిరుమలకు చేరుకోనున్నారు. భక్తుల రద్దీకి తగ్గట్లు టిటిడి అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు.

**రేపు ధ్వజారోహణం - పట్టువస్త్రాల సమర్పణకు తిరుమలకు సిఎం చంద్రబాబు**

# తిరుమల సమాచారం

## రేపటి ధ్వజారోహణానికి దర్భచాప,తాడు కీలకం

### - అటవీశాఖ విభాగం సిద్ధం



**తిరుమల,సెప్టెంబర్ 22 ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుమల ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ధ్వజారోహణ ఘట్టానికి అవసరమైన దర్భచాప,తాడును టిటిడి అటవీశాఖ సిద్ధం చేసింది. డిఎఫ్ఓ ఫణికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది కొద్దిరోజులుపాటు ప్రత్యేక విష్ణుదర్భకోసం ఏర్పేడు మండలం చెల్లూరుగ్రామంలోనిని అటవీప్రాంతంలో సేకరించారు. ఈ దర్భను వారంరోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరచి చాప,తాడుతయారుచేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నరఅడుగుల వెడల్పుతో 60కిలోల బరువున్న దర్భచాపను, 255 మీటర్ల పొడవైన 106కిలోల తాడు సిద్ధంచేశారు. వీటిని సోమవారం సాయంత్రం తిరుమలకు తీసుకువచ్చి ఆలయంలోకి చేర్చారు. రంగనాయకుల మండపంలో వీటికి డిఎఫ్ఓ ఫణికుమార్‌నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అధికారులకు అందజేశారు. బ్రహ్మోత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణంలో ధ్వజస్తంభానికి ఈ దర్భచాప,తాడును కడతారు. తిరుమలలో విష్ణుదర్భను పూజలకు వినియోగించడం ప్రత్యేకత.

## 27న తిరుమలకు గరుడసేవ గొడుగులు



**తిరుమల, సెప్టెంబర్22 ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠ వాసుడు శ్రీవేంకటేశ్వర స్వామికి ఏటా జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు తమిళనాడు చెన్నై నుంచి హిందూ ధర్మార్థ సమితి గొడుగులు తీసుకురావడం పరిపాటి. ఈ గొడుగులు 28వతేదీ ఆదివారం రాత్రి తిరుమలలో జరిగే గరుడసేవకు అలంకరిస్తారు.అయితే ఈ గొడుగులను ట్రస్టీ, భక్తుల మధ్యకాలినడకన బయలుదేరి తీసుకువస్తారు. ఆదివారం ఉదయం ఈ గొడుగులకు చెన్నైలో హిందూధర్మార్థసమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్ జీ, మేనేజింగ్ ట్రస్టీ వేదాంతంజీ నేతృత్వంలో గొడుగులు ఊరేగింపు మొదలైంది. చెన్నైనుంచి ఈ గొడుగులు పంపడం, ఆదివారం ఉదయం చెన్నైలోని పూలబజారు చెన్నకేశవస్వామి ఆలయం నుంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బయలుదేరారు. చెన్నై నుంచి ఊరేగింపుగా గొడుగులు తీసుకువస్తూ మార్గమధ్యంలో భక్తులు పూజలు,కర్పూర హారతులిస్తారు. దారిపొడవునా పెద్దసంఖ్యలో భక్తులు గోవిందనామస్మరణలతో గొడుగులను దర్శించుకుని తిరుమలకు సాగనంపుతారు.

## రూ.1.80 కోట్ల విలువైన 15 బంగారు పతకాలు, వెండి తట్టలు విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 22ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామికి అలంకరించేందుకు 15 బంగారు పతకాలు,కైంకర్యాల కోసం రెండు వెండి తట్టలను విద్యాధీశతీర్థస్వామి విరాళంగా అందజేశారు.శ్రీసంస్థాన్ గోకర్ణ పర్తగాళి జీవోత్తమ మఠం మఠాధిపతి విద్యాధీశతీర్థస్వామి 1.80కోట్ల రూపాయలు విలువైన ఆభరణాలను అందించారు. సోమవారం ఉదయం స్వామి శిష్యులతో కలసి వాటిని తీసుకువచ్చి శ్రీవారి ఆలయంలోపల రంగనాయకుల మండపంలో ఆలయ పేష్కార్ రామకృష్ణకు కానుకలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బొక్కసం ఇన్‌ఛార్జి గురురాజస్వామి అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీవారికి చేరే గొడుగులకు భక్తితో స్వాగతం

**తిరుమల,సెప్టెంబర్ 22(ప్రభాత వార్త ప్రతినిధి)** కలియుగవైకుంటం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్స వాలు ప్రారంభమవుతున్న సమయంలో బ్రహ్మోత్సవాల వాహన సేవలో వినియోగించే గొడుగులను ఊరేగింపుగా తీసుకు వస్తారు. చెన్నై నుండి ఫోవైసీ అలిమేలు మంగమ్మ ట్రస్ట్ నిర్వాహకులు గోపాల కృష్ణ , ఈదయ చంద్రం నిరంజన్ ద్వారా 8 గొడుగులు గత పది సంవత్సరాలుగా తీసుకువస్తున్నారు. ఈ గొడుగులు పాదయాత్ర సోమవారం తిరుపతికి చేరుకోవడంతో స్థానిక రాముల వారి ఆలయం వద్ద స్థానిక భక్తులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తిరుమలకు తరలించారు. ఈ పూజాది కార్యక్రమంలో టీటీడీ మాజీ బోర్డ్ మెంబర్లు పోకల అశోక్ కుమార్, పసుపులేటి హరిప్రసాద్, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కూటమి నాయకులు ఊకా విజయ్ కుమార్, పోనగంటి భాస్కర్, గోపాల్, సింగంశెట్టి సుబ్బరామయ్య, పోకల జనార్ధన్, హనుమంతరావు, కంబాలరాము, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండె చెంగారెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, రవి ప్రసాద్, చెన్నం నవీన్, రెడ్డిబాబు, మణికంఠ, వాసు భక్తులు పాల్గొన్నారు.

# 'వృత్తి పట్ల నిబద్ధతతో పని చేయండి'

## సేఫ్టీ అవార్డుల ప్రదానోత్సవంలో రైల్వే జిఎం శ్రీవాత్సవ

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 22, ప్రభాత వార్త:** ప్రస్తుత వర్షాకాలంలో రైలు ప్రయాణీకుల భద్రతకు, రక్షణలను దృష్టిలో ఉంచుకొని భద్రతా విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని లని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజీవ్ కుమార్ శ్రీవాత్సవ ఉద్ఘాటించారు. సోమవారం రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో జరిగిన భద్రతా,సమయపాలన సమీక్షా సమావేశంలో అదనపు జీఎం సత్యప్రకాష్, ప్రిన్సిపల్ సి ఎస్ ఓ కె.వెంకట రమణారెడ్డి డిప్యూటీ జీఎం మల్లాది శ్రీనివాస్, డిప్యూటీ సి ఎస్ ఓ (మెకానికల్) కిశోర్, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత జోనల్ ఉన్నతాధికారులతో కలిసి జోన్ లో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వే స్టేషన్ లలో మార్గదర్శకాలు అందించేందుకు మరికొంత మంది సిబ్బందిని నియమించుకోవాలని ఆయన సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు.ఈఏడాది ఆగష్టు మాసంలో జోన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా రైలు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసిన సికింద్రాబాద్ డివిజన్ లో ముగ్గురికి, హైదరాబాద్,విజయవాడ డివిజన్ లో ఇద్దరికి చొప్పున, గుంతకల్లు రైల్వే డివిజన్ లో రాయచూరులో లోకో పైలట్ గా పనిచేస్తున్న దరబ్ సింగ్ మీనా, గుంతకల్లులో కీ మెన్ గా పనిచేస్తున్న బాలరాజు, డోన్ రైల్వే స్టేషన్ మేనేజర్ గా పనిచేస్తున్న ఎన్. లాబన్, కలమలలో పాయింట్స్ మెన్ గా పనిచేస్తున్న రాజేష్ కుమార్ లతో పాటు, గుంటూరు,నాందేడ్ డివిజన్లలో పనిచేస్తున్న ఒకొక్కరితో కలిపి మొత్తం 13 మంది భద్రతా విభాగాల సిబ్బందికి రైల్వే భద్రతా అవార్డులను జి ఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ ప్రధానం చేశారు.సమావేశంలో గుంతకల్లు డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డి ఆర్ ఎం సుధాకర్ లతో పాటు జోన్ పరిధిలోని అన్ని డివిజన్ లో డి ఆర్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న బాలలు సువాసినులు

## బాలా త్రిపుర సుందరీ దేవిగా పూజలందుకున్న సువాసినులు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో మొదటిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చింది.సువాసినులను బాలా త్రిపుర సుందరి అవతారంగా భావిస్తూ సువాసీనులుగా పూజలు అందుకున్నారు.

## సిఎం చంద్రబాబు, టిజి సిఎం రేవంత్‌రెడ్డికి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** 'ఓజీ' చిత్రానికి సహకారం అందించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియచేశారు. సినిమా పరిశ్రమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అందుతున్న ప్రోత్సాహకాలకు ఇరువురు ముఖ్యమంత్రులూ చూపిస్తున్న చొరవే కారణమని కొనియాడారు. ఇవాళ హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ కన్సెర్ట్‌కు అనుమతులు ఇవ్వడంలో తెలంగాణ ప్రభుత్వం సహకరించింది. తెలంగాణ మంత్రివర్గ సభ్యులకు, డీజీపీ జితేందర్‌కి,హైదరాబాద్ సిటీ పోలీస్ కమీషనర్ సివి ఆనంద్‌కి లాల్ బహదూర్ స్టేడియం నిర్వాహకులు,అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భారీ వర్షం కురుస్తున్నా ఈ వేడుకలో ఎనలేని ఉత్సాహంతో అసంఖ్యాకంగా అభిమానులు పాల్గొన్నారు. వారు చూపిస్తున్న అభిమానం,ఉత్సహం మరువలేనిది వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ కార్యక్రమ నిర్వహణలో భాగం పంచుకున్న శ్రేయాస్ మీడియా సంస్థకు,బందోబస్తు చేపట్టిన పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ చిత్రానికి సహకరించిన కూటమి ప్రభుత్వ మంత్రివర్గ సహచరులకు,పోలీసు,రెవిన్యూ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ఈ సినిమాకు ప్రచారం కల్పిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్,వెబ్ మీడియా యాజమాన్యాలు, ఫొటోగ్రాఫర్లు,వీడియోగ్రాఫర్లు,విలేకర్లకు కృతజ్ఞతలు.'ఓజీ' చిత్ర రూపకల్పనలో ఎంతో తపించి పని చేసిన దర్శకుడు సుజిత్,నిర్మాతలు డివివి దానయ్య,కళ్యాణ్ దాసరి,సంగీత దర్శకుడు తమన్,నటీనటులు, రచయితలు, సాంకేతిక నిపుణులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను అని పవన్ కళ్యాణ్ ప్రకటన విడుదల చేశారు.

## శ్రీశైలానికి 3లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** కృష్ణమ్మకు రోజు రోజుకు వరద ఉధృతి పెరుగుతున్నది. నది ఉగ్రరూపం దాల్చుతున్నది. దీంతో కృష్ణానదిపై ఉన్నప ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. సోమవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 883.30అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 206.0996 టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల వపర్‌హౌజ్ ద్వారా 29083 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 2,36, 742క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 15717క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,356క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 12అడుగులు ఎత్తి 3,12,260క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 3,19,766క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.

# వాట్సాప్ గవర్నెన్స్‌తో 751 పౌరసేవలు




## సాంకేతికతతో ప్రజలకు చేరువగా పాలన : సిఎం చంద్రబాబు

**విశాఖ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** పాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యంత ముఖ్యమైన అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సాంకేతికతతోనే ప్రజలకు పాలను మరింత చేరువ చేసే అవకాశం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర ఐటీ సమాచార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ ఈ గవర్నెన్సు సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్ సర్వీసెస్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్ తో జరుగుతున్న 28వ జాతీయ ఈగవర్నెన్సు సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు.ప్రభుత్వ శాఖల ద్వారా అందే పౌర సేవలను మరింత సమర్ధంగా నిర్వహించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతికత కీలకమని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఐటీ, ఈ గవర్నెన్సు అంశాలతో పాలనలో మార్పులు వచ్చాయని ముఖ్యమంత్రి అన్నారు. కమ్యూనికేషన్ సంస్కరణల ద్వారా ప్రజా జీవనంలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని స్పష్టం చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుని గతంలోనే ఉమ్మడి ఏపీలో ఈసేవ, మీసేవ ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లామని సీఎం అన్నారు. ఈఫైల్స్ , ఈకేబినెట్ లాంటి అంశాలతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందని అన్నారు. అలాగే ఈ వ్యవస్థలను అమలు చేసే సమయంలో సైబర్ సెక్యూరిటీ కూడా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఐటీతో వచ్చిన విస్తృత ప్రయోజనాలను అందిపుచ్చు కోగలుగుతున్నామని అన్నారు. ఈ ప్రక్రియను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు మనమిత్ర వాట్సప్ గవర్నెన్సును అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. మొత్తం 751 పౌరసేవల్ని వాట్సప్ ద్వారా పౌరులకు అందిస్తూ పాలనను వారి మొబైల్ ఫోన్ల వరకూ తీసుకెళ్లామని స్పష్టం చేశారు. మరోవైపు సాంకేతికత కారణంగా పొరుగు రాష్ట్రాలతోనూ పోటీ పెరిగిందని సీఎం అన్నారు. సంజీవని ప్రాజెక్టు దేశవ్యాప్తంగా అమలుకు అవకాశంఆంధ్రప్రదేశ్ లో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలతో కలిసి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. క్వాంటం కంప్యూటర్ సేవలను ప్రభుత్వాలు, విద్య, వైద్య సంస్థలు వినియోగించుకునే అవకాశం ఉందని సీఎం సూచించారు. క్వాంటం వ్యాలీతో ఇక్కడ ఓ ఎకో సిస్టం ఏర్పాటు అవుతోందని సీఎం తెలిపారు. క్వాంటం కంప్యూటర్లు, పరికరాల తయారీ సంస్థలు కూడా పెట్టుబడులతో ముందుకు వచ్చాయని ముఖ్యమంత్రి వివరించారు. టెక్నాలజీ పరంగా సేవలు, ఉద్యోగాలు, ఉత్పాదన తదితర రంగాలు కూడా వేగంగా మారుతున్నాయని ఈ పరిస్థితుల మధ్య వచ్చే 10 ఏళ్ల కాలం మన దేశానికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన స్వదేశీ ఉత్పత్తుల నినాదాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపిన ముఖ్యమంత్రి.. దానికి అనుగుణంగా దేశంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్ గా మారాలన్నారు. ఏపీలో వైద్య సేవలను టెక్నాలజీతో అనుసంధానం చేసే సంజీవని ప్రాజెక్టు చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని త్వరలో ఈ వ్యవస్థను మొత్తం దేశానికీ అమలు చేసేందుకు అస్కారం ఉందని అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు ఏమేరకు ఈజ్ ఆఫ్ లివింగ్ ను చేరువ చేశామన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# విజయవాడ ఉత్సవ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

## - హెలికాప్టర్ రైడ్ ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో దసరా పండుగ సందర్భంగా ఉత్సవ్ ఎగ్జిబిషన్,హెలికాప్టర్ రైడ్‌ను రాష్ట్ర రవాణా,యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. అనంతరం హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపి కేశినేని నాని,శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంటగ్ విజయవాడ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో వినోదం,విజ్ఞానం,వాణిజ్యం సమ్మిళితమై ఉండి,కుటుంబాలందరికీ వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించే వేదికగా నిలవనుంది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ ధర్మం అధర్మంపై,సత్యం అసత్యంపై సాధించిన విజయానికి ప్రతీక. ఈ పవిత్ర సందర్భంలో ప్రారంభమైన ఉత్సవ్ ఎగ్జిబిషన్ విజయవాడ ప్రజల ప్రతిభ,వ్యాపారాన్ని సంస్కృతిని దేశానికి చూపించే వేదిక అవుతుందని పేర్కొన్నారు. ఇక విజయవాడ ఉత్సవ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం దేశ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందని గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జరుగుతున్న ఈ మహోత్సవం ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ కార్నివల్‌గా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. స్పీకర్ కార్యాలయంలో శాసనసభ్యులు బోండా ఉమా,గద్దె రామ్మోహన్,బోడె ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి విజయవాడ ఉత్సవానికి ఆహ్వానం అందచేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సెప్టెంబరు 22 నుండి అక్టోబరు 2 వరకు పున్నమిఘాట్,తుమ్మలపల్లి కళాక్షేత్రం,ఎంజీ రోడ్,ఘంటశాల సంగీత కళాశాల,విజయవాడ ఎక్స్పో వేదికలపై జరిగే ఈ ఉత్సవం విజయవాడ సాంస్కృతికంగా గౌరవాన్ని మరింతగా పెంచుతుందని తెలిపారు. అమ్మవారి దసరా శోభాయాత్రల నడుమ జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా 'ఒక్క నగరం-ఒకే ఉత్సవం'అనే భావనతో నిర్వహణ జరుగుతుందని స్పీకర్ అన్నారు. ఈ ఉత్సవంలో రాష్ట్ర ప్రజలందరూ పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. దేవి కనకదుర్గ అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.'విజయవాడ ఉత్సవ్' తెచ్చిన శోభతో నగరం ప్రకాశం బ్యారేజీలా తొణికిసలాడుతోంది. ఏ కూడలి చూసినా 'ఉత్సవ్' ఉత్సాహమే ఉట్టిపడేలా ప్రభుత్వ యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. 'ది వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టివ్ కార్నివాల్' పేరుతో సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు సినీ,కళా,సాంస్కృతిక,క్రీడా వైభవాన్ని చాటే ప్రదర్శనలు ప్రజలను అలరించనున్నాయి. సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ అధ్వర్యంలో పర్యాటకశాఖ సహకారంతో ఈ వేడులకు నిర్వహిస్తున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు,మంత్రి లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరై పున్నమి ఘాట్ వేదికపై వేడుకలు ప్రారంభించనున్నారు.గొల్లపూడి లోని ఎక్స్‌పో మైదానంలో అమ్యూజిమెంట్ పార్కులు,గ్లోబల్ విలేజ్,ఎక్స్‌పో,ఫుడ్ కోర్టులు,మార్కెట్స్,ఓపెన్ ఎయిర్ థియేటర్,ప్రముఖ గాయకుల లైవ్ మ్యూజిక్,సినీ వేడుకలు.తుమ్మలపల్లి కళాక్షేత్రం,ఘంటశాల సంగీత కళాశాలల్లో,కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు,నాటకాలు,హరికథలు,బుర్రకథలు, తోలు బొమ్మలాటలు కృష్ణా నది పక్కనే ఉన్న పున్నమి ఘాట్ వేదికపై దాండియా నృత్యాలు,లైవ్ బాండ్స్,క్లాసికల్ ఎంటర్‌టైన్‌మెంట్,ఫుడ్ కోర్టులు,లేజర్ షో,వాటర్ స్పోర్ట్స్,డ్రోన్ షో,బాణసంచా ప్రదర్శనలు ఉంటాయి.ఎస్ అండ్ మిసెస్ క్రౌన్ విజయవాడ,బందరు రోడ్డులో కళాకారులతో మెగటా కార్నివాల్ వాక్,విజయవాడ ఐడల్ షో,అగ్ని సినీ అవార్డులు,సోషల్ మీడియా అవార్డులు, స్వచ్ఛథాన్ పరుగుల వేడుక,సిద్ధార్థ వైద్య కళాశాల వద్ద హెలికాప్టర్ రైడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



## దత్తమందిరంలో వేడుకగా దేవీనవరాత్రులు

**తిరుపతి,సెప్టెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** మొగలిచెర్లలోని అవధూత దత్తాత్రేయమందిరంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు, భవానీదీక్షలు వేడుకగా ఆరంభమయ్యాయి. సోమవారం ఉదయం మందిరంలో ప్రత్యేకంగా దుర్గామాతను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు చేరుకుని భవానీదీక్ష మాలధారణ చేశారు. నెల్లూరుజిల్లా లింగసముద్రం మండలం మొగిలిచెర్ల గ్రామంలోని దత్తాత్రేయమందిరంలో దేవీనవరాత్రులను ప్రతి ఏటా అంగరంగవైభవంగా ఆలయ నిర్వాహకులు, వ్యవస్థాపక ధర్మకర్త పవనినాగేంద్రప్రసాద్ ,పవని విష్ణుకౌశిక్ ఆధ్వర్యంలో జరుగుతాయి. ఈ ఏడాది ఈ వేడుకలు దత్తాత్రేయమందిరంలో తొమ్మిదిరోజులు నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం యధాతథంగా జరుగుతుంది. మరిన్ని వివరాలకు 9908973699, 9182882632 నంబర్లకు సంప్రదించాలని నాగేంద్రప్రసాద్ కోరారు.

## మనీలాండరింగ్ కేసులో నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ పిటిషన్‌కు సుప్రీం తిరస్కృతి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** దగ్గామోసగాడు సుకేష్‌చంద్రశేఖర్‌కు సంబంధించిన 200 కోట్ల మనీలాండరింగ్‌కేసులో ఈడీ అధికారులు తనపై నమోదుచేసిన ఇసిఐఆర్‌ను రద్దుచేయాలంటూ బాలివుడ్‌నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని ప్రకటించింది. ఈ స్థితిలో జోక్యంచేసుకోలేమన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
E PROCUREMENT SHORT TENDER NOTICE
1. NIT No. 90/proc /MAU61-USI0HB(BG)/16/2025-HB, Dt.22-09-2025
NAME OF WORK : "RFP for selection of Comprehensive Service Provider for Technical Facility Management services, House Keeping services, Security services and IT Operations & Maintenance services for APCRDA project office building at **Rayapudi, Amaravati Capital City**"
The bid can be downloaded on AP e-procurement portal from **23.09.2025** to **01.10.2025** up to **14.00 Hrs.** Pre-Bid Meeting Date. **25.09.2025.** Due date for submission of Bid **01.10.2025 up to 15.00 Hrs,** Technical bid opening **01.10.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**
Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

రచయిత ఆవేశం రచన చేసేవరకే కాదు, సమాజం మారే వరకూ ఉండాలి.

- చార్లెస్ డీగాల్

# అడ కత్తెరలో 'ఆక్వాసాగు'!

ఆక్వాకు ఆయువుపట్టుగా ఉన్న తీర ప్రాంత జీవనోపాధిని అమెరికా దెబ్బకొడ్తోంది. తీరప్రాంతమేకాదు వివిధ జిల్లాలో రొయ్యల చెరువుల పెంపకందార్ల జీవన విధానం ఒక్కసారిగా కుదేలైపోయింది. భారతదేశంలో బలీయంగా ఉన్న రంగాలన్నిటినీ అమెరికా కొత్త సుంకాలు దెబ్బతీస్తున్నాయి. మళ్లీ తాజాగా ఆక్వా సుంకాలు పెంచేందుకు సిద్ధమవుతోంది. ఇది మరో కోలుకోలేని దెబ్బ. భారతదేశంలో విరివిగా లభించే వివిధ ఉత్పత్తులే కాకుండా మానవ వనరులపై ట్రంప్ మార్కుసుంకాలు, ఫీజులపెంపు ఆయా రంగాలను, రంగాల నిపుణులను ఊపిరి సల్పకుండా చేస్తోంది. ఈరెండు రంగాలు విశేషప్రతిభ కలిగిన వారిలో నిండి ఉన్నందున, ఉత్తమ ఉత్పత్తులు కారణంగా భారతదేశాన్ని సర్వోతోముఖాభివృద్ధికి దోహదపరుస్తోంది. కానీ ట్రంప్‌వేస్తున్న సుంకాలు, ఫీజులు మరింత బాధపెడ్తున్నాయి. తమతో భారతదేశ వాణిజ్య ఒడంబడికలు చేసుకోవడంలో జాప్యం వహిస్తోందన్న సాకుతో ట్రంప్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అమెరికా షరతులు భారతీయ వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తుం దని, భారతీయ రైతు ఉత్పత్తులను కష్టాలు పాల్జేస్తుందనే అభిప్రాయం తోటే తాము ట్రంప్‌తో ఒప్పందాన్ని కాదను కుంటున్నామని ప్రధాని మోడీ ఇంతక్రితమే తేటతెల్లం చేశారు. కానీ ట్రంప్ భారతదేశం మీద ఒత్తిడి పెంచుతున్నారు. తాజా పరిస్థితులను విశ్లేషించుకుంటే భారత్‌పై ట్రంప్ సుంకాల దాడి పెరిగిపోతోంది. దేశానికి రెండుకళ్లుగా ఉన్న మానవ వనరుల, వ్యవసాయరంగాల ఆధారిత జీవన విధానాలను సుంకాల సూదితో పొడవాలనుకోవడం ఏ విధమైన వాణిజ్య నీతో అర్థంకాని పరిస్థితిలో పాలకులు తలపట్టుకుని వేచిచూస్తున్నారు. భారతదేశాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఆక్వారంగంపై విధించిన సుంకాల ప్రభావంతో ఆ రంగం బాగా కుంచించుకుపోయింది. ప్రస్తుతానికి ఆక్వా బహుళ ఉత్పత్తులపై 25 శాతం అదనపు టారిఫ్ విధించింది. కొన్ని ఉత్పత్తులపై 27శాతం వరకు ఉంటుంది. ప్రధానంగా ఆక్వారంగంపై మంచి ఆదాయం రాబట్టుకుంటూ జీవనోపాధి సాధించు కుంటున్న పెంపకందారులు ఎడాపెడా రెండు రకాల నష్టం చవి చూశారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే 25వేల కోట్లమేరకు నష్టాలు వచ్చాయి. తొలినాటి సుంకాల వద్దనకే 50శాతం ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయి. అప్పటికే పంపిన 2వేల కంటైనర్ల రొయ్యల ఎగుమతులపై రూ.600 కోట్లమేర అధిక సుంకం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఆ మేరకు తీవ్రనష్టాన్ని ఎగుమతిదారులు నష్టపోవాల్సి వచ్చింది. దిగుబడులు బాగా పెరిగినా ఎగుమతులు బాగా తగ్గిపోయాయి. స్థానిక వినియోగదారులకు ధర పెరిగిపోవడంతో ఎన్నో ఉత్పత్తులు కుళ్లిపోయాయి. రెండోప్రత్యామ్నాయం లేక నష్టం భరించాల్సి వచ్చింది. స్థానిక ప్రభుత్వాలు రొయ్యల, చేపల పెంపకందారులకు తాత్కాలిక ఉపశమనం కోసం విద్యుత్ ధరల మినహాయింపు వంటి సౌకర్యాలు కల్పించినా రొయ్యల రైతుకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆక్వా కల్చర్ రంగానికి కేంద్రం తక్షణ ఉపశమనమేదీ కల్పించే పరిస్థితి లేదు. మన ఉత్పత్తులను వేరే దేశాలకు పంపే పరిస్థితి కూడా కానరావడం లేదు. ఈ రీత్యా రొయ్యల పెంపకం చేసే కౌలుదార్లు చెర్వులను వదిలివెళ్లిపోతున్నారు. దేశీయ సముద్ర ఆహార వినియోగాన్ని పెంచడం కూడా సాధ్యం కాని రీతిలో ఆక్వా పరిశ్రమ కొట్టుమిట్టాడుతోంది. దేశంలోని రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం, సముద్రఆహార ఎగుమతుల్లో 34 శాతం ఆంధ్రప్రదేశ్ వాటా లోబడి రూ.21,246 కోట్లు ఉంటుంది. ఆక్వాపై జీవనోపాధి కల్పించుకునే కుటుంబాలు 25 లక్షలు కాగా అనుబంధ రంగాలలో 30 లక్షల మంది ఉన్నారు. ఆక్వా రైతుల్ని ఆదుకునేందుకు రూ.100 కోట్ల కార్పస్ నిధిని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అయినా ఇవన్నీ ఆక్వా పెంపకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కాజాలదు. ఆక్వా రైతుల్ని ఆదుకునే దిశగా ఇంకా చెప్పుకోదగిన ఉపశమనాలు లభించనట్లే. అన్నీ ప్రతిపాదన దేశలోనే ఉన్నాయి. రొయ్యల ఉత్పత్తులకు కోల్డ్‌స్టోరేజీ సౌకర్యాలు, స్వచ్ఛత కలిగిన చేపల మార్కెట్లు, ఆక్వా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉంది. అమెరికా వంటి దేశాలు తమకు అవసరమున్నా తమకు దిగుబడి అయ్యే ఉత్పత్తులమీద సుంకాలు పెంచేసి ఒత్తిడి తెస్తున్న పరిస్థితుల్లో దేశీయ అవసరాల కోసం ఇక్కడి ఉత్పత్తులను పెంచుకునే దిశగా ఆలోచించాలి. చేపలు, రొయ్యల పెంపకందార్లకు కిసాన్ క్రెడిట్ కార్డులపై లక్ష రూపాయలు టాప్ అప్‌లోన్‌గా సమకూర్చాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఎన్నున్నా పొరుగు దేశాలకు ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేయగల సౌకర్యం ఉంటేనే 'ఆక్వా' రంగం బతుకుతుంది. అమెరికాకు పంపే రొయ్యలపై అధిక డ్యూటీలు కారణంగా ఖర్చులు బోలెడు పెరిగిపోయి, స్వదేశీ వాణిజ్యంలో మోయలేని భారంగా మారింది. అమెరికాతో పోల్చి ఊస్తే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్న రొయ్యలు, రొయ్యల ఉత్పత్తులు పరిమాణంలో తక్కువే. ప్రధాన దిగుమతిదారు అమెరికాయే అయినందున అమెరికా వాణిజ్యమే భారత్‌కు లాభసాటి. కానీ ట్రంప్ 'కొర్రీ'లుమనకు ఇబ్బందికరం. పైగా పోటీదేశాల ధరలు మనకన్నా తక్కువగా ఉండడంతో భారతీయ రొయ్యలకు మార్కెట్‌లో గిరాకీ తప్పింది. ఇండియా నుంచి దిగుమతి అయ్యే రొయ్యలఉత్పత్తుల కన్నా వియత్నాం, ఈక్వడార్, ఇండోనేషియా ఉత్పత్తుల ధరలే తక్కువ. ట్రంప్ ఎఫెక్ట్ కారణంగా 8నుంచి 10శాతం ఉత్పత్తులపై తగ్గుదలనమోదైంది. ఒడిషా, పశ్చిమబెంగాల్‌లోని రొయ్యల ఉత్పత్తిదారులూ బాగా నష్టపోయారు. ఇప్పటికిప్పుడు అమెరికాతో ఒప్పందాలు కుదిరినా ఇతరత్రా ప్రభావాల వలన 'ఆక్వా' రంగం కోలుకోవడానికి చాలా కాలం పట్టేట్లు ఉంది.

> మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.
>
> 
>
> సిసిరో

> మౌనం ఒక గొప్ప గుణం. దానిలో ఎన్నో మహా విషయాలు, కార్యాలు, రూపుదిద్దుకుంటాయి.
>
> 
>
> డబ్ల్యు.ఎమర్సన్

# ప్రజావాక్కు



### హెచ్1బీ వీసా రుసుము పెంపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును గణనీయంగా పెంచారు. ఈ నిర్ణయం భారతదేశంపై ప్రత్యేక ప్రభావాన్ని చూపనుంది. అమెరికాకు అత్యధికంగా ఐటీ నిపుణులను పంపే దేశం భారతదేశమే. హెచ్1బీ వీసా ద్వారా వేలాది మంది భారతీయులు అమెరికాలో ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. రుసుము పెంపుతో కంపెనీల ఖర్చులు పెరిగి, ముఖ్యంగా చిన్న ఐటీ సంస్థలకు భారం అవుతుంది. ఫలితంగా కొత్త ఉద్యోగావకాశాలు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, అమెరికా లోపలస్థానికుల నియామకాన్ని ప్రోత్సహించే అవకాశమూ ఉంది. ఇకపోతే, ఈ నిర్ణయం భారత ఐటీ రంగానికి ఒక సవాల్‌గా మారినా, ఇది కొత్త మార్గాలను అన్వేషించే అవసరాన్నికూడా గుర్తు చేస్తుంది. అమెరికాపై ఆధారపడకుండా యూరప్, ఆసియా, మధ్య ప్రాచ్యం వంటి ఇతర మార్కెట్లలో అవకాశాలను విస్తరించుకోవడంఇప్పుడుఅత్యవసరం. అలాగేవర్క్‌ఫ్రం ఇండియా విధానాన్ని బలపరచడం ద్వారా గ్లోబల్ ప్రాజెక్టులను ఇక్కడి నుంచే నిర్వహించే దిశగా అడుగులు వేయవచ్చు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఆదాయ మార్గాలను సృష్టించాలి

ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి. ఇది దీర్ఘకాలంలో ఆర్థిక అస్థిరతకు దారితీస్తుంది. వీలైనంత త్వరగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు కోత విధించి ఆదాయ మార్గాలను సృష్టించాలి. ఉచిత పథకాలను ఎత్తివేసి ఆదాయ మార్గాలను సృష్టించి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- టి.ముత్యం, సిద్ధిపేట జిల్లా

### ప్రభుత్వ ప్లే స్కూళ్లు అవసరం

భారత ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో మాదిరిగా ప్లే స్కూళ్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఇప్పటిలా ఒకటో తరగతి నుండి కాకుండా నర్సరీ, ఎల్‌కెజి, యుకె జితో ప్లే స్కూల్ లను ఏర్పాటు చేయాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లోఅడ్మిషన్‌లు పెరుగుతాయి. వీటిని ఆంగ్ల భాషతో పాటు ప్రాంతీయ భాషలో ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచాలి.

- డి.చాంద్ బాషా, కర్నూలు

### పోలీసుల నిఘా అవసరం

హైదరాబాద్‌లోని వివిధ మెట్రోస్టేషన్‌లలో మెట్లదగ్గర యువత గుంపులుగా చేరి సెల్‌ఫోన్‌లో పేకాట, పబ్జీ లాంటి ఆటలు ఆడి చెడుమార్గంలో పయనిస్తున్నారు. మెట్రో ప్రయాణికులకు దారి ఇవ్వకుండా మెట్ల మీద కూర్చొని ధూమపానం, గంజాయి సేవిస్తున్నారు. కొన్ని మెట్రోస్టేషన్‌లలో వీరి ఆగడాలు శృతి మించిపోతున్నాయి. అమ్మాయిలను కూడా ర్యాగింగ్ చేస్తూ వికృత ఆనందం పొందుతూ వున్నారు. కాలేజీలకు వెళ్లి చదువుకోకుండా మెట్రో స్టేషన్‌లలో టైంపాస్ చేస్తూ వున్నారు. పోలీసుల నిఘాలేకపోవడంవల్ల వీరి ఆగడాలకు అంతులేదు. పోలీసు శాఖ మెట్రో అధికారులు స్పందించి వీరి ఆగడాలకు కళ్లెం వేయాలి.

-ఎన్. రాజేష్‌కుమార్, సికింద్రాబాద్

### రోడ్డు పనులలో వేగం పెంచాలి

హైదరాబాద్‌లోని వివిధప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులు నత్తనడకన సాగడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతూ వున్నారు. గుత్తేదారుపని ప్రారంభించి ఏడాదిగడిచి నెమ్మదిగా పనులు చేస్తుండంతో ఈ రహదారి గుండా వెళ్లే వారు దుమ్ము ధూళితో అవస్థలుపడుతూ వున్నారు. నిత్యం రోడ్డుప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడుతూ వున్నారు. వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలుచేసేవారు, కార్మికులు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఆలస్యంగా పోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులలో వేగం పెంచాలి.

-కె. సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ప్రత్యేక ప్రణాళిక అవసరం

గుజరాత్‌లో సముద్ర తీరా ప్రాంతం ఉంది కాబట్టి సముద్రుసే సమృద్ధి అనే కార్యక్రమం చేపట్టారు. ఈశాన్య రాష్ట్రాలకు అష్టాలక్ష్మి ప్రణాళిక అమలు చేస్తున్నారు. మరి తూర్పు వైపు రాష్ట్రాలకు పూర్వోదయా ప్రణాళిక అమలు చేస్తున్నారు. మధ్య భారత రాష్ట్రాలకు భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఏమి ప్రణాళిక అమలు చేస్తారు అంటే సమాధానం చెప్పగలరా? నిజానికి హర్యానా తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ లాంటి రాష్ట్రాలలో సారవంతమైన ఎర్ర నెలలున్నాయి. వీటిలో కూరగాయల సాగు యోగ్యంగా ఉంటుంది. అలాగే వర్షపు నీటిని ఒడిసిపట్టి నీటిని తనలో ఒంపుకునే లేదా ఇముడ్చుకునే నేపథ్యం కూడా ఉంటుంది.

-భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమెరికా మోజుకు బూజు పట్టనుందా?

**డోనాల్డ్ ట్రంప్ అనాలోచిత అహంకార పూరిత దుందుడుకు చర్యలు, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు అమెరికా న్యాయస్థానాల్లో నిలబడే అవకాశాలు కూడా తక్కువ. ట్రంప్ చర్యలను స్వయంగా రిపబ్లికన్ పార్టీ నేతలే జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక ప్రతిపక్షాల సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అమెరికాలో తక్కువ జీతాలకు పనిచేసే నిపుణులు దొరకడం కష్టం. కాబట్టి టెక్ దిగ్గజాలు ఎక్కువ జీతాలకే స్థానికులను నియమించుకోవడం వలన అమెరికా పౌరులకు లాభం. ఇదే సందర్భంలో ఆయా కంపెనీలు లాభాలు ఆర్జించలేక, దివాళాతీయడమో, భారత్, చైనాల నుంచి తమ కార్యక్రమాలను కొనసాగించడమో చేయక తప్పదు. ఏదిఏమైనప్పటికీ అమెరికాపై మనకున్న మోజుకు బూజు పట్టనుందా? అంటే అవుననే సమాధానమే వస్తుంది.**



సుంకవల్లి సత్తిరాజు

అమెరికా పెద్దరికం హాస్యాస్పదంగా మారింది. అమెరికా అధ్యక్షుని అహంకారం భారత్ వంటి దేశాల పాలిట అమర్యాదకరంగా మారింది. ఇటీవల డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వలన భారత్ కొంతకాలం పాటు ఇబ్బందులకు గురికాక తప్పదు. విద్య కోసం, ఉపాధి కోసం, ఇతర దేశాల మీద ఆధారపడితే ఎంత అనర్థమో ఇటీవల అమెరికా తీసుకుంటున్న నిర్ణయాల వలన అవగతమవుతున్నది. ఎక్కడున్నా క్షణాల్లో అమెరికాకు వచ్చేయాలని మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు తమ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు హుకుం జారీ చేయడం, హెచ్1బి వీసాదారులపై ట్రంప్ కొరడా ఝుళిపించడం, అమెరికాలో ఎం.ఎస్ చేసి, ఉద్యోగాలు సంపాదించి, అక్కడే విలాసవంతమైన జీవితాలు గడపాలనుకునే ఆశావహులకు డోనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనలు, గోల్డ్ కార్డు గొడవలు తీవ్రనిరాశను కలిగించాయి. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే ఎన్నికల నినాదాన్ని ట్రంప్ వివాదాస్పదం చేసి, భారత్ వంటి దేశాల శ్రమశక్తిని, మేథాసంపత్తిని మానవ వనరులను అడ్డగోలు విధానాల ద్వారా దోచుకుని, తన దేశ ఖజానా నింపుకోవడానికి నిర్లజ్జగా ప్రవర్తించడం సిగ్గుచేటు. శతాబ్దాల సుదీర్ఘ చరిత్రగల లిఖిత రాజ్యాంగంతో, దృఢమైన ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచ చరిత్రలో స్థానం సంపాదించుకున్న అమెరికా ప్రతిష్ఠ నేడు డోనాల్డ్ ట్రంప్ చేష్టలతో మసకబారిపోతున్నది. ట్రంప్ చర్యలు అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని పాతరేసి, నియంతృత్వం వైపు పయనింప చేస్తున్నాయి. గ్లోబల్ మైండ్ సెట్‌తో ప్రపంచానికి పెద్దన్నలా వ్యవహరించి, అగ్రరాజ్యమనే హోదాతో ప్రపంచంలో ఇప్పటి వరకు అమెరికా తనకున్న బ్రాండ్‌ను కాపాడుకుంటూ వచ్చింది. అయితే ఏ దుర్ముహూర్తాన డోనాల్డ్ ట్రంప్ రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారో, అప్పటి నుంచే ప్రపంచ దేశాలకు వాణిజ్యపరమైన, దౌత్యపరమైన ఇబ్బందులు తలెత్తాయి. అసలే ఆర్థిక మాంద్యంతో అతలాకుతలమైపోతున్న ప్రపంచ దేశాలకు ట్రంప్ నిర్ణయాలు గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించాయి. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌తో సన్నిహిత సంబంధాలు సాగించిన అమెరికా తన వైఖరిని మార్చుకుని భారత్ ఆర్థిక వ్యవస్థ పునాదులను పెకలించడానికి అనేక దుష్కృత్యాలకు ఒడిగట్టింది. రెసిప్రోకల్ టారిఫ్‌ల పేరుతో భారత్‌పై ట్రేడ్‌వార్ సాగిస్తూనే మరో వైపు భారతీయుల అమెరికా ప్రవేశానికి అడ్డుకట్ట వేయడానికి హెచ్‌వన్‌బి వీసాలను క్లిష్టతరం చేసింది. హెచ్ వన్‌బి వీసా నిబంధనలు కొత్తగా అమెరికాలో ప్రవేశించబోయే భారతీయులకు ఆశనిపాతంలా మారాయి. ఆస్ట్రేలియా, యు.కె, కెనడా, జర్మనీ వంటి దేశాల్లో వేల రూపాయల్లో లభించే వీసాలు అమెరికాలో మాత్రం అత్యంత భారంగా మారడం ఆక్షేపణీయం. 88లక్షల రూపాయలు పెట్టి హెచ్ 1 బి వీసా సాధించి, అమెరికా వెళ్లి, గొడ్డు చాకిరీ చేయడం కంటే భారత దేశంలోనే స్థిరబడి, ఇక్కడే టెకీలుగా తమ నైపుణ్యంతో దేశాభివృద్ధికి సహకరించడానికి ఒక మహత్తరమైన అవకాశం ఇప్పుడు భారతీయ యువతకు లభించింది. హెచ్ 1బి వీసాలపై అమెరికా వెళ్లిన భారతీయుల్లో అత్యధిక శాతం మంది తెలుగువారు కావడం విశేషం. అమెరికాలో హెచ్ 1బి వీసాలపై 71 శాతం భారతీయులుంటే, చైనాకు చెందిన వారు కేవలం 11.7 శాతం మంది కావడం గమనార్హం. మనం కూడా చైనా బాటలో నడవాలి. అమెరికా మీద





ఆధారపడే పరిస్థితి పోవాలి. ఎఫ్1 వీసా పై అమెరికా వెళ్లి, ఎం.ఎస్ పూర్తి చేసి ఉద్యోగాలు చేయడం ఇప్పటివరకు జరుగుతున్న ప్రక్రియ. వీసా నిబంధనలు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వంటి కారణాలతో సుమారు 3 సంవత్సరాలు యు.ఎస్‌లో ఉండే అవకాశాలున్నాయి. హెచ్1బీ వీసాల విషయంలో భారీగా భారం మోపిన ట్రంప్ ప్రభుత్వం పాత వారికి ఈ విషయంలో వెసులుబాటు కల్పించడం కొంత ఉపశమనం కలిగించినట్టుగానే భావించాలి. అమెరికాలో శాశ్వత నివాసం కోసం మిలియన్ డాలర్లు చెల్లించి గోల్డ్ కార్డు తీసుకోవాలనే నిబంధన అమెరికాలో స్థిరపడాలనుకునే యువత ఆశలపై నీళ్లు చల్లినట్టే. ఏదిఏమైనప్పటికీ అమెరికా డాలర్ డ్రీమ్‌కు భారతీయ యువత స్వస్తి పలకక తప్పదు. ప్రతిభఉండి కూడా, అమెరికా మీద మోజుతో ఆశలు పెంచుకుంటున్న భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారికి ట్రంప్ తత్వం ఇప్పటికైనా బోధపడాలి. అమెరికాలో ఆర్భాటాలెక్కువ. ఖర్చులు కూడా అధికం. అమెరికాలో నిరుద్యోగం ప్రబలిపోతున్న నేపథ్యంలో కేవలం తమ దేశానికి చెందిన వారికే ఉద్యోగాలు కల్పించాలన్న ట్రంప్ నిర్ణయం బెడిసి కొట్టకతప్పదు. నైపుణ్యం, కష్టించే తత్వం, తక్కువ జీతాలకు ఎక్కువ పనిచేసే సహనం గల భారతీయులను కాదని టెక్ దిగ్గజాలు ట్రంప్ బెదిరింపులకు లొంగి పోయి, అమెరికన్లకే అగ్రతాంబూలమిస్తే, తాత్కాలికంగా అక్కడియువతకు స్వాంతన లభించవచ్చునేమో గాని, దీర్ఘకాలంలో అమెరికా ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే అవకాశాలే అధికం. స్కిల్డ్ వర్కర్ల కోసం భారతీయులపై ఆధారపడ్డ అమెరికా ఉన్న పళంగా, భారతీయుల ఉద్యోగాలకు గండి కొట్టి, నైపుణ్యం లేని స్థానికులను నియమించుకుంటే అక్కడి టెక్ కంపెనీలు ఆర్థికంగా నష్టపోక తప్పదు. భారత దేశ ఆర్థిక ఎదుగుదలను అడ్డుకుంటూ, అమెరికాలో భారతీయులకు స్థానం లేకుండా చేస్తున్న ట్రంప్ దుందుడుకు తనంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ కకావికలం కావడానికి పరోక్షంగా దోహదం చేస్తున్నారన్న మాటవాస్తవం. అమెరికా దేశానికి చెందిన పలుతయారీ యూనిట్లు విదేశాల్లోను, భారత్‌లోను తమ కార్యకలాపాలను కొనసాగించడానికి కారణం అమెరికాలో ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవడమే. ఆర్థిక భారాన్ని తట్టుకోలేక, నైపుణ్యం గల వర్క్‌ఫోర్స్ కోసం అమెరికా కంపెనీలు తమ తయారీ యూనిట్లను ఇండియాలో నెలకొల్పడానికిఉత్సుకత చూపుతున్నాయి. ఐఫోన్లకోసం క్యూలో నిలబడి కొట్టుకుంటున్నవారు వాటి తయారీ యూనిట్లు భారత్‌లో ఉన్నాయన్న సంగతి గుర్తుంచుకోవాలి. కారు చౌకగా లభించే భారతీయ నైపుణ్యాన్ని ట్రంప్ తన దురహంకారంతో కాలదన్నుకోవడం మూర్ఖత్వం. నోబెల్ శాంతిబహుమతి కోసం అర్రులుచాస్తూ, భారత్, పాక్ యుద్ధంతో సహా ఏడు యుద్ధాలను తానే ఆపానంటూ, తనకే నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూట్రంప్ తాజాగా చేసిన హెచ్చరికతో కూడిన వేడుకోలు అత్యంత హాస్యాస్పదం. చిరకాల మిత్రదేశంగా కొనసాగుతున్న రష్యాతో ఆయుధ, వాణిజ్య సంబంధాలు తెంచుకోవాలని, రష్యా చమురు కొనుగోలు చేయవద్దని, భారత్‌ను హెచ్చరించడం అనుచితం. ఏ సార్వభౌమత్వ దేశం కూడా ఇలాంటి హెచ్చరికలను ఖాతరు చేయబో దనే సంగతి ట్రంప్ గుర్తించాలి. ఒక వైపు భారత్ గొప్పదేశమంటూ, మోడీ తన ప్రియ మిత్రుడంటూ పొగడ్తలు కురిపిస్తూనే, మరోవైపు ట్రేడ్ వార్ కొనసాగించడం, ఇంకోవైపు భారతీయులను అమెరికా నుండి గెంటేయడానికి, అమెరికాలో భారతీయుల విద్యా, ఉద్యోగ అవకాశాలకు గండికొట్టే చర్యలను వేగవంతం చేయడం కర్రు కాల్చి వాత పెట్టి, వెన్నపూయడం లాంటి ఘాతుకంగా భావించక తప్పదు. డోనాల్డ్ ట్రంప్ అనాలోచిత అహంకార పూరిత దుందుడుకు చర్యలు, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు అమెరికా న్యాయస్థానాల్లో నిలబడే అవకాశాలు కూడా తక్కువ. ట్రంప్ చర్యలను స్వయంగా రిపబ్లికన్ పార్టీ నేతలే జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక ప్రతిపక్షాల సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అమెరికాలో తక్కువ జీతాలకు పనిచేసే నిపుణులు దొరకడంకష్టం. కాబట్టి టెక్ దిగ్గజాలు ఎక్కువ జీతాలకే స్థానికులను నియమించుకోవడం వలన అమెరికా పౌరులకు లాభం. ఇదే సందర్భంలో ఆయా కంపెనీలు లాభాలు ఆర్జించలేక, దివాళాతీయడమో, భారత్, చైనాల నుంచి తమ కార్యక్రమాలను కొనసాగించడమో చేయక తప్పదు. ఏదిఏమైనప్పటికీ అమెరికాపై మనకున్న మోజుకు బూజు పట్టనుందా? అంటే అవుననే సమాధానమే వస్తుంది. ●

# తరగతిగదిలోనే దేశ భవితకు పునాది

ఎస్.సీతారామయ్య

తరగతిగదిలో పాఠాలు చెప్పడమంటే ఒక తరం తలరాతను రాయడం. ఒక దేశ భవితకు పునాది వేయడం. చిన్నారులకు మంచేదో చెడేదో చెబుతూ విద్యార్థుల వ్యక్తిత్వానికి విలువల వన్నెలద్దడం గురువులు చేసే పని. పేద కుటుంబాల చిన్నారులకు ఫీజులు కట్టి పుస్తకాలు కొనిచ్చే మాస్టార్లు, వ్యక్తిగత శ్రద్ధతో వినూత్న బోధనా పద్ధతులతో విద్యార్థులను సానపట్టే టీచర్లూ గణనీయంగానే ఉన్నారు. సమానత్వం, లౌకికవాదం వంటి రాజ్యాంగ విలువల గురించి చెబుతూ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సింది వారే. ఆరోగ్యకరంగా, గౌరవప్రదంగా, స్వేచ్ఛగా ఎదిగేందుకు చిన్నారులకు అన్ని అవకాశాలూ, సదుపాయాలూ కల్పించాల్సింది రాజ్యమేనని 39(ఎస్) రాజ్యాంగ అధికరణ స్పష్టంగా చెబుతోంది. ఇందుకు అనుగుణంగా సర్కారు బడుల్లో పిల్లలకు అటువంటి సురక్షిత వాతావరణం కల్పించవలసింది ఉపాధ్యాయులు. ఓర్పుగా నేర్పుతో పాఠాలను పిల్లలకుఅర్థమయ్యేలా చెప్పడంఉపాధ్యాయుల విద్యుక్త ధర్మం. ఇందుకు ఒక్కో ఉపాధ్యాయుడిది ఒక్కోశైలిలో బోధన ఉంటుంది. ఆ శైలి విద్యార్థులకు అర్థమయ్యేలా ఉండాలి. శరవేగంగా మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా పాఠశాలల స్వరూపం, ఉపాధ్యాయుల బోధనతీరును సంస్కరించవలసిన అవసరముంది. ప్రస్తుత విద్యావ్యవస్థ విద్యార్థులను ఏళ్ల తరబడి ఓ మూస విధానంలో నడిపిస్తూ అందరినీ ఒకే తరహాలో ఉండే నమూనాలుగా తయారు చేస్తోంది. తరగతిగది అనేది విద్యార్థులు ఏంనేర్చుకోవాలో బోధించేదికాదు. తమంతట తాము తెలుసుకోడానికి ప్రోత్సహిస్తూ తమ ఆసక్తులను గుర్తెరిగి వాటిని ఎలా పెంపొందించుకోవాలో తెలియజేసే మార్గదర్శిలా ఉండాలి. ఈమేరకు జాతీయ విద్యావిధానం 2020 ప్రతిపాదించినట్లుగా విద్యా సంస్కరణలు జరగాలి. పిల్లల మానసిక వికాసం పెంపొందించేలా మూడేళ్లలోపు చిన్నారుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. ప్రాథమిక స్థాయి తరగతుల బోధన ప్రధానంగా చదవడం, రాయడంపైన ఉంటుంది. పరిశీలన, అవగాహన, సృజనాత్మకత, ఆలోచనాత్మకత వంటి విషయాలు చదవడం, రాయడం ద్వారా అబ్బుతుంది. ఇందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రధానంగా దోహదపడుతారు. తరగతి గదిలో లేదా ఇంటి వద్ద తగినన్ని కథల పుస్తకాలు, పోస్టర్లు, మ్యాగజైన్లు, వార్తా పత్రికలు, న్యూస్ లెటర్లు, బొమ్మలతో కూడిన వ్యాఖ్యానాలువంటి సామాగ్రి ద్వారా చదుకోవాలనే వాతావరణం కల్పించడం ఎంతో అవసరం. ఇదికాస్త అనుభవాత్మక అభ్యసన వైపు మళ్లిస్తుంది. వినడం, మాట్లాడం, చదవడం, రాయడం ప్రధానాంశంగా ప్రాథమిక విద్యా ప్రామాణికల పట్టికలో చేర్చిన విషయం తెలిసిందే. పిల్లల అభ్యసనా ప్రక్రియలో తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనది. చిన్నారులు తమ చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ, ఎలా ప్రతిస్పందిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఈ సామర్థ్యం పెంపొందేలా విద్య ఉండాలి. ముఖ్యంగా దృశ్య శ్రవణ మాధ్యమాలకు స్పందన ఎలా ఉందనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. పర్యావరణానికి నష్టం కలిగించే పాలిథిన్ను పక్కనపెట్టి వస్త్రం, తోలు, కాగితంలో పిల్లల చెంతే ప్రయోగశాలను తలపించే బొమ్మలు రూపొందించాలి. రకరకాలైన తోలు బొమ్మలను తయారు చేస్తూ ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు బోధించాలి. చదువు పుస్తకాలకు పరిమితం కాకుండా, ఆటపాటల ద్వారా అక్షర జ్ఞానాన్ని, పరిసరాలపై అవగాహనను ఏర్పరచే ప్రయత్నం జరగాలి. ఇందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు నిచ్చెనలా తోడ్పడాలి. ●

# 'బనకచర్ల'కు అవరోధాల ముడి?

వి. శంకరయ్య

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం బనకచర్ల అనుసంధానానికి లెక్కలేనన్ని అవరోధాలు ఎదురైనవి. ఈ పథకం చేపట్టే సమయంలోనే రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ముందుచూపు లేకపోవడం ఒక టైతే తెలంగాణ అభ్యంతరాలకన్నా కేంద్రం ప్రభుత్వం ప్రధాన కారణంగా వుంది. ఫలితంగా బనకచర్ల అనుసంధాన ప్రతిపాదన ప్రతిష్టంభనలో పడటమే కాకుండా రాయలసీమ తదితర మెట్ట ప్రాంతాలను పరోక్షంగా ఆదుకొనేందుకు 2014-19లో చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన గోదావరి పెన్నా అనుసంధానం కూడా చిక్కుల్లో పడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచించునట్లుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నుండి తరలించే 80 టియంసిలకు ఈ పథకాన్ని పరిమితంచేస్తే అంతర్ రాష్ట్ర జలవివాదాలు గాని అపెక్స్ కౌన్సిల్ ఆమోదం గాని అవసరముండదు. వాస్తవంలో బనకచర్ల అనుసంధానం పథకం జగన్మోహన్ రెడ్డి హయాంలోనే పురుడు పోసుకున్నా అప్పట్లో సాగునీటి రంగం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో లేకపోవడంతో మరుగునపడి ఉండిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దస్త్రాన్ని దుమ్ము దులిపి తలకెత్తుకున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి హయాంకు నేటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల వివాదాలు పూర్తిగా మారిపోవడం తెలంగాణలో బిఆర్‌ఎస్ పార్టీ ప్రతిపక్షం కావడంతో బనకచర్ల అనుసంధానం పెను వివాదమైంది. ఇంతకీ కూటమి ప్రభుత్వం బనకచర్ల అనుసంధానం తలపెట్టిన సమయంలో ముమ్ముందు ఎదురయ్యే సాంకేతిక క్లిష్ట పరిస్థితులను రాష్ట్ర ఇంజినీరింగ్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించవలసి వుండాలి. ఇంజినీరింగ్ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించలేదో లేక వివరించి చెబితే ముఖ్యమంత్రి పెడ చెవిన బెట్టారో తెలియదు. ప్రప్రథమంగా గోదావరి అంతర్ రాష్ట్ర నది. దానిపై కొత్తగా ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నా ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత వైతరణీ నదిలాగా రాష్ట్ర విభజన చట్టం ముందుకువస్తుంది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 84 మేరకు కృష్ణ, గోదావరి నదులపై ఇరురాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు మొదలు పెట్టాలంటే అపెక్స్ కౌన్సిల్ విధిగా ఆమోదించాలి. మరి తెలంగాణలో కెసిఆర్ ఏం చేశారు? ఉమ్మడి రాష్ట్రంలో పరిపాలన అనుమతులు పొందిన పథకాలను రీ డిజైన్ పేరుతో తన పని నిరాఘాటంగా సాగించారు. మూడు పథకాలు రద్దు చేసి సీతారామ ఎత్తిపోతలు ప్రాణహిత చేవెళ్ల బదులు కాళేశ్వరం ఇలా చాలా పథకాలను కెసిఆర్ చేపట్టారు. దానికి తోడు జగన్మోహన్ రెడ్డిని మచ్చిక చేసుకోవడంతో ఆంధ్రప్రదేశ్ వైపు నుండి అడ్డే లేకుండా పోయింది. ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బనకచర్ల అనుసంధానం కోసం ఏమైనా మాట్లాడవచ్చు. గోదావరిలో ఎవరి వాటా ఎంతో తేలకుండా వివాదపడుతున్న సమయంలో బనకచర్ల అనుసంధానం కోసం మీరెన్ని ప్రాజెక్టులైనా కట్టుకోండని తెలంగాణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం చాలాఆశ్చర్యంగా వుంది. మరో అంశమేమంటే 2014-19 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం తెలంగాణ 240 టియంసిలను గోదావరి బేసిన్ నుండి కృష్ణ బేసిన్ కు తరలించుతోందని గోదావరి యాజమాన్యం బోర్డు సమా వేశాల్లో పలుమార్లు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు కేంద్ర జల సంఘం వరకు అప్పట్లో వెళ్లింది. తమాషా ఏమంటే జగన్మోహన్ రెడ్డి అధికారంలోనికి రాగానే ఈ ఫిర్యాదులు గాలికి పోయాయి. తదుపరి గోదావరి బోర్డు సమావేశంలో మన అధికారులు మౌనం పాటించారు. నేడు బనకచర్ల అనుసంధానం అటకెక్కడానికి మన ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి తెలంగాణ బద్ధ వ్యతిరేకత తోడైనది. వీటికి తోడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేయవలసినదంతా చేసి తన చేతులకు మట్టి అంటకుండా ఉండే విధంగా వ్యవహరిస్తోంది. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే గాక వచ్చే శాసన సభ ఎన్నికల్లో అటు కాంగ్రెస్ ఇటు బిఆర్‌ఎస్‌పార్టీలు బదనాం చేయవచ్చనే భయం కేంద్ర ప్రభుత్వానికి పట్టుకొంది. అంతవరకే ఆగకుండా కేంద్ర పర్యాటక శాఖతో సహా కేంద్ర జలశక్తిశాఖ అధీనంలో గల కేంద్ర జల సంఘం గోదావరి, కృష్ణ యాజమాన్య బోర్డులతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీలు అడ్డంగా కొర్రీలు వేశాయి. ప్రస్తుతం కేంద్రం ప్రభుత్వ సంస్థలు వేసిన కొర్రీలే తెలంగాణలోని అధికార ప్రతిపక్షాలకు బనకచర్ల అనుసంధానానికి వ్యతిరేకంగా బ్రహ్మాస్త్రాలుగా ఉంటున్నాయి. వాస్తవంలో జరిగింది వేరు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పరిస్థితి ఏర్పడుతుందని ఊహించి ఉండరు. ముందుగా పర్యావరణ అనుమతులు సులభంగా లభిస్తాయని కేంద్రంలో అడ్డు వుండదని భావించారు. ఒక దశలో బనకచర్ల అనుసంధానం నిర్మాణం చేపట్టే కాంట్రాక్టు సంస్థకే కేంద్రం నుండి అనుమతులు పొందే బాధ్యత అప్పగిస్తామని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. కేంద్రంలో తనకు అడ్డు వుండదని ముఖ్యమంత్రి భావించినట్లుంది. బహుశా రాష్ట్ర ఇంజినీరింగ్ అధికారులు కూడా సాంకేతిక ఇబ్బందులతో కేంద్రం నుండి అనుమతులు రావని భావించినా అంతా ముఖ్యమంత్రి పలుకుబడితో నెట్టుకువస్తారని భావించి అంతర్‌రాష్ట్ర జల వివాదాలను విస్మరించారు. కేంద్ర జల సంఘం వేసిన కొర్రీలు అంత సులభంగా పరిష్కరించే పరిస్థితి లేదు. గోదావరి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల్లో నిర్మాణంలో వున్న లేక ప్రతిపాదనలో వున్న ప్రాజెక్టుల అవసరాలకు 75 శాతం డిపెండబిలిటీతో అవసరం తీరిన తరువాత మిగిలే వరద జలాలను లెక్కించడమే కాకుండా 75 శాతం డిపెండబిలిటితో గణాంకాలను సమర్పించమని కోరింది. ఇది నిజంగానే యక్ష ప్రశ్నే. కృష్ణ నదిలో నికర మిగులు వరద జలాలంటూ వర్గీకరణ జరిగింది. కాని గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో ఎట్టి వర్గీకరణ లేదు. అందువలననే వరద జలాలంటూ వుంటే అన్ని రాష్ట్రాలు తమకు వాటా వుందని డిమాండ్ చేస్తున్నాయి. కృష్ణ గోదావరి యాజమాన్యం బోర్డులు గోదావరి ట్రిబ్యునల్ తీర్పుమేరకు గోదావరి నుండి 80 టియంసిలకు మించి తరలించితే ఆ రేషియోలో ఎగువ రాష్ట్రాలకు కృష్ణ జలా లను ఇవ్వవలసి వస్తుందని బాంబ్ పేల్చాయి. అంతిమంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ అసలు ఇప్పట్లో ఈపథకం గురించి మాట్లాడటం కుదరదని 45.72 మీటర్ల ఎత్తుకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిన తర్వాతనే ఆలోచన చేయాలంటూ అప్పుడు కూడా ఈపథకం అమలు చేయాలంటే పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్ మార్చవలసి ఉంటుందని తేల్చివేసింది. ఇన్ని అననుకూల పరిస్థితులు ఏర్పడినందుననే ప్రస్తుత ప్రభుత్వం కూడా బనకచర్ల అనుసంధానం గురించి హడావుడి చేయడం లేదు. ●



# దీపావళి తర్వాతే బీహార్ ఎన్నికలు




## మూడు దశల్లో నిర్వహించే యోచన

### షెడ్యూల్ ఖరారుపై ఇసి కసరత్తు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** బీహార్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దసరా(అక్టోబర్ 2) తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశముంది. ఈసీ వర్గాల సమాచారం ప్రకారం మూడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో అక్టోబర్ 28, నవంబర్ 3, నవంబర్ 7 తేదీల్లో మూడు దశల్లో నిర్వహించారు. ఈసారి కూడా నవంబర్ 5 నుంచి 15 మధ్య ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇద్దరు కమిషనర్లు త్వరలో బీహార్‌లో పర్యటించి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. ఛాథ్ పూజ, దీపావళి పండుగ తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేయనుంది. ప్రస్తుతం బీహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22 వరకు ఉంది. ఆ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

**ఎన్డీయే- మహాఘట్‌బంధన్‌ల మధ్యే పోటీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈసారి అధికార బీజేపీ- జేడీయూ నేతృత్వంలోని ఎన్డీయేకు, కాంగ్రెస్- ఆర్జేడీ ఆధ్వర్యంలోని మహాఘట్‌బంధన్ కూటముల మధ్యనే గట్టి పోటీ ఉంటుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటములు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అటు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(సర్)పై రాజకీయ దుమారం చెలరేగింది. చివరకు సుప్రీంకోర్టు చెంతకు చేరిన విషయం తెలిసిందే. 2020 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 125 స్థానాలు గెలుచుకొని అధికారం చేపట్టింది. బీజేపీ 74, జేడీయూ 43, ఇతరులు 8 సీట్లు గెలుపొందాయి. అటు మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ 75, కాంగ్రెస్ 19, ఇతరులు 16 సీట్లు గెలవగా, మొత్తంగా 110 స్థానాలతో సరిపెట్టుకుని ప్రతిపక్షంలో కూర్చుంది. జేడీయూ అధినేత నితీశ్ కుమార్ వరుసగా ఏడోసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అయితే, బీజేపీ నేతలతో మనస్పర్థలు రావడం, ఎన్డీయే నుంచి బయటకురావడం, కాంగ్రెస్-ఆర్జేడీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. రెండేళ్ల పూర్తికాకుండా, ఆర్జేడీ నేతల అవినీతి, అక్రమాల తీరుతో తన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని పేర్కొంటూ ఆర్జేడీ- కాంగ్రెస్ కూటమి నుంచి బయటకొచ్చి, తిరిగి ఎన్డీయేలో చేరాడు. బీజేపీ- జేడీయూ నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరింది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎన్డీయే భారీగా సీట్లు గెలుపొందింది. అదే ఊపుతో ఈసారి కూడా బీహార్‌లో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలని జేడీయూ- బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వ్యూహాలు రచిస్తోంది. 2020లో త్రుటిలో అధికారం చేజార్చుకున్న ఆర్జేడీ- కాంగ్రెస్ నాయకత్వంలోని మహాఘట్‌బంధన్ ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని పకడ్బందీగా ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే ఇటు రాహుల్ గాంధీ, అటు తేజస్వి యాదవ్ యాత్రలు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారానికోసారి, పక్షానికోసారి బీహార్‌లో పర్యటిస్తూ, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు. నితీశ్ కుమార్ కూడా ఓటర్లకు వరాలు కురిపిస్తున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.వెయ్యి చొప్పున రెండేళ్ల సొమ్ము రూ.24 వేల ఒకేసారి నిరుద్యోగుల ఖాతాల్లో వేస్తానని ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. బీహార్‌లో తాజా పరిస్థితిని చూస్తే, ఎన్డీయే- మహాఘట్‌బంధన్‌ల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.



## మైసూరు దసరా ఉత్సవాలు షురూ

**మైసూరు,సెప్టెంబరు 22:** మైసూరు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ గ్రహీత, రచయిత బాను ముస్తాఖ్ ముఖ్యఅతిథిగా హాజరై, సీఎం సిద్ధరామయ్యతో కలిసి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. మైసూరు దసరా ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి, వివిధ దేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. 11 రోజులపాటు కొనసాగే ఉత్సవాలకు కర్ణాటక ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మైసూరు దసరా ఉత్సవాలకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. 1610 నుంచి 'నాద హబ్బా (రాష్ట్ర పండుగ)' పేరుతో ఏటా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## పిఒకె మనదే..సైనిక చర్య అవసరం లేదు

### మొరాకోలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**రాబట్(మొరాకో), సెప్టెంబరు 22:** పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే)ను భారత్ తన నియంత్రణలోకి తీసుకుంటుందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. పీవోకే కోసం ఎలాంటి చర్య తీసుకోవాల్సిన అవసరం లేదు, ఆ ప్రాంత ప్రజలే తమకు స్వేచ్ఛా స్వాతంత్రాలు కావా లని డిమాండ్ చేస్తున్నారన్నారు. మొరాకోలో ప్రవాస భారతీయులతో భేటీ అయిన సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పీవోకే మనది. మన సొంతం. ఇప్పటికే తమకు విముక్తి కల్పించాలని పీవోకేలో నినదిస్తున్నారు' అని పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం జమ్మూకాశ్మీర్‌లో పర్య టించినప్పుడు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'కాశ్మీర్ లోయలో ఐదేళ్ల కిందట భార త సైన్యం నుద్దేశించి మాట్లాడుతూ, పీవోకేను మన నియంత్రణలోకి తీసుకోవడానికి దాడి చేయాల్సిన అవసరం లేదు. ఏదేమైనా అది మనది. మొయిన్ భి భారత్ హూన్ అని పీవోకే ప్రజలే అనే రోజు వస్తుంది'త అని రక్షణ మంత్రి తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో పీవోకే తమ నియంత్రణలోకి తెచ్చుకునే అవకాశాన్ని పోగొట్టుకున్నామని వివిధ రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.


## అస్సామీ గాయకుడు జుబిన్‌గార్గ్‌కు అశ్రునివాళి



**గువాహతి, సెప్టెంబరు 22:** అస్సామీ గాయకుడు జుబీన్ గార్గ్‌కు అభిమా నులు కన్నీళ్లతో నివాళులు అర్పించారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శిం చేందుకు లక్షలాదిమంది తరలివచ్చారు. గార్గ్ పార్థివ దేహాన్ని గువాహటి నుంచి ఆయన సొంతూరుకు తరలి స్తుండగా దారి పొడవునా అభిమానులు పూలవర్షం కురిపించారు. కన్నీళ్ల మధ్య ఆయనకు వీడ్కోలు చెబుతూ చేతులు జోడించి ప్రార్థించారు. గార్గ్‌ను కడసారి చూసేందుకు జనం పోటెత్త డంతో గువాహటి సిటీ స్తంభించింది. సుమారు 25 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నివాళు లర్పించడానికి భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో అంత్య క్రియల కోసం మరో రోజు పొడిగిం చాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో ఇంటర్నెట్ షేక్ అవుతోంది. గార్గ్‌పై ఇంత ప్రేమను రాగాలు ఉన్నాయా అంటూ నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. గార్గ్‌మృతికి నివాళిగా రెండురోజులు సంతాప దానాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

# ఈశాన్య రాష్ట్రాలను విస్మరించిన కాంగ్రెస్

## ఓట్లుపడకపోతే వదిలేయడం ఆపార్టీకి అలవాటే: అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రధాని మోడీ



**ఇటానగర్, సెప్టెంబరు 22:** సంక్లిష్టంగా భావించిన అభివృద్ధి పనుల ను వదిలేయడం కాంగ్రెస్ పార్టీకున్న స్వాభావికమైన అలవాటని, దీని వల్ల ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడిందని ప్రధాని నరేంద్ర మోడీవిమర్శించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో రూ.5,100 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించిన మోడీ, ఇందిరా గాంధీ పార్క్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. ఈ సందర్భంగా, నవరాత్రి మొదటి రోజు నుంచి జీఎస్టీ 2.0 అమల్లోకి రావడం, దైనందిన వస్తు, సేవల రేట్లు తగ్గడంతో, పండుగ సీజన్‌లో ప్రజలు డబుల్ బొనాంజా పొందు తారని మోడీ పేర్కొన్నారు. దిల్లీ నుంచి ఈశాన్య భారతదేశాన్ని అభివృద్ధి చేయలేమని నాకు తెలుసు. అందుకే నేను కేంద్ర మంత్రులను, అధికారులను ఈ ప్రాంతానికి తరచుగా పంపించా. నేను స్వయంగా 70 సార్లు ఇక్కడకు వచ్చాను. అయితే కాంగ్రెస్‌కు ఒక సహజమైన అలవాటు ఆపార్టీనేతలు ఎప్పుడూ అభివృద్ధి పనులు చేపట్టరు. ఒక వేళ ఏ పనైనా కష్టమని అనిపిస్తే, దానిని వదిలేస్తారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఈ అలవాటు వల్ల అరుణాచల్ ప్రదేశ్ తోపాటు ఈశాన్య రాష్ట్రాలన్నింటికీ తీవ్రస్థాయిలో హాని కలిగిందని అన్నారు. కొండలు, లోయ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం సవాల్‌తో కూడుకున్న దని అందుకే కాంగ్రెస్ ఈశాన్యాన్ని వెనుకబడిన ప్రాంతంగా ప్రకటించి, దీని అభివృద్ధిని మరిచిపోయిందన్నారు. కానీ మా హయాంలో ఒకప్పుడు రోడ్లు నిర్మించడం అసాధ్యం అని భావించి ఈ ప్రాంతాల్లో ఇప్పుడు ఆధునిక రహదారులు నిర్మితమయ్యాయనిమోడీ అన్నారు. ఒకప్పుడు ఎవరూ ఊహించని సెలా సొరంగం ఇప్పుడు సాకారమైంది. హోలోంగి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ నిర్మించాం. అందువల్ల నేరుగా ఇక్కడి నుంచి నేరుగా దిల్లీకి విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు, పర్యాటకుల ప్రయాణం ఎంతో సులభతరం అయ్యింది. అంతేకాదు రైతులు తమ ఉత్ప త్తులను పెద్ద మార్కెట్లకు తరలించడానికి ఇది ఎంతో సహాయ పడుతుందని అన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు కేవలం 2 లోక్‌సభ స్థానాలు మాత్రమే ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదని మోడీ ఆరోపించారు. 2014లో మేము అధికారంలోకి వచ్చాక, దేశాన్ని కాంగ్రెస్ మనస్తత్వం నుంచి విముక్తి చేయాలని నేను సంకల్పించాను. ఏ రాష్ట్రంలోనైనా సరే ఓట్లు లేదా సీట్ల సంఖ్య అనేది మా ప్రభుత్వానికి ముఖ్యంకాదు. దేశంగా మాకు ఫస్ట్, మా ఏకైక మంత్రం నాగరిక్ దేవో భవ (పౌరుడే మాకు దేవుడు)" అని మోడీ అన్నారు. మా హయాంలో అరుణాచల్‌ప్రదేశ్ ముందుకు సాగుతోంది. ఈ రోజు ప్రకటించిన కొత్త విద్యుత్ ప్రాజెక్టులు రాష్ట్రాన్ని ప్రధాన విద్యుత్ ఉత్పత్తిదారుగా మారుస్తాయని మోడీ అన్నారు. వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయి. తక్కువ ధరకే విద్యుత్ సౌకర్యం అందిస్తాయని విద్య, వైద్యం, వ్యాపారం, ప్రయాణ సౌకర్యాలు ప్రతి పౌరుడికి అందుబాటులోకి తెచ్చి, వారి జీవితాన్ని సులభతరం చేయడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. సోమవారం అరుణాచల్‌ప్రదేశ్‌లోని షి యోమీ జిల్లాలోని యార్జెప్ నదిపై 2 జలవిద్యుత్ ప్రాజెక్టులకు, తవాంగ్‌లో ఒక కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 2030 నాటికి భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోడీ తెలిపారు. ఇకపై దిల్లీ కేంద్ర ప్రభుత్వానికి ఈశాన్య ప్రాంతం దూరం కాదని, గత దశాబ్ద కాలంలో కేంద్ర మంత్రులు ఈ ప్రాంతాన్ని కనీసం 800 సార్లు సందర్శించారని, తరచూ మారు మూల ప్రాంతాల్లో ఉంటున్నారని మోడీ అన్నారు. "ప్రధానికి నేను ఈశాన్య రాష్ట్రాలకు 70 కంటే ఎక్కువ సార్లు వచ్చాను. గతవారమే, నేను మిజోరం, మణిపూర్, అసోంలలో పర్యటించాను. మేము డిల్లీని మీ ఇంటి ముందుకు తీసుకువచ్చాం. దేశంలో మొదటిసారిగా సూర్యోదయాన్ని చూసే రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్. దశాబ్దాల నిర్లక్ష్యం తరువాత ఇది అభివృద్ధి అనే మొదటి కిరణాలను అందుకుంటోందని మోడీవ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాల్లోని సరిహద్దు గ్రామాలను నిర్లక్ష్యం చేశాయని, అందువల్లే ఈ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లారని మోడీ ఆరోపించారు. "వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్ ద్వారా అరుణాచల్‌లోని 450కి పైగా సరిహద్దు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, ఇంటర్నెట్, పర్యాటక సౌకర్యాలను కలిగించాం. ఇవి కొత్త పర్యాటక కేంద్రాలుగా మారుతున్నాయి. అలాగే ఉడాన్ పథకం కింద మారుమూల ప్రాంతాల్లో హెలీపోర్టులను అభివృద్ధి చేస్తామని మోడీఅన్నారు.

# పరువు నష్టం కేసులు నేరచట్టాల నుంచి వేరుచేయాలి

## సుప్రీం బెంచ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** పరువునష్టం కేసులను నేర చట్టాల నుంచి వేరుచేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పరువునష్టం పేరుతో క్రిమినల్ కేసులు దాఖలు అవుతున్న సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కోర్టు ఈ రకమైన వ్యాఖ్యలు చేసింది. పరువునష్టం కేసులను డీక్రిమినలైజ్ చేయాల్సిన సమయం ఆసన్నమైనట్లు సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఆన్‌లైన్ పోర్టల్‌కు సమన్లు జారీ చేసిన కేసులో దాఖలైన పిటీషన్‌ను విచారిస్తూ కోర్టు ఈ రకంగా స్పందించింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ అమితా సింగ్ ఆ వెబ్‌సైట్‌పై పరువునష్టం కేసును వేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం దాఖలు చేసిన కేసులో అమితా సింగ్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. వాదనల సమయంలో పరువునష్టం కేసులను నేర చట్టాలనుంచి తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని జస్టిస్ సుంద్రేశ్ అన్నారు. వెబ్‌సైట్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ కోర్టు చేసిన వ్యాఖ్యలను సమర్థించారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం పరువునష్టం కేసులను నేర చట్టాల ప్రకారం పరిష్కరించనున్నారు. గతంలో ఐపీసీ సెక్షన్ 499 కింద ఈ చట్టాలను విచారించేవారు. జేఎన్‌యూ ప్రొఫెసర్ అమితా సింగ్ ఆధ్వర్యంలో 2016లో వర్సిటీపై ఓరిపోర్టు తయారైంది. వర్సిటీలో వ్యవస్థీకృత సెక్స్ రాకెట్ జరుగుతున్నట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు. 200 పేజీలు ఉన్న ఆ రిపోర్టుపై వెబ్‌సైట్ కథనాన్ని రాసింది. జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్‌కు కూడా ఆ రిపోర్టును సమర్పించినట్లు కథనంలో పేర్కొన్నారు. వర్సిటీపై రిపోర్టు తయారు చేయడంలో ప్రొఫెసర్ సింగ్ కీలక పాత్ర పోషించినట్లు కథనంలో రాశారు. దీంతో ఆ ప్రొఫెసర్ క్రిమినల్ డిఫమేషన్ కేసును దాఖలు చేశారు.



## సొంత ప్రజలపైనే పాక్ బాంబుల వర్షం: 30 మంది మృత్యువాత

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 22:** పాకిస్థాన్ వాయుసేన యుద్ధ విమానాలు ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని ఓ గ్రామంపై దాడి చేశాయి. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఇక్కడి తిర్హా లోయలోని మాత్రె దారా గ్రామంపై ఫైటర్‌జెట్‌లు ఎల్ఎస్-6 రకం 8 బాంబులను జారవిడిచాయి. దీంతో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ దాడిలో పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు స్థానిక మీడియా చెబుతోంది. దీనికి సంబంధించిన ఫొటోలు. విడియోలు వైరల్‌గా మారాయి. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక బృందాలు అక్కడికి చేరుకుని చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో భాగంగా గతంలో ఈ ప్రావిన్స్‌లో దాడులు చేసింది. నాడు కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ యేడాది జనవరిలో అంతకుముందు నెలతో పోలిస్తే ఉగ్రదాడులు 42 శాతం పెరిగాయి. ఈ విషయాన్ని పాక్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ స్టడీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బలోచిస్థాన్ తర్వాత అత్యధికంగా ఉగ్రదాడులు జరిగేది ఈ ప్రావిన్స్‌లోనే.

**పంజాబ్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదుల అరెస్టు:** అల్‌ఖైదా, ఐసిస్, టిటిపి సంస్థలకు చెందిన 89 మంది ఉగ్రవాదులను పంజాబ్ ప్రావిన్స్‌లో అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ సోమవారం వెల్లడించింది. గత మూడు నెలల్లో ఇంటెలిజెన్స్ ఆధారంగా 940 ఆపరేషన్లు చేసి వీరిని అరెస్టు చేశామంది. వారు ప్రావిన్స్‌లోని కీలక నగరాలు, భవనాలపై దాడులు చేసేందుకు ప్లాన్ చేసినట్లు ఆరోపించింది. 20 కేజీల పేలుడు పదార్థాలు, 85 డిటోనేటర్లు, ఫ్యూజ్‌వైర్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించింది.

## గ్లోబల్ టాలెంట్‌కు చైనా రెడ్ కార్పెట్

### 'కే వీసా' పేరుతో బంపర్ ఆఫర్

### అక్టోబర్ 1 నుంచి ప్రారంభించే యోచన

**బీజింగ్, సెప్టెంబరు 22:** హెచ్-1బీ వీసాపై ఆంక్షల నేపథ్యంలో చైనా విదేశీ నిపుణులకు ద్వారాలు తెరుస్తోంది. హెచ్-1బీకి పోటీగా 'కే వీసా'ను తీసుకొస్తున్నట్లు డ్రాగన్ కంట్రీ ప్రకటించింది. అక్టోబర్ 1 నుంచి దీన్ని ప్రారంభిస్తున్నట్లు ఆదివారంనాడు చైనా అధికారికంగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా స్టెమ్ రంగాల యువ నిపుణులను ఆకర్షించేందుకు చైనా కొత్త వీసాను ప్రారంభించేందుకు సిద్ధమైంది. కే వీసా పేరిట అక్టోబర్ ఒకటి నుంచి దీన్ని లాంచ్ చేస్తున్నట్టు తెలిపింది. అయితే, హెచ్-1బీ వీసాపై ఆంక్షల నేపథ్యంలో చైనా కేవీసాను లాంచ్ చేసిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్టెమ్ రంగాలకు చెందిన యువ నిపుణులను చైనాకు ఆకర్షించడమే ఈ వీసా లక్ష్యమని చెబుతున్నారు. ముఖ్యంగా దక్షిణాసియా వారిని దృష్టిలో పెట్టుకుని ఈ వీసాను చైనా ప్రారంభించిందన్న వాదన వినిపిస్తోంది. చైనా న్యాయ శాఖ ప్రకారం, సైన్స్, టెక్నాలజీ రం గాల్లోని యువ నిపుణుల కోసం ఈ 'కే వీసా'ను సిద్ధం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ యూనివర్సిటీలు, రీసెర్చ్ సంస్థల్లో స్టెమ్ రంగాల్లో బ్యాచ్‌లర్స్, ఆపై డిగ్రీలు చేసిన యువత ఈవీసాకు అర్హులు. ప్రముఖ సంస్థల్లో బోధన, పరిశోధన చేస్తున్న యువ నిపుణులకూ ఈ వీసాను జారీ చేస్తారు. ఈ వీసా కోసం కావాల్సిన ఇతర డాక్యుమెంట్స్ వివరా లను చైనా ప్రభుత్వం ఇంకా ప్రచురించాల్సి ఉంది. ప్రస్తుతం చైనా జారీ చేస్తున్న 12 రకాల వీసాల కంటే ఈ 'కే వీసా' నిబంధనలు మరింత సరళతరం. అంతేకాకుండా, చైనా సంస్థల నుంచి ఎటువంటి ముందస్తు ఉద్యోగ ఆఫర్‌లు లేకపోయినా ఈ వీసాను జారీ చేస్తారు. అంతర్జాతీయ నిపుణు లను ఆకర్షించే ప్రణాళికలో భాగంగా చైనా వలసల నిబంధ నలను మరింతగా సడలిస్తోంది. ఇందులో భాగంగానే 'కే వీసా'ను ప్రకటించింది. ఇప్పటికే 55 దేశాల పర్యాటకులకు చైనా 240 గంటల గడువుతో వీసా ఫ్రీ ట్రాన్సిట్ సదుపాయాన్ని ఆఫర్ చేస్తోంది. మరో 75 దేశాల వారికి వీసా నిబంధనల్లో ఇతర అనేక సడలింపులు కూడా ప్రకటించింది. అధికారిక డాటా ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్థంలో దాదాపు 38 మిలియన్‌ల మంది విదేశీయులు చైనాలో పర్యటించారు.



## డిజిటల్ అరెస్టు పేరిట ఢిల్లీ, కర్ణాటకలో సైబర్ నేరగాళ్ల పంజా

### ఢిల్లీలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగి నుంచి రూ.23 కోట్ల దోపిడి

### కర్ణాటకలో ఎంపి భార్యకు 14 లక్షల టోకరా

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు మితిమీరాయి. డిజిటల్ అరెస్టుల పేరిట విశ్రాంత ఉద్యోగులను మహిళలను టార్గెట్ చేయడం పెరిగిపోయింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు కర్నాటకలో జరిగిన రెండుఘటనల్లో సైబర్ నేరగాళ్లు 23 కోట్ల 14 లక్షల రూపా యలను దోచుకున్నారు. ఇందులో ఒక్క ఢిల్లీలోనే 23 కోట్ల రూపాయలను విశ్రాంత బ్యాంకు అధికారి నుంచి కాజేయగా కర్నాటకలో ఎంపి సతీమ ణి నుంచి 14 లక్షల రూపాయలను దోచుకున్నారు. వివరాలు ఇలావున్నాయి. దక్షిణ ఢిల్లీలోని గుల్మోహార్ పార్క్‌లో నివసించే 78 ఏళ్ల నరేష్ మల్హోత్రా ఓ విశ్రాంత బ్యాంకు అధికారి. నెల రోజుల క్రితం ఆయనకు ఓ ఫోన్ వచ్చింది. ఈ ఫోన్ చేసిన మహిళ తాను ప్రముఖ టెలికాం కంపెనీ సీనియర్ అధికారినని పరిచయం చేసుకుని, మీ ఫోన్‌ను మీరు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు వాడుతున్నారని బెదిరించింది. దీనిపై ముంబాయి పోలీసులు విచారణ చేస్తున్నారని హడలెత్తించింది. దీని తరువాత మరికొందరు వ్యక్తులు మల్హోత్రాకు ఫోన్ చేసి తాము ముంబాయి పోలీసులమని, ఈడీ అధికారులమని, సిబిఐ అధికారులమని బెదిరించారు. ఆగస్టు నాలుగవ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగవ తేదీ వరకు మల్హోత్రాను ఇంట్లోనే డిజిటల్ అరెస్టు పేరిట ఒకేచోట వుంచి వీడియో కాల్‌లో మాట్లాడుతూ అండర్ టేకింగ్ పత్రంపై సంతకం తీసుకున్నారు. దేశం విడిచిపెట్టి వెళ్లవద్దని బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాలు టెర్రరిస్టు గ్రూపులతో సంబంధం వుందని బెదిరించి అన్ని వివరాలు తీసుకున్నారు. ఇలా మోసగాళ్ల మాటలను నమ్మిన మల్హోత్రా వారు చెప్పినట్లుగా తన బ్యాంకు ఖాతాల నుంచి 23 కోట్ల రూపాయ లను వారి ఖాతాలకు విడతల వారిగా బదిలీ చేశారు. దీని తరువా త రెండు వారాలకు తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు దీనిపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ నెల 19వ తేదీన సైబర్ క్రైం పో లీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే రంగంలో దిగిన ఢిల్లీ పోలీసులు సైబర్ నేరగాళ్లు వాడిన బ్యాంకు ఖాతాలలో వున్న 2.3 కోట్ల రూపాయలను జప్తు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఇదిలావుండగా కర్ణాటకలో ఇటువంటిదే మరో ఘటన వెలుగు చూసింద. చిక్కబళ్లాపూర్ ఎంపి సుధాకర్ సతీమణి ప్రీతికి ఓ వ్యక్తి ఫోన్ చేసి సద బ్రత్ ఖాన్ అనే వ్యక్తి మీ పత్రాలు వాడి క్రెడిట్ కార్డు పొందాడని, దీనిద్వారా అతను చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు చేశాడని బెదిరించాడు. తాము అతన్ని అరెస్టు చేశామని, అతను ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో మీ పేరు వుందని, వెంటనే వీడియో కాల్ చేయాలని కోరాడు. ఈ కేసు నుంచి బయటప డాలంటే వెంటనే 14 లక్షల రూపాయలు తాను సూచించిన ఖాతాకు పంపాలని అతను కోరాడు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం ఈ డబ్బులను తిరిగి ఇచ్చేస్తామని సదరు వ్యక్తి తెలిపాడు. ఈ ఫోన్ చేసిన సమయంలో సదరు సైబర్ నేరగాడు ఎంపి సతీమణిని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి 14 లక్షల రూపాయలు వసూలు చేశాడు. డబ్బులు అందగానే అతను ఫోన్ కట్ చేశాడు. దీని తరువాత తాను మోసపోయానని ప్రీతి నిర్ధారణకు వచ్చి దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేబట్టారు.

## సంక్షిప్తంగా..

### సభలకు వచ్చే జనమంతా ఓటేయరు: కమల్‌హాసన్



**చెన్నై, సెప్టెంబరు 22:** బహిరంగ సభలకు, సమావేశాలకు వచ్చే జనమంతా ఓట్లు వేయరని ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ అన్నారు. ఇది టివికె అధ్యక్షుడు విజయ్‌కు మాత్రమే కాదని, తనకూ వర్తిస్తుందన్నారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ నిర్వహిస్తోన్న ప్రచార సభలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. దీనిపై రాష్ట్ర నేతలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తాజాగా కమల్‌హాసన్‌కు ప్రశ్న ఎదురైంది. సభలకు వచ్చే జనమంతా ఓటెయ్యరు. ఖచ్చితంగా అంతా ఓటింగ్‌గా మారదు. ఇది నాయ కులందరికీ వరిస్తుంది. ఇందుకు మినహాయింపేమీ కాదు. నాతో సహా భారత్‌లో ఉన్న నేతలం దరికీ ఈ మాట సరిపోతుంది అని అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్‌కు ఏం సలహా ఇస్తారని అడగ్గా సన్మార్గంలో ధైర్యంగా ముందుకు సాగుతూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు.

### ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజిత్‌సింగ్ కెనడాలో అరెస్టు



**ఒట్టావా, సెప్టెంబరు 22:** ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్‌సింగ్ గోసల్ కెనడాలో అరెస్టయ్యాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్‌సింగ్ పన్నూకు అతడు సన్నిహితుడు. 2023 నుంచి గోసల్ కెనడాలో ఎస్ఎఫ్‌జె కార్యకలాపాలు చూసుకుంటున్నాడు. ఆయుధాలు కలిగిఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను అట్టావాలో తాజాగా అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. గత నవంబరులోనూ కెనడా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గ్రేటర్ టొరంటో ఏరియాలోని ఒక హిందూ ఆలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రమేయం ఉందని ఆ సమయంలో ఆరోపణలు వచ్చాయి. తర్వాత షరతులతో కూడిన బెయిల్ మంజూరు అయింది.

### కాక్‌పిట్‌లోకి ప్రవేశించేందుకు యత్నించిన ప్రయాణికుడు: అడ్డుకున్న సిబ్బంది




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** విమానంగాల్లో ప్రయాణిస్తున్న సమయంలో దాని కాక్‌పిట్‌లోకి చొరబడేందుకు ఓ ప్రయాణికుడు తీవ్రంగా యత్నించాడు. ఈ ఘటన బెంగళూరు నుంచి వారణాసికి ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో చోటు చేసుకొంది. ఉదయం 8 గంటల సమయంలో విమానంగాల్లో ఉండగా ఓ ప్రయాణికుడు పైలట్లు ఉండే కాక్‌పిట్‌లో చొరబడాలని తీవ్రంగా యత్నించాడు. కానీ సాధ్యం కాలేదు. వెంటనే స్పందించిన సిబ్బంది అతడిని సీటులో కూర్చోబెట్టారు. విమానం వారణాసిలో దిగిన తర్వాత సిఐఎస్ఎఫ్ సిబ్బందికి అతడిని అప్పచెప్పారు. వాస్తవానికి కాక్‌పిట్‌లో ప్రవేశించే డోర్‌ను తెరవాలంటే ఓప్రత్యేకమైన పాస్‌కోడ్ ఉంటుంది. దానిని ఎంటర్ చేశాక కూడా సదరువ్యక్తి కెప్టెన్ నిర్ణయం ఆధారంగానే లోపలికి ప్రవేశించగలడు. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రత్యేకంగా స్పందించలేదు.కాకపోతే ప్రయాణికుల భద్రత విషయంలో ఏ మాత్రం రాజీపడమని పేర్కొంది. సదరు ఘటనకు సంబంధించిన రిపోర్టులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొంది.

### యుఎస్, కెనడా వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గుదల




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లాలంటే అమెరికా, కెనడాలు భారతీయుల మొదటి ఎంపికగా ఉండేవి. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆ దేశాల నేతలు తీసుకొంటున్న పలు నిర్ణయాలు ఈ గణాంకాలను తారుమారు చేస్తున్నాయి. అమెరికా, కెనడాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడమే ఇందుకు నిదర్శనం. అమెరికాకు వెళ్లే వారి సంఖ్య యేడాది కాలంలోనే 46 శాతం, కెనడాకు ప్రయాణమయ్యే వారి సంఖ్య రెండేళ్లలో 75శాతం తగ్గింది. అంతర్జాతీయ విద్యా సేవలు అందించడంలో అగ్రగామిగా ఉన్న ఐడిపి ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం ఈ మేరకు వెల్లడించింది. ఆ సంస్థ దక్షిణాసియా, కెనడా, లాటిన్ అమెరికా ప్రాంతీయ డైరెక్టర్ పీయూష్‌కుమార్ ఈ తగ్గుదలకు గల పలు కారణాలను వివరించారు. 'గత 6 నుంచి 12 నెలల్లో అమెరికా వెళ్లాలనుకున్న విద్యార్థుల ప్రణా ళికపై ట్రంప్ నిర్ణయాలు, నిబంధనలతో తీవ్ర ప్రభావం పడింది. వీసా ఆమోద రేట్లు తగ్గాయి.

### అగ్నికీలల్లో సరకు రవాణా నౌక



**పోర్‌బందర్, సెప్టెంబరు 22:** గుజరాత్ పోర్‌బందర్ పోర్టు సమీపంలో సోమవారం సరుకు రవాణా నౌకలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నౌకలో వెయ్యి టన్నుల బియ్యం, చక్కెర ఉన్నాయి. సరుకు నౌక సోమాలియాలోని బొసాసోకు వెళ్లాల్సి ఉంది. అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) నౌకలు, పోర్‌బందర్ పోర్టు అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని అగ్ని కీలలను అదుపు చేసే ప్రయత్నాలు విఫలం కాగా, నౌకను కొంతదూరం తీసుకెళ్లి వదిలేశారు. అగ్నికీలలు మరింత పెరిగితే, డీజెల్ ట్యాంక్‌లను తాకితే పెద్ద ప్రమాదం చోటు చేసుకుంటుందని అధికారులు పసిగట్టి ఈ చర్య తీసుకున్నట్లు పోర్టు అధికారులు తెలిపారు.

# కార్మికుల హక్కులను ఒక్క కలం పోటుతో కాలరాస్తారా?

**- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స**



**సచివాలయం, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ఎంతోకాలంగా కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కాలరాస్తారా అంటూ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికుల హక్కులను కూటమి సర్కార్ ఒక్క కలం పోటుతో కాలరాస్తుందని బొత్స మండిపడ్డారు. ఎన్నో ఏళ్ళ పోరాటాన్ని కాదని కార్మిక బిల్లు ఎలా పెడతారంటూ ప్రశ్నించారు. కార్మికుల పని గంటలు 8నుంచి 12గంటలకు పెంచడంపై తాము ప్రశ్నించా మన్నారు. అంత హడావుడిగా ఈ బిల్లు ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదన్నారు. చేనేత కార్మికులకు అవసరమైన ముడి సరుకు మీద జీఎస్టీని తొలగించమని అడిగితే ప్రభుత్వం స్పందించలేదు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసు మేము చదివి వెళ్ళిపోవాలన్నట్లుగా వారు చూస్తున్నారని బొత్స దుయ్యబట్టారు. జీఎస్టీపై మేము మాట్లాడుతుంటే మాట్లాడనివ్వడం లేదన్నారు. కనీసం మా సూచనలు, సలహాలు కూడా తీసుకోలేదు. చపాతి, రోటికి జీఎస్టీ లేదన్నారు. మరి ఇడ్లీ, దోశకు ఉందా? అని అడిగితే ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇస్తే 18శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. దీనిపై జీఎస్టీ కౌన్సిల్లో మాట్లాడమని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సలహా ఇస్తున్నామన్నారు. మండలిలో తాము లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం సమాధానం ఇవ్వకుండా అడ్డుకుందని బొత్స ఆరోపించారు.



# మండలిలో 3 బిల్లులు ఆమోదం

- 20 లక్షల ఉద్యోగాల కల్పన ఏదీ?
- ప్రభుత్వాన్ని నిలదీసిన వైసీపీ ఎమ్మెల్సీలు
- 4 లక్షల ఉగ్యోగావకాశాలు కల్పించాం
- 25 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం
- పరిశ్రమల మంత్రి టీజీ భరత్ వెల్లడి
- జీఎస్టీ 2.0పై అవవగాహన కల్పిస్తాం
- శాసనసభా వ్యవహారాల మంత్రి కేశవ్

**సచివాలయం, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 48వ శాసనమండలి 3వ రోజు సోమవారం ఉదయం 10గంటలకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన ప్రారంభమైంది. ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలవగానే వైకాపా ఎమెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, సిపాయి సుబ్రహ్మణ్యం, డాక్టర్ కుంభా రవిబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, పీపీపీ విధానంపై ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించినట్లు మండలి చైర్మన్ తెలిపారు.

ప్రశ్నోత్తరాల సమయంలో పేరాబత్తుల రాజశేఖరం నిరుద్యోగ యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ గురించి ప్రశ్నించగా పరిశ్రమలు, వాణిజ్య, ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ 2029 నాటికి 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు సృష్టించేందుకు వివిధ విధానాల పథక మార్గదర్శకాలను చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16వేల పోస్టులకు ప్రకటన జారీ చేయగా ఇప్పటికే 15వేల మందికి పైగా ఎంపిక పూర్తయిందని, తదుపరి జూన్ 2024 నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ 4,179, ఒప్పంద పరమైన ఉద్యోగులు 2046, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 2,868తో కలిపి 9,903మందికి ఉద్యోగ అవకాశలు కల్పించామన్నారు. అంతే కాకుండా వివిధ విభాగాల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా జూన్ 2024 నుంచి రాష్ట్రంలో 3.48లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, అదనంగా నైపుణ్యాభివృద్ధి శాఖ నిర్వహించిన జాబ్‌మేళాల ద్వారా దాదాపు 82,012మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ భిక్షాటన నిరోధక చట్టం 1977, సవరణ బిల్లును ఆంధ్రప్రదేశ్ బిక్షాటన నిరోధక చట్టం 2025గా పేర్కొంటూ, ఆంధ్రప్రదేశ్ భిక్షాటన నిరోధక చట్టం 1977లోని క్లాస్(6)లో సబ్ క్లాస్(2)లో కుష్టురోగి లేదా పిచ్చివాడు అను పదములకు బదులుగా కుష్టువ్యాధి బాధిత వ్యక్తి లేదా మానసిక అనారోగ్యం గల వ్యక్తిగా మారుస్తూ సవరణలను ప్రతిపాదించగా మండలి ఆమోదం తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమీషన్ (సవరణ) చట్టం, 2025ను మహిళా మరియు శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం కమీషన్ చైర్మన్ లేదా సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించిన తేది నుండి రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగడం, మరియు ఆ సభ్యుల వయోపరిమితిని సడలిస్తూ అంటే 65సంవత్సరాల వరకు వయోపరిమితిని పెంచుతూ చేసిన సవరణ బిల్లును శాసనమండలి ఆమోదించింది.

ఆంధ్రప్రదేశ్ దుకాణాలు మరియు స్థాపనల చట్టం, 1988ని సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ షాప్స్ మరియు ఎస్టాబ్లిష్‌మెంట్స్(సవరణ) చట్టం 2025ని పరిశ్రమల శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ మండలిలో ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం ఏ దుకాణంలోని ఉద్యోగి ఆయినా ఏ రోజైన పది గంటలకు మించి మరియు ఏ వారంలోనైనా 48గంటలకు మించి పని చేయకూడదని లేదా అనుమతించకూడదని తెలిపారు. రాత్రిపూట మహిళలు పూర్తి భద్రతల నడుమ పనిచేయవచ్చు వంటి సవరణలతో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు విపక్ష నేతల నుండి కొంత వ్యతిరేకత ఎదురైనప్పటికీ మెజార్టీ సభ్యులు ఆమోదించడంతో మండలిలో బిల్లుకు ఆమోదం దక్కింది.

జీఎస్టీ 2.0పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈనెల 22వ తేది నుండి అక్టోబర్ 25వరకు నెలరోజులపాటు జిల్లా, గ్రామ స్థాయి వరకు బృహత్తరమై ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ, వాణిజ్య పన్నులు, పంచాయతీరాజ్ శాఖాధికారులు ఈ బృహత్తరమైన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.



శ్రీకాళహస్తిలో వాసవి అమ్మవారి విగ్రహాన్ని గ్రామోత్సవం

# కన్నులపండువగా వాసవి అమ్మవారి దసరా ఉత్సవాలు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణంలోని బజారువీధి, ఉప్పువీధిలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు సోమవారం నుంచి కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. అనంతరం గణపతి పూజ, స్వస్తివాచనం నిర్వహించారు. బజారు వీధిలోని ఆలయంలో కమిటీ అధ్యక్షులు జూలుగంటి మురళీకృష్ణ సాధర్యంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం సంప్రదాయ బద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉభయదారులు పొట్టి భాస్కర్ గుప్తా, పొట్టి హరీష్‌లు వెంట రాగా సభ్యులతో కలసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉప్పువీధిలోని ఆలయంలో ఉభయదారులు అమ్మవారికి సాంగ్యం తీసుకువచ్చారు. అయితా సాయిబాబా, అయితా చిరంజీవి అయితా శ్రీనివాసులు కుటుంబసభ్యులు అమ్మవారి పూజలకు శాస్త్రోక్తంగా పూజా ద్రవ్యాలను తీసుకువచ్చి సమర్పించారు. తొలిరోజు ఉప్పువీధిలోని అమ్మవారు బాల వసవీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రెండు ఆలయాల్లో వాసవీ ఆర్యవైశ్య సమాజం కమిటీ, మహిళా, యువజనసేవా సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# దక్షిణ కైలాసంలో వైభవంగా దసరా మహోత్సవాలు

### కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తిలో ఆలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. వివిధ అలంకారాలతో భక్తుల్ని ఆకట్టుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మూలవిరాట్టు జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి ఎదురుగా బొమ్మల కొలువు ఆకర్షణీయంగా మారింది. అనుబంధ ఆలయాలైన ముత్యాలమ్మ ఆలయం, ఏడుగంగమ్మల ఆలయాలకు మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతున్నారు. పూజలు చేస్తున్నారు.




కనకాచలంపై మొక్కులు తీర్చుకొనుటకు పిండి దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

### శక్తి ఆలయాల్లో దసరా మహోత్సవాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి అమ్మవారికి సారెను కాసరం బాలాజి సారధ్యంలో సమర్పించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు సారథ్యంలో అంకుర్పారణ కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కలశ స్థాపన గావించి పూజలు జరిపారు. తరువాత అమ్మవారికి షోడషాభిషేకాలు నిర్వహించారు. భక్తులు భక్తి పారవశ్యంతో పులికిస్తూ దుర్గమ్మ అమ్మవారి నామసర్మణ గావించారు. ఈ కార్యక్రమాల్లో ఉభయ కర్తలు కాసరం బాలాజి దేవస్థానం ఏఈవో హేమామాలిని, ఆలయ పొరోహితులు అర్ధగిరి వేదమంత్రాలను పఠిస్తుండగా కలశ స్థాపన గావించారు. ఆలయ ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, అలయ అర్చకులు తులసీ శర్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మూల విరాట్టు అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం నిర్వహించారు.

# వచ్చే జూన్‌కి 2,61,640 టిడ్కో ఇళ్లు పూర్తి

- గత ప్రభుత్వం హయాంలో అక్రమాలు
- 4,39,841 ఇళ్ళను రద్దు చేసింది
- కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు
- ఇళ్లు ఇవ్వకుండానే లబ్ధిదారుల పేరు మీద బ్యాంకు లోన్‌లు తీసుకుంది
- అసెంబ్లీలో మంత్రి పొంగూరు నారాయణ



**విజయవాడ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం టిడ్కో ఇళ్ళలో అనేక అవకతవకలకు పాల్పడిందని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు. వచ్చే జూన్ నెలాఖరు లోపు టిడ్కో ఇళ్ళను పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ళ పరిస్థితి లబ్ధిదారులకు ఇళ్ళ అప్పగింతపై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాచారమిచ్చారు. 2014-19లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 7,01,481 ఇళ్ళను కేటాయించిందన్నారు. వీటిలో 5 లక్షల ఇళ్ళ నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లు కూడ పిలిచి పనులు ప్రారంభించామన్నారు. అయితే గత ప్రభుత్వం ఈ 5 లక్షల ఇళ్ళను 2,61,640కు తగ్గించేసింది. అంటే మొత్తంగా 4,39,841 ఇళ్ళను రద్దు చేసిందన్నారు. ఈ ఇళ్ళను కూడ పూర్తి చేయలేదు. అత్యాధునిక షీర్ వాల్ టెక్నాలజీ ఇంటి సామాగ్రి కూడ అత్యాధునికమైన నాణ్యమైనది వాడేలా అన్ని వసతులు, పార్కులు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ళు, ఆస్పత్రి వంటివి కూడ నిర్మించేలా డిజైన్ చేశాం. కానీ గత ప్రభుత్వం వాటన్నింటినీ నాశనం చేసింది. 2019 మే నాటికి 77,350 ఇళ్ళను 90 నుంచి 100 శాతం పూర్తి చేస్తాం... కానీ గత ప్రభుత్వం ఇళ్ళను పూర్తి చేసినా ఎక్కడా మౌలిక వసతులు మాత్రం కల్పించలేదన్నారు మంత్రి నారాయణ. 103 యూఎల్‌బీలలో పనులు ప్రారంభిస్తే గత ప్రభుత్వం 88 యూఎల్‌బీలకు పరిమితం చేసి 15 వేల ఇళ్ళను పూర్తిగా తొలగించేసింది. కేవలం1,07,546 ఇళ్ళు పూర్తి కాగా 84,094 ఇళ్ళు నిర్మాణం జరుగుతున్నాయి. గత ప్రభుత్వం నిధుల విషయంలో కూడా జీవోలు ఇచ్చింది తప్ప... డబ్బులు ఇవ్వలేదు. లబ్దిదారులు వాటా తగ్గించామని చెప్పి జీవోలు ఇచ్చారు తప్ప నిధులు ఎక్కడా విడుదల చేయలేదు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన రూ.3100 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేసాం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి హాడ్కో నుంచి రూ.4450 కోట్లు రుణం తీసుకున్నాం. లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్ళ మీద రుణాలు రూ.1725 కోట్లు తీసుకుంటున్నాం. అమృత్ పథకం నిధులు రూ.225 కోట్లు ఖర్చు పెట్టేలా మొత్తం ప్రాజెక్ట్ డిజైన్ చేశాం. మరో రూ.818 కోట్లు వివిధ రూపాల్లో తీసుకునే ఆలోచనలో ఉన్నాం. 2014-19లో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 52,192 మందిని అనర్హులుగా ప్రకటించి వారికి ఇళ్ళు ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఇళ్ళు నిర్మించకుండానే లబ్ధిదారుల పేరు మీద లోన్‌లు తీసుకుందని మంత్రి చెప్పారు. దీంతో బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు ఒత్తిడి రావడంతో రూ.140 కోట్లను ఈ ప్రభుత్వం చెల్లించింది. ఇళ్ళకు అప్పటికే రంగులు వేసినప్పటికీ గత ప్రభుత్వం పార్టీ రంగులు వేసుకుందని... దీనికి సంబంధించి కూడ కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వలేదన్నారు. ఇక ప్రతినెలా కట్టాల్సిన 6 కోట్ల రూపాయలను కూడ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మొత్తంగా వచ్చే జూన్ నాటికి 2,61,640 ఇళ్ళను పూర్తి చేసి అన్ని మౌలిక వసతులు కల్పించేలా ముందుకెళ్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ లోగా ఇళ్ళు పూర్తయ్యే చోట ప్రతి శనివారం లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించాలని మున్సిపల్ కమీషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, విష్ణుకుమార్‌రాజు. పంచకర్ల రామకృష్ణ, రామకృష్ణ వెలగపూడి, దూళిపాళ నరేంద్ర కుమార్, పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, ముత్తుముల అశోక్‌రెడ్డిలు ఈ స్వల్ప కాల వ్యవధిపై జరిగిన ప్రశ్నపై జరిగిన చర్చలో పాల్గొన్నారు.



తాడిపత్రిలోని అశోక్ పిల్లర్ వద్ద బైఠాయించిన నిరసన తెలుపుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శిస్తున్న చల్లా లక్ష్మి

# నా ప్రశ్నలకు బదులేదీ?

**- పోలీసులు జవాబు ఇవ్వలేదంటూ జేసీ నిరసన**

**- డీఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయింపు**

**తాడిపత్రి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలు అడిగితే పోలీసులు సరైన సమాధానం ఇవ్వలేదంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి బందోబస్తుకు ఏర్పాటు చేసిన పోలీసుల వివరాలు, సదరు బందోబస్తుకు అయ్యే ఖర్చుల వివరాలు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేతిరెడ్డి పెద్దారెడ్డి చెల్లిస్తున్నారా లేదా అంటూ తాను తమ న్యాయ వాదితో లిఖిత పూర్వకంగా కోరినా ఇంత వరకు సమాధానం లేదంటూ ఆయన ఆందోళనకు దిగారు. మొదట తన ప్రశ్నలకు సమాధానం కావాలంటూ ఎస్‌డీపీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. తమ అనుచరులపై కేసులు నమోదు చేయడాన్ని కూడా ఆయన పోలీసు అధికారులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి కార్యాలయం బయటకు వచ్చి లోనికి ఆహ్వానించినా జేసీ అంగీకరించక తన ప్రశ్నలకు సమాధానం కావాలని పట్టుపట్టారు. ఏఎస్పీ నుంచి సమాధానం లేకపోవడంతో అక్కడి నుంచి అశోక్ పిల్లర్ వరకు వచ్చి అక్కడ ఒక కుర్చీలో ఒంటరిగానే కూర్చొని మౌనంగా నిరసనకు దిగారు. క్రమంగా తన అనుచరులు కూడా మద్దతుగా జతచేరారు. ఈ సందర్భంగా అవుకు నుంచి అనంతపురానికి అటుగా వెళుతున్న దివంగత చల్లా భగీరథరెడ్డి భార్య చల్లా లక్ష్మి తన ఇద్దరు కుమారులతో కలసి వచ్చి నిరసనలో పాల్గొంటున్న జేసీని పరామర్శించారు. దాదాపు రెండు గంటలకు పైగా మౌనంగానే నిరసన తెలిపిన తర్వాత పోలీసు ఉన్నతాధికారులు ఫోన్‌లో సర్దిచెప్పిన తర్వాత ఆయన తన నిరసనను విరమించారు.

# బాలాత్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మ

- మొదటిరోజే భక్తుల వెల్లువ
- పర్యవేక్షించిన మంత్రులు, అధికారులు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ దసరా ఉత్సవాల్లో మొదటిరజు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులను కటాక్షించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ లక్ష్మీషా, కమీషనర్ రామచంద్రమోహన్, ఈవో వీకే శీనా నాయక్ ఏర్పాట్లు పరిశీలిస్తూ భక్తుల మన్ననలందుకున్నారు. మొదటిరోజు సాయంత్రం 5 గంటలకు 47,148 మంది భక్తులు దర్శించుకున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. 14,844 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. వృద్ధులకు, వికలాంగులకు బ్యాటరీ బండ్ల ద్వారా ఆలయానికి తీసుకొచ్చి శ్రీఅమ్మవారి దర్శన ఏర్పాటు చేశారు. మొదటిరోజు సాయంత్రం 5 గంటల వరకు టికెట్ల అమ్మకం, ప్రసాదాలు ద్వారా మొత్తం 22,79,264ల ఆదాయం లభించిందని మంత్రి ఆనం తెలిపారు.

### దుర్గమ్మ సేవలో వీఐపీలు

దుర్గమ్మవారిని మొదటిరోజు జస్టిస్ రఘునందన రావ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హోమ్‌మంత్రి అనిత, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, సినిమా సంగీత దర్శకుడు మణిశర్మ, కలెక్టర్ లక్ష్మిషా, శ్రీకాళహస్తి ఈవో, ఎమ్మెల్యే సుజనా చౌదరి దర్శించుకున్నారు.

### భక్తులందరికి అన్నప్రసాదం ఏర్పాటు

దుర్గమ్మవారిని దసరా ఉత్సవాల్లో దర్శించుకోడానికి వచ్చే భక్తులందరికి అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మిషా తెలిపారు. అన్నప్రసాదాన్ని ఆయన స్వయంగా స్వీకరించారు. నాణ్యత, రుచి బాగుందన్నారు.

దుర్గమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది.

దసరా ఉత్సవాలకోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌రూం ద్వారా భక్తుల రద్దీ, భద్రత, సౌకర్యాలపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, మున్సిపల్ కమీషనర్ ధ్యాన్‌చంద్, ఈవోలు పరిశీలించి తగు చర్యలు తీసుకున్నారు. వైద్య శిబిరాల వద్ద సేవలందించే ఏర్పాటును వారు పరిశీలించారు.

### యాగశాల, పూజామండపం ప్రారంభం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నూతనంగా నిర్మించిన రాతి యాగశాల, పూజా మండపాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో



నగరోత్సవంలో శ్రీ స్వామి అమ్మవార్ల అనుగ్రహం



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న కమీషనర్



డిప్యూటి సిఎం పవన్‌కల్యాణ్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో



కమాండ్ కంట్రోల్‌రూం ద్వారా సౌకర్యాలు పరిశీలిస్తున్న కలెక్టర్



అన్నప్రసాదం స్వీకరిస్తున్న కలెక్టర్

### 4500 మంది పోలీసులతో భద్రత

దసరా ఉత్సవాల్లో భక్తులకు సేవలందించేందుకు 4500 మంది పోలీసులను ఏర్పాటు చేసినట్లు హోమ్‌మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉత్సవాలు విజయవంతం చేయడానికి తగు చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారం మంత్రి దుర్గమ్మవారిని దర్శించుకున్నారు.

## దసరా ఉత్సవాల సందర్భంగా

# విజయవాడలో ట్రాఫిక్ మళ్ళింపు

**విజయవాడ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త ప్రతినిధి:** 'దసరా సందర్భంగా విజయవాడ ప్రజలకు, భక్తులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను మళ్ళిస్తున్నట్లు నగర పోలీస్ కమీషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు తెలిపారు. సోమవారం నుండి అక్టోబరు 2 వరకు ఈ మళ్ళింపులు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ వైపు నుంచి విశాఖపట్నం వైపునకు నల్లగుంట వద్ద నుంచి వెస్ట్ బైపాస్ మీదుగా చిన్న అవుటపల్లి హనుమాన్ జంక్షన్ వైపు వెళ్ళాలి. అటు నుంచి కూడా ఇదే మార్గంలో రావాల్సి ఉంటుంది. హైదరాబాద్ వైపు నుంచి మచిలీపట్నం వైపు వెళ్ళే వాహనాలు నల్లగుంట వద్ద వెస్ట్ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి, కేసరపల్లి మీదుగా వెళ్ళాలి. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో పయనమవ్వాలి. హైదరాబాద్ వైపు నుంచి గుంటూరు, చెన్నై వైపుకు నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ళ, అద్దంకి, మేదరమెట్ల మీదుగా రాకపోకలు సాగించాలి. చెన్నై వైపు నుంచి విశాఖపట్నం వైపు రాకపోకలకు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్ళాలి. నగరంలో భవానీ పురం వైపు నుంచి వచ్చే వాహనాలు కుమ్మరిపాలెంలోని తితిదే పార్కింగ్, ఎంవీరావు ఖాళీ స్థలం, పున్నమిఘాట్, భవానీఘాట్, సుబ్బారాయుడు పార్కింగ్, సెంట్రల్ వేర్ హౌస్ గ్రౌండ్, గొల్లపూడి మార్కెట్ యార్డ్ పార్కింగ్, భవానీపురం లారీ స్టాండ్, సోమా గ్రౌండ్, సితార సెంటరు, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, గొల్లపూడి పంటలకాలువ రోడ్డులో నిలపాలి. గుంటూరు, మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ వైపు నుంచి వచ్చే వాహనాలు బీఆర్‌టీఎస్ రోడ్డు, సంగీత కళాశాల మైదానం, ఎఫ్ఐసీ మట్టి రోడ్డు పార్కింగ్, జింఖానా మైదానంలో పార్కింగ్ చేయాలి.

# ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

**- ఎపి జేఏసీ అమరావతి ముఖ్య సంఘాల డిమాండ్**

**విజయవాడ,సెప్టెంబరు 22, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ జెఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావులు పేర్కొన్నారు. విజయవాడలోని రెవిన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ కార్యదర్శివర్గ సభ్యులు, ముఖ్య సంఘాల నాయకుల సమన్వయ సమావేశం జరిగింది. ప్రస్తుతం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరిపై ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.30 వేల కోట్ల వరకు ఉన్నాయని, కొంతమంది రిటైరైన ఉద్యోగుల బకాయిలు అందుకోకుండానే చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వీరికి న్యాయం జరగాలంటే గతంలో మాదిరిగా ఉద్యోగ విరమణ చేసిన రోజే... గ్యాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు చెల్లించేలా చూడాలని కోరారు. గత నెల 20న సీఎస్ అధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని కోరామన్నారు. దసరా కానుకగా కనీసం డీఏలు, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ కమీషనర్ నియామకం చేపట్టాలని కోరారు. ఏపీ జెఏసీ అమరావతి నాయకులు టీవీ ఫణిపేర్రాజు, కె.సంగీతరావు, శాస్త్రీజీ, శివానందరెడ్డి, ఎస్.మల్లేశ్వరరావు, అర్లయ్య, ఉద్యోగులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.



# రెండోవరోజు బ్రహ్మచారిణి దేవి




యా దేవీ సర్వ భూతేషు శాంతి రూపేణ సంస్థితా, యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా, యా దేవీ సర్వ భూతేషు మాతృ రూపేణ సంస్థితా, యా దేవీ సర్వ భూతేషు బుద్ధి రూపేణ సంస్థితా, నమస్తస్యై, నమస్తస్యై, నమస్తస్యై నమో నమః.?

**మంత్రం :- ఓం బ్రాం బ్రం బ్రూం బ్రహ్మచారిణ్యై నమః.?**


నారదుని ఉపదేశముతో పరమేశ్వరుని భర్తగా పొందుటకు శైలపుత్రి ఘోర తపమాచరించెను. తపస్సు ప్రారంభములో ఫలములను స్వీకరిస్తూ కొంతకాలము పచ్చి కాయగూరలతో, కొంతకాలము రాలిన ఆకులను తిని, మరి కొంతకాలము తపస్సు చేసెను. 'ఎండలకు ఎండుచూ, వానలకు తడుస్తూ, మంచినీరు కూడా ముట్టక నిరాహారముగా, ఇంకొంత కాలం తపస్సును కొనసాగించెను.' ఇట్టి కఠిన తపశ్చర్య కారణముగా ఈమెకు తపశ్చారిణి, బ్రహ్మచారిణి అను పేరు స్థిరపడెను. పర్ణములను (ఆకులను) గూడ భుజింపకుండుట వలన యా దేవికి అపర్ణ అను పేరు స్థిరపడెను. యా దేవి ఘోర తపస్సుకు బ్రహ్మదేవుడు మెచ్చుకుని 'ఓ బ్రహ్మచారిణిదేవీ ఇంతవరకు ఎవ్వరు ఆచరింపలేని నీకే సాధ్యమైన ఇట్టి కఠోర తపస్సు అలౌకికమైనది. నీ మనోవాంఛ నెరవేరి చంద్రమౌళియైన పరమేశ్వరుడు నీకు పతియగును. తపస్సు విరమించమని' పలికెను. నవదుర్గలలో రెండవ అవతారం బ్రహ్మచారిణీదేవి కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలము ధరించిన ద్విభుజి. బ్రహ్మచారిణీదేవి ఉపాసన వలన సాధకులకు 'తపస్సు, త్యాగము, వైరాగ్యము, సదాచారము, సంయమనము వృద్ధిచెంది స్వాధిష్ఠాన చక్రము మేల్కొనును.'

## దుర్గా మీనాక్షి ఆలయంలో ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు



**శంఖవరం, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :** శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతయ్యమ్మపేట పంచాయతీలో వేంచేసి యున్న దుర్గా మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తులసి గుర్రప్ప మనవడు తులసి ఉదయ్ అపర్ణ చే అమ్మవారి ఆలయంలో కలశ ప్రతిష్టతో శరన్నవరాత్రులను ప్రారంభించారు. వీరితో ఆలయ పూజారి కాకర కామేశ్వర శివప్రసాద్, సతీష్ శర్మ విఘ్నేశ్వర పూజ, మండపారాధన, నవగ్రహ దేవతల ఆవాహనం, సహస్రనామాలతో కుంకుమ పూజ, మంత్రపుష్పం, నీరాజనం నిర్వహించారు. కొండ దిగులు నెలకొన్న కనకదుర్గమ్మ వారికి శరన్నవరాత్రులు ప్రారంభ సందర్భంగా అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఆలయ పూజారి మాట్లాడుతూ అమ్మవారు ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తామని, ఉదయం సహస్రనామాలతో కుంకుమ పూజ, సాయంత్రం అష్టోత్తర పూజ నిర్వహిస్తామని, భక్తులందరూ పాల్గొని అమ్మవారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉగ్గిరాల నాగేశ్వరరావు, కొయ్య శ్రీను వెంకట్ అడపా సత్తిబాబు ఓరుగంటి రామస్వామి పాలివు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రా శబరిమలైలో బంగారు, వెండి లక్ష్మీదేవి పీఠాలు ప్రారంభం





**శంఖవరం, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )** శంఖవరం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఆంధ్రా శబరిమలై దేవస్థానంలో ప్రత్యేకంగా నిర్మించిన బంగారు, వెండి లక్ష్మీదేవి పీఠాలను 108 వెండి లక్ష్మి దేవి, ఒక బంగారు లక్ష్మి దేవి విగ్రహాలతో వైభవంగా ప్రారంభించారు. ఈ శుభకార్యాన్ని దేవస్థానం గురుస్వామి, ఆలయ చైర్మన్ కుసుమంచి సత్య శ్రీనివాసరావు గురు స్వామి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సత్య శ్రీనివాసరావు స్వామి మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి కష్టాలు తొలగిపోయి, సంపద, శ్రేయస్సు కలగాలనే ఉన్నత సంకల్పంతో ఈ పీఠం నిర్మించామని తెలిపారు. ఈ పీఠం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, కలశ స్థాపన కార్యక్రమాలు భక్తి పారవశ్యాన్ని కలిగించాయి. ఈ కొత్త పీఠం వల్ల అయ్యప్ప అశీస్సులతో పాటు, లక్ష్మీ దేవి అశీస్సులు కుడా భక్తులంతా ఆర్థికంగా ఎదగాలని చైర్మన్ సత్య శ్రీనివాసరావు కోరారు. ఆంధ్రా శబరిమలైకు హాజరైన భక్తులు లక్ష్మీదేవి అమ్మవారికి పసుపు, కుంకుమ, ముత్యాలతోనూ, వజ్రాలతోనూ పూజించే అవకాశం కల్పించారు. ఈ అరుదైన అవకాశం ఇప్పటి వరకు ఇదే ప్రథమం, ఆంధ్రా శబరిమలై ఆలయం ఇప్పటికే రాష్ట్రంలోని అయ్యప్ప భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచింది. ఇప్పుడు కొత్తగా ప్రారంభమైన బంగారు, వెండి లక్ష్మీదేవి ఆలయాలు దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతాయని, స్థానిక ప్రజల విశ్వాసాన్ని, ఆరాధనను బలపరుస్తుందని భావిస్తున్నారు. ఈ ఆలయం ప్రారం భం కావడంతో, శంఖవరం మండలం లోని ప్రాంతమంతా ఆధ్యాత్మిక పర్యాట కానికి ప్రాముఖ్యమైన కేంద్రంగా మారుతుందని స్థానికులు అభిప్రాయ పడుతూ చైర్మన్ సత్య శ్రీనివాసరావు గురుస్వామిని అభినందనలతో ముంచెత్తారు.

## రామచంద్రపురం- తామరాడ బ్రిడ్జి వరకు సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు

### - జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్



**గండేపల్లి , సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామం నుంచి జగ్గంపేట మండలం రామవరం గ్రామం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడటంతో జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ తన సొంత నిధులతో భారీగా దెబ్బతిన్న రామచంద్రాపురం శివారు నుంచి తామరాడ బ్రిడ్జి వరకు మరమ్మత్తులు చేయించడం జరిగింది. కొన్ని కారణాలతో ఈ రోడ్డు పనులు ఆగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తుమ్మలపల్లి రమేష్ కి విన్నవించుకోవడంతో తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అలసత్వం వల్ల ఈ రోడ్డు పూర్తి చేయలేకపోయారని కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు పూర్తి చేస్తుందని రోడ్డు త్వరగా పూర్తయ్యేలా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ తో కలిసి కృషి చేస్తానని అన్నారు.

## దూరం భారంగా మారింది..దగ్గరలో ఉన్న రెవిన్యూ డివిజన్లో కలపాలి

### నియోజవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసరి



**అంబాజీపేట, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :** దూరం భారంగా మారిందని మా మండలాలను ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాపురం రెవెన్యూ డివిజన్లో కలపాలని పి. గన్నవరం నియోజకవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ జిల్లా కలెక్టర్కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కొత్తపేట రెవెన్యూ డివిజన్లో పి.గన్నవరం నియోజవర్గంలోని అంబాజీపేట,అయినవిల్లి మండలాలను విలీనం చేసిందన్నారు. గతంలో సుమారు ఐదు కి.మీ పరిధిలో ఉండే అమలాపురం రెవెన్యూ డివిజన్లో అంబాజీపేట, అయినవిల్లి మండలాలు ఉండేవన్నారు. ఈ రెండు మండలాలకు కొత్తపేట సుమారు 20 కిలోమీటర్లు దూరం కావడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి అనేక సమస్యలకు కారణమైందని, భౌగోళిక పరంగా కూడా సమస్యలు వచ్చాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నూతన జిల్లాల సమస్యలపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిందని,కావున తగిన చర్యలు తీసుకుని ఈ రెండు మండలాలను అమలాపురం రెవెన్యూ డివిజన్లో కలపేలా కృషి చేయాలని కలెక్టర్ ను కోరారు. గత వైసిపి ప్రభుత్వం హడావిడిగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారని, ఏ ఒక్క కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించలేదని, కలెక్టరేట్లో శాశ్వత భవనాలు నిర్మించి, జిల్లా కార్యాలయాలు అన్ని ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళతానని దాసరి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు.

# వాడపల్లి క్షేత్రంలో దేవి శరన్నవరాత్రుల శోభ

**- భవాని మాలధారణతో దీక్షలు చేపట్టిన భక్తులు**
**- స్వామి వారి ఒక్క రోజు ఆదాయం, రూ,4.39 లక్షలు**
**- వెంకన్న నిత్యాన్నధాన పథకానికి రూ,1. 25లక్షలు విరాళం**



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :** ప్రముఖ పుణ్యక్షేత్రం గా విరాజిల్లు తున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం సోమవారం దేవి శరన్నవరాత్రుల శోభ సంతరించుకుంది. క్షేత్రపాలుకులైన శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా బాల త్రిపుర సుందరి దేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు కుమార శర్మ మాట్లాడుతూ వాడపల్లి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామస్తులు సహకారం తో ఆలయ ప్రాంగణంలో వెంచేసియున్న శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి వారి ఆలయం లో దేవి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉదయం విగ్నేశ్వర పూజ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. నేటినుండి అక్టోబర్ 2వతేది వరకు దసరా ఉత్సవాలు ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి అమ్మవార్ల ను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడు వారల వెంకటేశ్వరస్వామివారికి ఉదయం శ్రీ లక్ష్మి ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, బాలభోగం, నివేదన, పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వేలాది మంది శ్రీ స్వామివారిని దర్శించుకుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో గోవింద నామస్మరణతో మర్మోగాయి. దేవస్థానం లో జరిగే నిత్యన్న పథకం లో భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. రాజమండ్రి చెందిన కంకటాల సుబ్రహ్మణ్యశ్వరరావు, లక్ష్మి సుందరి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,007 లు అలాగే రావులపాలెం మండలం, కొమ్మరాజులంక చెందిన సత్తి కుమారి. దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 25,116లు శ్రీ స్వామి వారి నిత్యా అన్నదాని పథకానికి విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్. కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీను, స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ, 4,39,571లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.



## ఆదిత్యలో ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు



**గండేపల్లి, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలశ స్థాపన తో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హో పూజా కార్యక్రమంలో ఆదిత్య అధినేత శేషారెడ్డి లక్ష్మీరాజ్యం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు సందర్భంగాహోఈ నెల 29 మూలా నక్షత్రం ,అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా సరస్వతీ అవతారం, మూల పూజ. 30వ తేదీ దుర్గాష్టమి,దుర్గ హోమం .అక్టోబర్ 1 మహర్నవమి, విశేష పూజలు. 2 వ తేదీ విజయదశమి విశేష అభిషేకాలు,అర్చనలు నిర్వహించబడతాయని ఆలయ అర్చకులు శ్రీరామ్ శర్మ తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మ కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఎట్టకేలకు ఎఫ్ఎసి ఏపీఓసురేష్ కుర్చీ వదిలారు!

**రౌతులపూడి,సెప్టెంబర్ 22, ( ప్రభాతవార్త)** రౌతులపూడి మండలంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ విభాగానికి ఇప్పటివరకు టెక్నికల్ అసిస్టెంట్ అయినదాట్ల సురేష్ ఎఫ్ఎసి ఏపీవోగా పని చేశారు. ఆయనను బదిలీ చేస్తూ ఈనెల 4న కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయిన ప్పటికీ ఆయన రిలీవ్ కాలేదు. దీనిపై ఈనెల 19న వార్త జాతీయ దినపత్రికలో రాజకీయ పైరవీలతో కుర్చీ వదలని ఏపిఓ కథనం ప్రచురితమైనది. వెంటనే ఎండి వో జి. శివరామకృష్ణయ్య స్పందించి రిలీవ్ ఆర్డర్ జారీ చేశారు. సోమవారంఎఫ్. ఏ.సి ఏపీవో సురేష్ రిలీవ్ ఆర్డర్ తీసుకున్నారు. ఎట్టకేలకు ఆయన కుర్చీవీడారు.

## నేడు బ్రహ్మచారిణి దేవి అవతారంలో అమ్మవారు దర్శనం

**కోనసీమ బ్యూరో,సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )** అమలాపురం, పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఎదురుగా శ్రీసాయికృష్ణ నగర్లో గల ప్రణవనాద నిలయమునందు శ్రీదేవి శరన్నవరాత్రి పూజా మహోత్సవాలలో భాగంగా దుర్గాదేవిని సంప్రదాయం ప్రకారం తొమ్మిదిరోజులు నవదుర్గా స్వరూపంగా ఆరాధించడం జరుగుతుంది. నేడు రెండవ రోజు బ్రహ్మ చారిణి దేవి అవతారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు పొందగలరని వారుకోరారు.

## ర్యాలి,జగన్మోహిని కేశవ స్వామి ఆలయ చైర్మన్ గా మెర్ల నాగేశ్వరావు



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :** అతి పురాతన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి, గోపాలస్వామి వారి ఆలయ పాలక మండలి నూతన చైర్మన్ గా మెర్ల నాగేశ్వరరావు ఎన్నికపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. దసరా నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం నాగేశ్వరరావు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి నాగేశ్వరరావుకు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు చరిత్ర పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు. పాలకమండలి సభ్యులుగా. అత్తిలి వెంకటేశ్వరరావు, దూలం విష్ణుమూర్తి, మెర్ల ఉదయభాస్కర్, ఏవివి సత్యనారాయణ ప్రసాద్, ఉమ్మడిశెట్టి తులసి పార్వతి, కుడుపూడి అంకాలమ్మ, జగత దుర్గాభవాని, బుడిగా రామలక్ష్మి, కొల్లేటి నరసయ్య, మానుపాటి లోవ, నియమితులయ్యారు అలాగే సమయ మంతుల మాతం శెట్టి వారి అన్నదాన సత్రం చైర్మెన్ గా. వరద శేషారత్నం, నియమితులయ్యారు. నియామకం పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, పలువురు కుటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు కృతజ్ఞతలు ఆయన తెలియజేశారు.

## జీవిత బీమా, హెల్త్ పాలసీలపై జిఎస్టి తొలగింపు పై మాజీ ఎంపీ వంగా గీతా కు అభినందనలు



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :** ఇన్సూరెన్స్ పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగింపు నిర్ణయం మేరకు మాజీ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ ను రాజమండ్రి డివిజన్ ఎల్ఐసి ఏజెంట్ అసోసియేషన్ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు. జీవిత భీమా ,ఆరోగ్య పాలసీలపై జిఎస్టి రద్దు చేసిన సందర్బంగా పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ మెయిన్, కాకినాడ కాబ్ బ్రాంచ్ ల నుంచి ఎల్.ఐ.సి ఏజెంట్లు వెళ్లి మాజీ పార్లమెంట్ సభ్యులు వంగా గీతా విశ్వనాథ్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. గత పదకొండు సంవత్సరాలుగా ఎల్.ఐ.సి. ప్రీమియంపై జీఎస్టీ రద్దు సమస్యను అప్పట్లో ఎంపీ గా వున్న వంగా గీతా విశ్వనాథ్ ఆల్ ఇండియా లియాఫి నాయకులు విన్నవిం చడంతో దేశంలోనే తొలి మహిళ పార్లమెంటు సభ్యురాలు పార్లమెంట్ లో ప్రస్తావించడం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ , ఎల్.ఐ.సి. చైర్మన్ ను కలిసి దేశంలో ఉన్న సుమారు 30 కోట్లమంది పాలసీదారుల జిఎస్టి వల్ల ఏ విధంగా ఇబ్బంది పడుతున్నారో వివరించడం వలన చేసిన కృషి ఫలించి నేడు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయడం జరిగిందని జీవిత బీమా ఏజెంట్లు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఐ.సి రాజమండ్రి, కాకినాడ, పెద్దా పురం, పిఠాపురం డివిజినల్ అధ్యక్షులు , అధ్యక్ష, ఉపాధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురంలో ఓ. జి సినిమా టికెట్ 60 వేలు

**కోనసీమ బ్యూరో, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )** అమలాపురం లలితా థియేటర్ వద్ద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించినఓ. జి సినిమా 'తొలి టికెట్ వేలం పాట' లో పాల్గొని ఆ టికెట్ ను బెండమూర్లంక గ్రామానికి చెందిన గుర్రం కృష్ణ ఫ్రెండ్స్ 60వేల రూపాయలకు గెలుచుకున్నారు. ఆయనకు పోటీగా బిజిపి నాయకులు




మోకా వెంకట సుబ్బారావు 59వేల వరకు వెళ్లారు. అయితే టైం లిమిట్ పెట్టడం వల్ల 60వేల రూపాయల వద్ద వేలం పాట ముగిసింది.

## ఎక్సైజ్ కార్యాలయంలో ప్రారంభమైన శరన్నవరాత్రులు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నాంపల్లి హెడ్ ఆఫీస్ ఆవరణలో శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. సోమవారం శ్రీబాలత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారిని అలంకరణ చేశారు. అమ్మవారి ముందు నవధాన్యాలతోను, తొమ్మిది కలశాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలా ఆక్టోబరు 2 వరకు ప్రతిరోజు వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి పూజిస్తారు. ఇదే ఆవరణలో 27న బతుకమ్మను, 30న చండీహోమం, అక్టోబరు 1న హోమ పూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించబడుతాయని నిర్వాహకులు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా హిమబిందు ఎన్నిక

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ హిమబిందు, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సోమవారం నాంపల్లిలో జరిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. ప్రిన్సిపల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా రంగసాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వడ్లూరి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నికత్ అంజు, జోనల్ సెక్రెటరీలుగా లక్ష్మయ్య, సునీత పద్మావతి ఎన్నికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచడానికి ప్రయత్నం చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.

## పాల ధరలు తగ్గించిన రాష్ట్ర డెయిరీ ఫెడరేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పాలు, వెన్న, నెయ్యి ధరలు తగ్గాయి. సోమవారం నుండి ఈ తగ్గించిన ధరలు అమల్లోకి వచ్చాయి. జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం సిఫారసుల మేరకు తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ (టీజీడీడీసీఎఫ్) పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపును అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో నెయ్యి, వెన్న, పనీర్, యూ హెచ్‌టీ పాల ధరలు గణనీయంగా తగ్గాయి. నెయ్యి, వెన్న, చీజ్, నమకిన్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించనున్నట్లు తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ ప్రకటించింది. అలాగే ఇన్‌స్టంట్ మిక్స్‌లు, చాక్లెట్లు, కుకీలపై జీఎస్టీ 18 నుంచి 5కి తగ్గించనున్నట్లు టీజీడీడీసీఎఫ్ వెల్లడించింది. ఇక పనీర్, యూ హెచ్‌టీ పాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లు కొత్త ధరలతో ఉత్పత్తులు విక్రయించాలని ఫెడరేషన్ ఆదేశాలు జారీ చేసింది.

## జిల్లా వ్యవసాయాధికారి సస్పెన్షన్

### యూరియా కొరత పట్ల నిరక్ష్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** యూరియా పంపిణీలో నిర్లక్ష్యం వహించినందుకు రాష్ట్రంలోని ఆసిఫాబాద్ ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి (డిఎఒ) ఆర్.శ్రీనివాస్ రావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. డిఎఒ ప్రైవేట్ వ్యాపారులకు 400 టన్నులు కేటాయించారని, దీనివల్ల ఎరువుల కొరత మరింత తీవ్రమైందనే ఆరోపణలు చోటు చేసుకున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించి ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం జిల్లా వ్యవసాయ అధికారి యూరియా పంపిణీని పర్యవేక్షించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. అలాగే ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చట్టబద్ధమైన విధులను నిర్వర్తించడంలో తీవ్ర నిరక్ష్యం చూపించారని వెల్లడించారు. అంతేకాకుండా, యూరియా రసీదు, పంపిణీ గురించి ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగానికి తెలియజేయడంలో ఆయన విఫలమయ్యారు. డైరెక్టర్ నుండి అనుమతి పొందకుండా జిల్లా ప్రధాన కార్యాలయం నుండి ఆయనను బయటకు వెళ్లవద్దని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. శ్రీనివాసరావు స్థానంలో కాగజ్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బోర్కుట్ వెంకటేష్‌ను జిల్లా ఇన్‌ఛార్జ్ జిల్లా వ్యవసాయ అధికారిగా నియమించారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, డైట్ నిర్వహణలో మార్పులు

### నూతన విధానం రూపకల్పనపై అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ హాస్పిటళ్ల నిర్వాహణలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకమైనదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ మూడు వ్యవస్థలతో పాటు, పేషెంట్లకు అందించే డైట్ విధానంలో తీసుకురావాల్సిన మార్పులు, ఆయా వ్యవస్థలను బలోపేతం చేయడానికి కొత్త పాలసీల రూపకల్పనపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, డైట్ పాలసీల్లో ఉన్న లోపాలను, ఆ లోపాల వల్ల ఎదురవుతున్న సమస్యలను డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మంత్రికి వివరించారు. సెక్యూరిటీ టెండర్ నిబంధనల్లో సరియైన నియమాలు లేకపోవడంతో సెక్యూరిటీ గార్డులుగా వృద్ధులను, ఫిజికల్ ఫిట్‌నెస్ లేని వారిని కాంట్రాక్టర్లు నియమిస్తున్నారని.. ఈ అంశంలో మార్పు తీసుకురావాలని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సెక్యూరిటీ సిబ్బందిలో కొంత శాతం మేర ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారిని నియమించాలని, ఇందుకు అనుగుణంగా నిబంధనలు మార్చాలని అధికారులకు మంత్రి సూచించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ ఉండి, 50 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నవారినే నియమించుకునేలా టెండర్ కండీషన్ ఉండాలన్నారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ పోస్ట్ ఉండాలని, ఈ పోస్టులో తప్పనిసరిగా రిటైర్డ్ ఆర్మీ పర్సన్ ఉండాలని మంత్రి ఆదేశించారు. అన్ని హాస్పిటల్స్‌లో సీసీ టీవీ మానిటరింగ్ రూమ్ ఉండాలని, మానిటర్ చేసే పని కూడా సెక్యూరిటీ కాంట్రాక్ట్‌లో ఉండాలన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, పేషెంట్ల రక్షణ, నియంత్రణ, హాస్పిటళ్ల నిర్వాహణపై సెక్యూరిటీ గార్డులకు ట్రైనింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్లు పరిశుభ్రంగా ఉంచడంలో సానిటేషన్ సిబ్బందితో పాటు, సెక్యూరిటీ సిబ్బంది పాత్ర కూడా ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం హాస్పిటల్‌ను పరిశుభ్రంగా ఉంచకపోతే కాంట్రాక్ట్ రద్దు చేసే విధంగా నూతన పాలసీ ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. పేషెంట్లకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించే విధంగా నూతన పాలసీ ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. పేషెంట్ కేర్ వర్కర్లుగా క్వాలిఫైడ్ పర్సన్స్ మాత్రమే ఉండాలని మంత్రి సూచించారు. ఏఎన్‌ఎం, తదితర సూటబుల్ క్వాలిఫికేషన్లు ఉన్న వారికి అవకాశం ఇవ్వాలన్నారు. వారిలో కనీసం 60శాతానికి తగ్గకుండా మహిళలు ఉండాలని మంత్రి సూచించారు. వర్కర్ల వేతనాల చెల్లింపులో కాంట్రాక్టర్ల అక్రమాలకు అవకాశం ఉండొద్దని, క్యాష్‌పేమెంట్ సిస్టమ్ పూర్తిగా ఎత్తివేయాలని మంత్రి ఆదేశించారు. వర్కర్ల ఈపీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, ఐపీఎం (ఫుడ్ సేఫ్టీ) డైరెక్టర్ డాక్టర్ శివలీల పాల్గొన్నారు.

## ఎస్సీ అభివృద్ధి శాఖలో 1,392 పోస్టుల కొనసాగింపునకు ఆమోదం

### హాస్టళ్లలో తీరనున్న సిబ్బంది లోటు

### ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా ఎస్సీ అభివృద్ధి శాఖలో 1,392 పోస్టుల కొనసాగింపుకు ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని వివిధ కేటగిరీలలో పని చేస్తున్న 1,392 పోస్టులను మరో యేడాదిపాటు కొనసాగిస్తూ జి.ఓ.ఆర్.టి నెం.1450 ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 వరకు ఈ పోస్టులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. పోస్టుల్లో 11 కాంట్రాక్టు, 197 పార్ట్‌టైమ్, 1,184 అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో మూలంగా హాస్టళ్లు, ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు, జిల్లా కార్యాలయాలు, ప్రత్యేక న్యాయస్థానాల్లో సిబ్బంది కొరత భర్తీ కానుందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతి, పౌష్టికాహారం, ఆరోగ్యం, భద్రతతో పాటు మంచి విద్యా వాతావరణం ఏర్పడనుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ దృక్పథానికి ఇది నిదర్శనమన్నారు. హాస్టళ్లలో సిబ్బంది లోటు తీర్చడం ద్వారా విద్యార్థుల సంరక్షణ, భోజనం, భద్రత అన్ని రంగాల్లో నాణ్యత పెరుగుతుందని.. నిరుద్యోగ యువతకు ఉపాధి, వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. ప్రతి ఎస్సి విద్యార్థి మంచి వాతావరణంలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని.. ఈ పోస్టుల కొనసాగింపు ఆ దిశగా మరో ముందడగన్నారు. జీవో ఆధారంగా జిల్లా కార్యాలయాల్లో సిబ్బంది కొరత కూడా భర్తీ కానుంది. హాస్టళ్ల నిర్వహణలో సమర్థత పెరుగుతుంది. పారదర్శక నియామకాలతో ఉద్యోగుల నమ్మకం పెరిగి, క్రమబద్ధమైన వేతన చెల్లింపులు సులభతరం అవుతాయనీ అధికారులు తెలిపారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు బలోపేతం కావడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. అణగారిన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం చూపుతున్న అంకితభావానికి ఇది మరో నిదర్శనం అని మంత్రి పేర్కొన్నారు. ఈ జీ.ఓ. ద్వారా విద్యార్థుల సంక్షేమం కోసం కొత్త మైలు రాయిని ప్రభుత్వం నిర్మించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ దృష్టిలో ఇది ఒక ప్రతిష్టాత్మక ముందడుగని మంత్రి అడ్లూరి అభిప్రాయపడ్డారు.

## ఆర్‌టిసి ఉద్యోగులకు దసరా అడ్వాన్స్ విడుదల

### నవంబరు నుంచి 10 నెలల్లో ఉద్యోగుల నుంచి కటింగ్

### ఉత్తర్వులిచ్చిన ఆర్‌టిసి యాజమాన్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి)లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి దసరా పండుగ నేపథ్యంలో అడ్వాన్స్ ఇవ్వడానికి యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను చీఫ్ పర్సనల్ మ్యాన్ (సిపిఎం) సోమవారం జారీ చేశారు. ఆర్‌టిసిలో పనిచేస్తున్న అర్హత కలిగిన క్లాస్-3, క్లాస్-4 ముస్లిం, క్రిస్టియన్ ఉద్యోగులందరికీ 2025 సంవత్సరానికి దసరా అడ్వాన్స్‌ను ఇవ్వాలని నిర్ణయించారు. అనుబంధ జీత బిల్లుకు ముందస్తు ఆడిట్ తర్వాత అనుమతి ఉన్న రేట్ల ప్రకారం వెంటనే పండుగ అడ్వాన్స్ చెల్లించాలని ఉత్తర్వులో ఆదేశించారు. 3 నవంబర్ జీతం బిల్లు నుండి 10 సమాన ఇన్‌స్టాల్‌మెంట్లలో ఫెస్టివల్ అడ్వాన్స్‌ను తిరిగి కటింగ్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు, సిబ్బందికి దసరా అడ్వాన్స్ ఇవ్వడంపై ఆర్‌టిసిలోని పలు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ.. ఆర్‌టిసి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

## అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలం

### బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ.. తెలంగాణకు సంబంధించి అనేక సందర్భాల్లో విదేశాల నుండి పెట్టుబడులకు ఆహ్వానిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాకి సంబంధించిన నియమ నిబంధనలు మనవాళ్లు చదువుకోవడానికి వెళ్లే వారికి ఆటంకం కలుగుతుందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దౌత్య సంబంధాల్లో అమెరికా ఇలాంటి నియంత్రణలు పెడుతున్నప్పుడు వాటిని నియంత్రించడంలో భారత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని.. ఇక్కడి నుండి చదువుకోడానికి వెళ్లే విద్యార్థులు ఉపాధి కొరకు వెళ్లేవారికి ఇది పెద్ద ఆటంకంగా మారుతుందన్నారు. అమెరికాతోపాటు ఇతర దేశాల్లో ఉన్నటువంటి మన మేధావులు, విద్యార్థులు మన దేశానికి సంబంధించిన 100 మంది సీఈవోలు వివిధ దేశాల్లో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వారు తమ తెలివి తేటలను దేశంలో పెట్టాలని..... అందుకోసం ఇక్కడి ప్రభుత్వాలు రెడ్‌కార్పెట్‌వేసి మీకు స్వాగతం పలుకుతున్నాయన్నారు. మీకు అనుకూల పాలసీలు తీసుకురావడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి పొన్నం తెలిపారు. విదేశాల్లో ఉన్న వారంతా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని.. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పు.. రివ్యూ పిటిషన్ వేయాలి

### ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తపస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసేలా చూడాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. టెట్‌పై కేంద్ర విద్యా శాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేసిన విషయం అత్యంత ఆందోళన కలిగిస్తోందని.. 2009 ఆర్‌టిఈ చట్టం, 2010 ఎన్‌సిటిఈ నోటిఫికేషన్ ప్రకారం 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులు టెట్ నుండి మినహాయింపు పొందాలి. ఈ హక్కును విస్మరించడం వలన రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు ప్రమాదంలో పడుతున్నాయని వారు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరంగా రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, లేనిచో అమైన్‌మెంట్ చెయ్యాలని, సమస్యను తొందరగా పరిష్కరించాలని కేంద్ర మంత్రిని కోరినట్టు తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్టు తపస్ నేతలు తెలిపారు.

## హైడ్రాకు దమ్ముంటే నేతలు, బిల్డర్ల ఆక్రమణలు తొలగించాలి

### కబ్జాదారులను అరెస్టు చేసి, ఉరి తీయండి

### పేదల కన్నీళ్లు సర్కారుకు పట్టదా?: ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (జీడిమెట్ల), సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నిరుపేదల ఇళ్లు కూల్చి గొప్పలు చెప్పడంకాదు.. హైడ్రాకు దమ్ముంటే నాయకుల, బిల్డర్స్ ఆక్రమణలు తొలగించాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమ వారం గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని హైడ్రా నిరుపేదల ఇళ్ల కూల్చివేతలను బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజుల రామారంలో తమ ఇళ్లు పోయి పేదలు కన్నీరు మున్నీరవుతున్నా కనికరించలేదు. కరెంటు స్తంభాలు కూలగొట్టి కరెంటు లేకుండా, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు. రంగనాథ్.. నోరు లేని వారికి, దిక్కులేని వారికి, పేదరికంలో మగ్గుతున్న వారికి కన్నీళ్లు పెట్టిస్తే నీకు మంచి జరుగుతుందా? మూడు వందల గుడిసెలు కూలగొట్టి 15 వేల కోట్ల రూపాయలు కాపాడానంటూ ట్విట్టర్లో పెట్టుకోవడానికి సిగ్గు ఉందా? అన్నారు. ఈ విషయంలో బ్రోకర్లు ఉంటే అరెస్ట్ చేయండి, ఉరితీయండి. వారి దగ్గర నుండి డబ్బులు రికవరీ చేయండి. కానీ పేదల జీవితాలతో ఆడుకోవద్దన్నారు.



**ఇళ్లు కోల్పోయినవారికి డబుల్‌బెడ్ ఇళ్లు కేటాయించాలి: జాగృతి అధ్యక్షురాలు కవిత**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామరం, బాలయ్యబస్తీ, గాలీపోచమ్మ బస్తీలో గల సర్వే నెంబర్ 307,329/1,342 సర్వేనంబర్లలో ఇప్పటికే హైడ్రా ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేసిన నిర్వాసితులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. శనివారం, ఆదివారం ఎవరి జోలికి వెళ్లవద్దని కోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. 200 మందికి మీరు డబుల్‌బెడ్ ఇళ్లతోపాటు ప్రతి కుటుంబానికి రూ. 50,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బతుకమ్మ పండుగ వేళ..

### భారీగా తగ్గిన పూల ధరలు

### వినాయకచవితో పోలిస్తే రూ.300 తగ్గిన రేటు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** తెలంగాణలో అతి పెద్ద పండుగలలో ఒకటైన దసరాతో పాటు బతుకమ్మ పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ పండుగల సందర్భంగా హైదరాబాద్ నగరంలో పూల డిమాండ్‌లో భారీ పెరుగుదల కనిపిస్తోంది. నవరాత్రి వేడుకలతో కూడిన ఈ పండుగల సమయంలో పూలకు గిరాకి పెరగడం సహజమే. హైదరాబాద్‌లోని పూల మార్కెట్‌లో ప్రస్తుతం తీవ్రమైన రద్దీ నెలకొని ఉంది. వ్యాపారుల చెబుతున్న వివరాల ప్రకారం, బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజుల పాటు పూలతో అలంకరించే ఆచారం ఉండటం వలన పూల డిమాండ్‌లో భారీ పెరుగుదల కనిపిస్తోంది. బెంగళూరుతో సహా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పూలు దిగుమతి అవుతున్నాయి. అయితే వినాయక చవితితో పోలిస్తే ఈసారి పూల ధరలు కొంత తగ్గినట్లు వినియోగదారులు తెలియజేస్తున్నారు. వినాయక చవితి సమయంలో కిలో చామంతి పూల ధర 500 రూపాయలు ఉండగా, ప్రస్తుతం 150 రూపాయలకు దొరుకుతున్నాయి. ఇతర రకాల పూల ధరలు కూడా 200 రూపాయల లోపే ఉన్నాయి. గులాబీ పూలు 160 నుంచి 180 రూపాయల వరకు లభిస్తున్నాయి. పూల మార్కెట్‌లో తాజా పూల లభ్యత బాగుందని, వినియోగదారులు తమ బతుకమ్మలను అందంగా అలంకరించుకోవడానికి అవసరమైనన్ని పూలను కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరుగుతున్న బతుకమ్మ వేడుకలు, నవరాత్రి వేడుకలు హైదరాబాద్‌లోని పూల మార్కెట్‌ను కిటకిటలాడేలా చేస్తున్నాయి.

## అక్రమ మద్యం బాటిళ్లపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక దృష్టి

### వారం రోజుల్లో 1,704 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రానికి అక్రమంగా రవాణ అవుతున్న మద్యం బాటిళ్లపై ఎక్సైజ్ శాఖ కన్నెర్ర చేసింది. దసరా పండుగ సందర్భంగా కొందరు అక్రమార్కులు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకు మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఎయిర్ లైన్స్ లోను, రైళ్లలోను, బస్సుల వాహనాల్లో దిగుమతి చేసి తెలంగాణ అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అక్రమం గా రవాణ అవుతున్న నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ వల్ల తెలంగాణ ఎక్సైజ్ శాఖకు భారీగా నష్టాలు వస్తున్నాయి. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్ వాజ్ ఖాసీం ఈ నెల 15 నుంచి 30 వరకు ఎన్‌డీపీఎల్, అండ్ నాటుసారా తయారీ, అమ్మకాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ ఎన్‌డీపీఎల్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎస్టీఎఫ్ (స్టేట్ టాస్క్ ఫోర్స్), డీటీఎఫ్ (డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్), ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, ఎక్సైజ్ టీమ్‌లు గత వారం రోజులుగా ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారు. వారం రోజులు జరిపిన దాడుల్లో కన్నులు మిరుమిటుల గొలిపేలామద్యం బాటిళ్లను ఎక్సైజ్ టీమ్‌లు స్వాధీనం చేసు కుంటున్నాయి. గతవారం రోజుల్లో 1704 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువలవిలువ రూ 68.16 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. మరో వారం రోజుల పాటు జరిగే దాడుల్లో ఏ మేరకు మద్యాన్ని ఎక్సైజ్ టీమ్‌లు పట్టుకుంటాయోనని అధికారులు ఎదురు చూస్తున్నారు. వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, భూపాల్‌పల్లి, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ సూర్యా పేట, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో నిత్యం ఎక్సైజ్ సిబ్బందితోపాటు ప్రత్యేక ఎక్సైజ్ టీమ్‌లు దాడులు నిర్వహించి నాటుసారాను అరికడుతున్నారు. ఇదే తీరులో మరో వారం రోజుల పాటు నాటుసారాపై తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపనున్నాయి.

**రికార్డు స్థాయిలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత..**

పదేళ్లలోను, గత మూడు సంవత్సరాల్లో ఎన్‌డీపీఎల్ పట్టుకున్న నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌తో పోలిస్తే ఈ వారం రోజులు పట్టుకున్న మద్యం ఎక్కువగా ఉంది. గత పదేళ్లలో తెలంగాణలో 4516 కేసులు నమోదు చేసి 3238 మందిని అరెస్టు చేసి 1,22,222 లీటర్ల (16,300)మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. 2024లో 955 కేసుల్లో 513 మందిని అరెస్టు చేసి 12,807 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సంవత్సరం ఆగస్టు నాటికి 644 కేసుల్లో 381 మందిపై కేసు నమోదు చేసి, 8201 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. కాని వారం రోజుల్లోనే 1704 మద్యం బాటిళ్లను సీజ్ చేయడం కొస మెరుపుగా మారింది.

## ఖరీఫ్ వరి కొనుగోలుకు సిద్ధం

### అక్టోబర్ తొలి వారంలో ప్రారంభం

### రాష్ట్రంలో 8,332 కేంద్రాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర సర్కార్ సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరు నుంచి వరి కోతలు మొదలు కానున్న నేపథ్యంలో అక్టోబర్ మొదటి వారం నుంచి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా సన్నధాన్యానికి బోనస్ ఇవ్వడం వల్ల సాగు విస్తీర్ణం 60.39 లక్షల ఎకరాల నుంచి 65.96 లక్షల ఎకరాలకు పెరిగింది. రైతుల సౌకర్యం కోసం ఈసారి కొనుగోలు కేంద్రాల సంఖ్యను గణనీయంగా పెంచనుంది. తెలంగాణ వ్యాప్తంగా గత ఖరీఫ్‌లో 7,139 కేంద్రాలు ఉండగా ఈసారి వాటి సంఖ్యను 8,332కి పెంచింది. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు ప్రక్రియ నాలుగు నెలల పాటు కొనసాగనుంది. ముఖ్యంగా సన్నధాన్యం పండించిన రైతులకు గతేడాది మాదిరిగానే ఈసారి కూడా క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వం వ్యవసాయం, రవాణా, పోలీసులతో సహా ఎనిమిది శాఖలతో సమీక్ష నిర్వహించి కొనుగోళ్ల కార్యాచరణను ఖరారు చేసింది. గతేడాది ధాన్యం ఉత్పత్తి 146.28 లక్షల టన్నులు కాగా ప్రభుత్వం 91.28 లక్షల టన్నులు కొనుగోలు చేసింది. అయితే ఈ ఏడాది ఉత్పత్తి అంచనా 159.14 లక్షల టన్నులు ఉన్నప్పటికీ, కొనుగోలు లక్ష్యాన్ని 74.99 లక్షల టన్నులకు పరిమితం చేసింది. రైతుల నుంచి వచ్చే ధాన్యాన్ని సజావుగా కొనుగోలు చేసేందుకు సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. కాగా రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం నిల్వ, రవాణా విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కేంద్రాల వద్ద ధాన్యం రాశులను తడిచిపోకుండా టార్పాలిన్ కవర్లతో కప్పాలని, తూకం వేసిన సంచులను సైతం కంటైనర్ల వంటి వాటిలో నిల్వచేసి సురక్షితంగా ఉంచాలని అధికారులను ఆదేశించింది.

# జాతీయ రహదారుల అభివృద్ధికి తక్షణ చర్యలు అవసరం

### హైవేకు అనుసంధానంగా సర్వీస్ రోడ్లు నిర్మించాలి

### సిఎం రేవంత్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

### ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్డు అవసరం

### రహదారి అభివృద్ధితో పరిశ్రమలు, పర్యాటక రంగాలకు ఊతం

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రతినిధి ప్రభాతవార్త :** జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, అనుసంధాన రహదారుల నిర్మాణం అత్యవసరమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సోమవారం సచివాలయంలో కలెక్టర్లు, నేషనల్ హైవే అధికారులతో సీఎం నిర్వహించిన సమీక్ష సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమైన ప్రతిపాదనలతో లేఖను సీఎం రేవంత్ కు, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు.

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు రెండు వైపులా సర్వీస్ రోడ్లు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నగరానికి రింగ్ రోడ్ పూర్తి కావడానికి ఖమ్మం-కొరివి రోడ్ నుండి నూతన కలెక్టరేట్ వరకు 7 కిలోమీటర్ల అనుసంధాన రహదారి మంజూరు అవసరమని సూచించారు.

జగ్గయ్యపేట- కొత్తగూడెం వయా బోనకల్, వైరా, తల్లాడ నేషనల్ హైవే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. ఇదే సమయంలో సారపాక- కాళేశ్వరం వయా అశ్వాపురం, ఎటూరునాగారం జాతీయ రహదారి, బూర్గంపాడు-జంగారెడ్డిగూడెం వయా ములకలపల్లి, దమ్మపేట కొత్త నేషనల్ హైవే మంజూరుకు చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

ఈ రహదారులు అభివృద్ధి చెందితే భద్రాచలం, పాల్వంచ, మణుగూరు వంటి పారిశ్రామిక పట్టణాలు వేగంగా పురోగమిస్తాయని, భద్రాద్రి రామాలయం సహా అనేక పుణ్యక్షేత్రాలు సులభంగా అనుసంధానమవుతాయని తుమ్మల పేర్కొన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక రంగాల అభివృద్ధికి రహదారుల విస్తరణ కీలకమని, ప్రాంతీయ ప్రజలు నిజమైన లాభం పొందాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ప్రాధాన్యతనిస్తూ కేంద్రానికి పంపాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# కోకో పంటను ప్రోత్సహించాలి : ఉపాధి హామీ పథకం పీడీ రాంబాబు



**అంబాజీపేట, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
రైతులు ఆర్థికంగా బలపడేందుకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా కోకో పంటను ప్రోత్సహించాలని ఉపాధి హామీ పథకం పీడీ డి.రాంబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఏపీఓ అడపా శ్రీ వెంకటకృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రాంబాబు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కొబ్బరి తోటలో అంతర పంటగా కోకో పంటను పెంచేలా కృషి చేయాలన్నారు. మినీ గోకులం షెడ్డు నిర్మించుకునే అర్హులైన లబ్దిదారులచే త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. శానిటేషన్లో బాగంగా ప్రతీ గ్రామ పంచాయితీ పరిధిలో ఇంటికో కంపోస్టు పిట్ తవ్వడానికి ప్రచారం చేయించాలన్నారు. ఇంటి ఆవరణలో చెత్తను కంపోస్టు పిట్కు తయారు చేసే విధానాన్ని వివరించాలన్నారు. సేంద్రీయ ఎరువు తయారై రైతులకు ఉపయోగపడుతుందనే విషయాన్ని వివరించాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సమావేశంలో ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, జూనియర్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంటులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 15 లోపు ఆక్వా రైతులందరూ లైసెన్సులు పొందాలి : కలెక్టర్ కీర్తి చేకూరి



**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
జిల్లాలోని అన్ని ఆక్వా రైతులు ఏపీ ఎస్ సి డి ఎ యాక్ట్ - 2020 ప్రకారం చేపల చెరువులను తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని వచ్చే నెల 15లోపు లైసెన్సులు పొందాలని, ఆ మేరకు గడువు నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కీర్తి చేకూరి సోమవారం కలెక్టరేట్ లో జరిగిన సమీక్షా సమావేశంలో స్పష్టం చేశారు. అదే సమయంలో గడువులోపు లైసెన్సులు పొందని చెరువులకు విద్యుత్ రాయితీ వర్తించదని ఆమె తెలియ చేశారు. జిల్లాలో మొత్తం 3163 ఎకరాలు ఆక్వా సాగు జరుగుతున్నదని, వీటిలో 2178 ఎకరాలకు 523 మంది రైతులు ఇప్పటికే లైసెన్సులు పొందినప్పటికీ, ఇంకా 984 ఎకరాలకు 314 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయవలసి ఉందని కలెక్టర్ వివరించారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు మత్స్యశాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టి, రోజు వారీ నివేదికను సమర్పిస్తూ 30 రోజుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి, , జిల్లా మత్స్యశాఖ అధికారి టి నిర్మల కుమారి, జిల్లా స్థాయి మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ విజయ బేతాళ స్వామి వారి కలశస్థాపన




**అంబాజీపేట, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
శ్రీ విజయ బేతాళ స్వామి వారి 59వ వాహన,తీర్థ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవీశరన్నవరాత్రును పురస్కరించుకుని అంబాజీపేట,మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విజయ బేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా అత్యంత వైభవంగా స్వామీ వారి కలశస్థాపన నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు,మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున మోహనరావు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మాచవరం దుర్గా క్షేత్రం రామ్ ఘాట్ వద్ద నుండి అఖండ దీపాన్ని ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ప్రదర్శనలో చేడీ తాళింఖానా, ఒళ్ళు గగుర్పాటు గొలిపే కత్తి యుద్ద విన్యాసాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలతో భేతాళస్వామిని ఊరేగించి పెద్ద వీధిలోగల ఆలయంలో ప్రతిష్టించారు. శ్రీ విజయ బేతాళ స్వామి వారి వాహన తీర్థ మహోత్సవాన్ని అక్టోబర్ 8న నిర్ణయించామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.ల

అంబాజీపేట పశువుల మార్కెట్లో శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద దేవి శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

# దేవి శరన్నవరాత్రులతో ఆధ్యాత్మికంగా మారిన గ్రామాలు

**బాల త్రిపుర సుందరి దేవిగాభక్తులకు దర్శనం**



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )**
ఆత్రేయపురం మండల పరిధిలో ఆలయాల్లో దేవి శరన్నవరాత్రులు ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాలు సెప్టెంబర్ 22 సోమవారం నుండి అక్టోబర్ 2 గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ప్రతి గ్రామంలో భవాని మాలలు వేసి అమ్మవారికి పంచామృత అభిషేకాలు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, కుంకుమర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక కుంకుమార్చన లో పాల్గొన్నారు. ఉచ్చిలి కాలువ రేవులో వెంచేయున్న శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయం లో ప్రతి రోజు ఉదయం సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు కొత్తలంక రాంబాబు శర్మ తెలిపారు.

# అంగీకార గోడ పత్రికను ఆవిష్కరించిన జేసి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్(పీఎంఏవై) లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే నిమిత్తం అంగికార-2025 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా జేసీ రాహుల్ మీనా, హౌసింగ్ అధికారులతో కలిసి అంగీకార-2025 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగికార -2025 కార్యక్రమం జిల్లాలో ఈ నెల 04 నుంచి అక్టోబర్ 31 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పీఎంఏవై-అర్బన్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రయోజనాలు, పీఎం సూర్య ఘర్, నిర్మణ పనులు పూర్తైన ఇండ్లకు గృహ ప్రవేశాలు చేసి ప్రారంభించడం వంటి ఇతర సదుపాయాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరుగుతుందని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటరావు వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎస్వీవీ.సత్యనారాయణ ఇతర హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్పీ ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణాన్ని ఎస్పీ రాహుల్ మీనా పరిశీలన



**కోనసీమ బ్యూరో, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )**
ఆర్ డి ఒ ఆఫీస్ వెనుక పోలీస్ డిపార్ట్మెంట్ సైట్ లో నూతనం గా సి ఎస్ ఆర్ ఫండ్స్ నుండి నిర్మిస్తున్న డిఎస్పీ ఆఫీస్ బిల్డింగ్ ను నూతన ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. బిల్డింగ్ నాణ్యత తో విశాలం గా నిర్మిస్తున్నామని పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు వివరించారు. రెండు మాసాల్లో పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి అవుతుందని వివరించారు.ఏస్పీ తో డిఎస్పీ ప్రసాద్ ఇప్పటి వరకూ 30 లక్షలు ఖర్చు చేశామని వివరించారు. సీఐ వీరబాబు,ఏ ఈ సంపన్న పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నెహ్రూ ను కలిసిన ఏవో లక్ష్మి




**గండేపల్లి ,సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )**
గండేపల్లి మండలం వ్యవసాయ అధికారిణి గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జె. లక్ష్మి స్థానిక టిడిపి కార్యాలయంలోఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ ఏడి ఆఫీసులో టెక్నికల్ ఏవో గా విధులు నిర్వహిస్తూ మండల వ్యవసాయ అధికారిణిగా బదిలీ పై వచ్చానని ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక యంత్రాలు, పురుగు మందులు, ఎరువులు, సకాలంలో అందిస్తూ వ్యవసాయ పద్ధతుల్లో మెలకువలు రైతులకు తెలియజేస్తూ రైతులకు వ్యవసాయ సలహాలు సూచనలు అందిస్తూ పనిచేస్తానని ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటానన్నారు.

# ఘనంగా ప్రారంభమైన దేవీ నవరాత్రులు



**రౌతులపూడి, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
రౌతులపూడి మండలం లో దేవి నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ గ్రామాన అమ్మవారు కొలువు దీరారు. రౌతులపూడిలో బాలత్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. మహిళలు బోనాలు, మంగళ వాయిద్యాలు, బాణ సంచాలతో, గరగనృత్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువు తీర్చారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. గణపతి పూజ, పుణ్యాహనం, మండపారాధన పూజలతో పాటు అమ్మవారికి అష్టోత్రం కుంకుమ పూజలు వేద పండితులు నిర్వహించారు.

# ఏపిజిఆర్ఎస్ కైనా ఆ ముగ్గురే హాజరు!



**రౌతులపూడి, సెప్టెంబర్ 22, ( ప్రభాతవార్త )**
మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కు కేవలం మూడు శాఖలకు చెందిన వారు మాత్రమే హాజరవు తున్నారు. మండల పరిషత్ నుండి సూపర్డెంట్ జగదీశ్వరరావు, విద్యుత్ శాఖ నుండి లైన్ ఇన్స్పెక్టర్, హౌసింగ్ శాఖ నుండి జె. ఇ, వీఆర్వోలు హాజర వుతున్నారు తప్ప మిగిలిన శాఖాధికారులు గాని, సిబ్బంది గానీ పిజిఆర్ఎస్ కు హాజరవుతున్న దాఖలు లేవు. ఆ ముగ్గురు సమయపాలన పాటించి హాజరవుతున్నారు. విద్య, వ్యవసాయ, పశు వైద్య, అంగన్ వాడి, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ తదితర శాఖ అధికారులెవరు హాజరు కాలేదు. మండల పిజిఆర్ఎస్ నిర్వహణ తూతూ మాత్ర మేనా అని పలువురు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ

- పలు అభివృద్ధి పనులు, సమస్యలపై వినతి
- సానుకూలంగా స్పందించిన డిసిఎం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
సీతానగరం మండలంలో రెండు హై లెవెల్ వంతెనల నిర్మాణాలకు 10.5 కోట్లు నిధులు మంజూరు చేయాలి. సమగ్ర గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అంతర్గత సిసి రోడ్లకు 148 కోట్లు, అంతర్గత డ్రైన్లకు 125 కోట్లు మంజూరు చేయాలనికోరారు. అంతర్గత గ్రావెల్ రోడ్లు, పుంత రోడ్లకు 95.5 కోట్లు మంజూరు చేయాలి,ప్రతి ఇంటికి మంచినీరు సరఫరాకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కోసం 682 కోట్లకై వినతి పత్రం ఇచ్చారు. ఇంకా స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహాయం అందించాలని,ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలి.హౌసింగ్ బోర్డ్, స్వరూప నగర్, రూపా నగర్ ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని కోరారు. రాజానగరం, సీతానగరం చిన్న కొండేపూడి ప్రాంతాల్లో వెటర్నరీ ఆసుపత్రుల నిర్మాణం, శ్రీరాంపురం, సూర్యారావు పేట, రామచంద్రపురం గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి.పుష్కర ప్లాన్ లో భాగంగా పంచాయతీరాజ్ రోడ్లకు 53.5 కోట్లు మంజూరు చేయాలని డీసీఎంను ఎమ్మెల్యే కోరారు.ఆయన వినతులకు సానుకూలంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. రాజానగరం సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# ఘనంగా ప్రారంభమైన శ్రీ పీఠం మహాశక్తి యాగం


- వంద కోట్ల కుంకుమార్చన మొదటి రోజు కార్యక్రమానికి భారీ గా తరలివచ్చిన మాతృమూర్తులు



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
రూరల్ మండలం రమణయ్యపేట శ్రీపీఠంలో శ్రీ ఐశ్వర్యాంబిక దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం వెనకాల శ్రీ పీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడవ"మహాశక్తి యాగం" సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. సోమవారం 100 కోట్ల కుంకుమార్చనకు సుమారు 15 వేల మంది మహిళామూర్తులు వివిధ ప్రాంతాల నుండి హాజరై క్రతువు లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రతీ రోజూ అమ్మవారి ధ్యానంతో భక్తులు పూజలు చేయాలని శ్రీ పరిపూర్ణానంద స్వామి అన్నారు. మొదటి రోజు శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారినిశ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అన్న సూక్త, హెూమంలను వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ 11 రోజుల పాటు జరగనున్న మహాశక్తి యాగంలో భాగంగా ఏడు రోజుల్లోనే 100 కోట్ల కుంకుమార్చన పూర్తికానుందని తెలిపారు. 1000 కోట్ల కుంకుమార్చన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. 11 రోజులు అంకుటిత దీక్షతో అమ్మవారిని పూజించడానికి మంచి అవకాశం వచ్చింది అన్నారు. 3,200 మంది సేవకులు ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తున్నారన్నారు. మంచి సంకల్పంతో కృషి చేస్తే మీరు కోరుకున్నది జరుగుతుందని అన్నారు. కుంకుమార్చన ఒక తపస్సులో చేయాలని, ఎన్ని కష్టాలు పడినా జీవితంలో సంకల్పానికి మించిన బలం లేదన్నారు. ఈనెల 29వ తేదీన జరిగే "త్రికోటి మహా సరస్వతీ పూజ" వేల మంది విద్యార్థులతో ఉచితంగా చేయించేందుకు విస్తృత ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షణలో ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# రాజోలు టిడిపి ఇంచార్జ్ గా అమూల్య



**కోనసీమ బ్యూరో, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త ) :**
రాజోలు టీడీపీ ఇంఛార్జ్ విషయంలో కొనసాగుతున్న సస్పెన్స్ కు తెర పడింది. తెలుగుదేశం పార్టీ అధినాయుకుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మెరకు రాజోలు నియోజకవర్గ టిటిపి ఇన్ చార్జ్ గా గొల్లపల్లి అమూల్యను సోమవారం నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు తెలుగుదేశం పార్టీ నుండి వైసిపికి మారిన తర్వాత నియోజకవర్గ బాధ్యతల్ని ఎవరికి అప్పగించలేదు. దింతో అందరూ ఇన్ చార్జ్ పదవీ కోసం పోటి పడ్డారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవిఆర్ఎస్) ద్వారా రాజోలు టిడిపిఇన్ చార్జ్ గొల్లపల్లి అమూల్య కు ఇవ్వడం పై అభిప్రాయ సేకరణ జరిగింది. ఇందులో 70% అంగీకరించినట్లు రిపోర్ట్ లో తెలింది. దీంతో అమెకే ఎక్కువ ప్రాదాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన ఇనన చార్జ్ అమూల్య మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో స్థానిక ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ తో కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి తెలుగుదేశం పార్టీ బలోపేతంకు కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన తెలుగుదేశం జాతీయ అద్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ కు,రాష్ట్ర అద్యక్షుడు పల్లా శ్రీనివాస్,జిల్లా ఇన్ చార్జ్ మంత్రి అచ్చం నాయుడు,మంత్రి సుభాష్,ఎంపి హరీష్ బాలయోగి కి కృతజ్ఞాతలు తెలిపారు.

# కాలువలపై ఏర్పాటు చేసిన అక్రమ మద్యం షాపులను వెంటనే తొలగించాలి : ఎంపీడీఓ కి వినతి పత్రం అందజేసిన కరుటూరి



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 22 , ( ప్రభాతవార్త )**
అక్రమ మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు విజ్ఞప్తి చేశారు. ఆత్రేయపురం మండలంలోని కాలువలపై ఏర్పాటు చేసిన అక్రమ మద్యం షాపులను తొలగించాలని, అలాగే అక్రమంగా జారీ చేసిన డోర్ నంబర్లు, లైసెన్స్లను రద్దు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు పబ్లిక్ ల్యాండ్స్పై ఉన్న మద్యం షాపులను వెంటనే గుర్తించి తొలగించాలని ఇప్పటికే అక్రమంగా ఇచ్చిన డోర్ నంబర్లు, లైసెన్స్లను రద్దు చేయాలి. భవిష్యత్తు లో ఇలాంటి అక్రమాలు జరగకుండా ఎక్సైజ్, భూవి నియోగచట్టాలను కఠినంగా అమలు చేయాలని ప్రజల ఆరోగ్యం, సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్చట్టం, మున్సిపల్ నిబంధనలు, భూవినియోగ చట్టాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. కాలువలు, నీటి వనరులు, పబ్లిక్ యుటి లిటీ ల్యాండ్స్ వంటి ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేయడం పూర్తిగా చట్ట విరుద్ధమని అధికారు లు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

ఆట

శాఫ్ అండర్ 17 ఛాంపియన్‌షిప్‌లో

# భారత్ చేతిలో పాక్ చావు దెబ్బ

## 3-2 తేడాతో మరోసారి ఓటమి



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 గ్రూప్ దశలోను, సూపర్ 4లోనూ రెండు సార్లు భారత్ చేతిలో మట్టి కరచిన పాకిస్తాన్ మరోసారి పరాభవం చెందింది. ఇప్పుడు పాక్‌ను భారత్ ఫుట్‌బాల్ జట్టు కోలుకోలేని దెబ్బ కొట్టింది. శాఫ్ అండర్17 ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025లో పాకిస్తాన్‌పై భారత్ ఫుట్‌బాల్ జట్టు ఉత్కంఠభరితమైన పోరులో విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో 3-2 తేడాతో భారత్ చేతిలో పాక్ ఓటమిపాలైంది. కొలంబోలో సోమవారం జరిగిన హై ఆక్టేన్ మ్యాచ్‌లో యువ బ్లూ కోల్ట్స్ (భారత్ ప్లేయర్లు) తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టును ఓడించడానికి దృఢత్వం మరియు నైపుణ్యాన్ని ప్రదర్శించింది.

గ్రూప్ బి పోరులో వేగాన్ని నిర్దేశించడానికి ప్రయత్నిస్తూ, రెండు జట్లు మిడ్‌ఫీల్డ్‌లో నియంత్రణ కోసం పోటీ పడ్డాయి. తొలుత పాకిస్తాన్ ఒక కార్నర్ గెలిచినా భారత గోల్ కీపర్ దానిని క్లియర్ చేశాడు. డల్లాల్మున్ గాంగ్టే భారత్‌కు ఒక గోల్ చేశాడు. బ్లూ కోల్ట్స్ పతిష్టంభనను ఛేదించి, భారత్‌ను 1-0 పాకిస్తాన్‌తో ముగించింది. అయితే, పాకిస్తాన్ బలంగా పోరాడి, ముహమ్మద్ అబ్దుల్లా ద్వారా గోల్‌ను సమం చేసింది. అతను 43వ నిమిషంలో పెనాల్టీని మలిచి విరామానికి ముందు 1-1తో స్కోరును సమం చేశాడు. రెండవ అర్ధభాగంలో ఇరు జట్లు తీవ్రంగా ఒత్తిడి చేయడంతో ఎండ్‌టుఎండ్ ఫుట్‌బాల్ కనిపించింది. 63వ నిమిషంలో గున్లీబా వాంగ్కైరక్‌పామ్ కచ్చితమైన గోల్ చేయడంతో భారత్ తిరిగి ఆధిక్యాన్ని పొందింది.

కానీ కేవలం 7నిమిషాల తర్వాత, హంజాయాసిర్ 70వ నిమిషంలో పాకిస్థాన్‌ను మళ్లీ సమం చేశాడు. ఆట 2-2తో సమంగా ఉండగా, 73వ నిమిషంలో రహాన్‌అహ్మద్ నిర్ణయాత్మక దెబ్బ కొట్టి, ఆధి క్యాన్ని పునరుద్ధరించి, నాటకీయ రీతిలో భారత్‌కు విజయాన్ని నిర్ధారించాడు. ఈ విజయంతో, యువ కోల్ట్స్ ఇప్పుడు ఈ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా 3మ్యాచ్‌లను గెలిచి, తమఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు.



## ఆసియా మహిళల రగ్బీలో
# కజికిస్థాన్ చేతిలో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా మహిళల రగ్బీ ఎమిరేట్స్ సెవెన్స్ సిరీస్-2025లో భారత సీనియర్ మహిళల రగ్బీ సెవెన్స్ జట్టు కజికిస్తాన్ చేతిలో ఓటమిచెందింది. చైనాలోని హాంగ్‌జౌలో 10వ సీడ్‌గా టోర్నమెంట్‌లోకి అడుగుపెట్టిన భారత జట్టు, ఫిలిప్పిన్స్ (24-5), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (19-12) పై గణనీయమైన విజయాలు సాధించింది. అయితే ఐదవ స్థానం కోసం జరిగిన ప్లేఆఫ్‌లో కజకిస్తాన్‌తో జరిగిన పోరులో 10-17 తేడాతో పరాజయం చెంది భారత్ జట్టు ప్రచారం ముగిసింది. అయినా కెప్టెన్ శిఖా యాదవ్ నాయకత్వంలోని జట్టులో సంధ్యారాణి అత్యుత్తమ ప్రదర్శన చేసింది. నాలుగు ప్రయత్నాలు మరియు రెండు ఛేంజింగ్‌లతో భారతదేశపు టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్ లెగ్ 1లో ఇండియా 5 మ్యాచ్‌లను ఆడగా, రెండింటిలో విజయం సాధించింది. 0-29 తేడాతో హాంకాంగ్ చైనాతోను, 0-27 తేడాతో థాయ్‌లాండ్‌తోను 10-17 తేడాతో కజకిస్తాన్‌తోను జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోగా, ఫిలిప్పిన్స్‌పై 24-5 తేడాతో, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 19-12తో విజయం సాధించింది. భారత్ తదుపరి అక్టోబర్ 18-19 తేదీలలో కొలంబోలో జరిగే ఎఆర్ఇఎస్ఎస్ 2025 యొక్క రెండవ మరియు చివరి లెగ్‌లో పోటీపడుతుంది, ఇక్కడ రెండు లెగ్‌ల నుండి వచ్చే సంచిత పాయింట్లు మొత్తం స్టాండింగ్‌లను నిర్ణయిస్తాయి.

## సూపర్ 4లో పాక్‌పై గెలిచినా
# భారత్‌కు జీరో పాయింట్స్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 సూపర్ 4లో పాకిస్తాన్‌పై భారత్ విక్టరీ సాధించింది. అయితే పాయింట్స్ టేబుల్ మాత్రం భారత్‌కు జీరో పాయింట్స్ తప్పలేదు. మరోసారి భారత్, పాకిస్తాన్ జట్లు సూపర్4లో తలపడనున్నాయి. గత గ్రూప్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను భారత్ 7 వికెట్ల తేడాతో ఓడించింది. కానీ, సూపర్4 ప్రారంభమయ్యేటప్పుడు భారత్ పాయింట్స్ టేబుల్‌లో జీరో పాయింట్స్‌తో ఉంది. గ్రూప్ మ్యాచ్‌లో గెలిచిన పాయింట్లు ఎందుకు పరిగణనలోకి తీసుకోరు? దీని వెనుక ఉన్న కారణం ఏంటనేది క్రికెట్ వర్గాల్లో ఇప్పుడు హాట్ చర్చ అయింది. ఆసియా కప్ 2025లో గ్రూప్ దశలో



పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించినప్పటికీ, సూపర్4 దశ ప్రారంభమయ్యేటప్పుడు భారత్‌కు పాయింట్స్ టేబుల్‌లో జీరో పాయింట్స్ ఉన్నాయి. ఈ టోర్నమెంట్ ఫార్మాట్ ప్రకారం గ్రూప్ దశలో గెలిచిన పాయింట్లను సూపర్4కు పరిగణనలోకి తీసుకోరు. సూపర్4లో ఉన్న అన్ని జట్లు (భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక) జీరో పాయింట్స్‌తోనే తమ ప్రయాణాన్ని మొదలుపెడతాయి. గ్రూప్ దశలో జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఫలితాలు సూపర్4 పాయింట్స్ టేబుల్‌పై ఎలాంటి ప్రభావం చూపవు. 2003, 2007 ప్రపంచ కప్‌లలో ఉన్న రౌండ్ రాబిన్ ఫార్మాట్ (సూపర్ 8) లా కాకుండా, ఆసియా కప్‌లో పాయింట్లు ముందుకు తీసుకెళ్లరు. ప్రపంచ కప్ టోర్నమెంట్‌లలో ఒకే గ్రూప్‌లోని జట్లు సూపర్8 దశలో మళ్ళీ ఆడవు, కానీ ఆసియా కప్‌లో గ్రూప్ దశలో ఒకరినొకరు ఎదుర్కొన్న జట్లు మళ్లీ సూపర్4లో పోటీపడతాయి. 2018 నుంచి ఈ ఫార్మాట్‌ను ఆసియా కప్‌లో అనుసరిస్తున్నారు. ఇక ఈ ఫార్మాట్ శ్రీలంకకు కొంత నష్టాన్ని కలిగించింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్‌ను ఓడించిన శ్రీలంక, సూపర్4లో అదే బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది. దీంతో శ్రీలంకకు ఇప్పటికీ జీరో పాయింట్స్ ఉన్నాయి, ఫైనల్‌కు అర్హత సాధించాలంటే రాబోయే రెండు మ్యాచ్‌లలో తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. ఈ ఫార్మాట్ వల్ల ప్రతీ మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. ఈ నిబంధనల ప్రకారం భారత్, పాకిస్తాన్ రెండూ కూడా జీరో పాయింట్స్‌తోనే తమ సూపర్4 మ్యాచ్‌లను ప్రారంభించాయి. ఆసియా కప్ ఫైనల్‌కు చేరాలంటే, సూపర్4లో మంచి ప్రదర్శన చేసి పాయింట్స్ టేబుల్‌లో టాప్ 2లో నిలవాలి.

# కొరియా ఓపెన్ ఛాంపియన్‌గా స్వియాటెక్




**న్యూఢిల్లీ:** కొరియా ఓపెన్ ఫైనల్‌లో పోలాండ్‌కు చెందిన టాప్ సీడ్ ఇగా ఇగా స్వియాటెక్ టైటిల్‌ను సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. దాదాపు ప్రతి గణాంక విభాగంలోనూ ఆమె వెనుకబడి ఉన్నా, తదుపరి పుంజుకుని 2 గంటల 41 నిమిషాల్లో 2వ సీడ్ ఎకటెరినా అలెగ్జాండ్రోవాను 1-6, 7-6 (3), 7-5 తేడాతో ఓడించి డబ్ల్యూటిఏ టూర్‌లో మరో టైటిల్‌ను గెలుచుకుంది. ఈ విజయం ఆమె సీజన్‌లో మూడవ టైటిల్ కాగా, ఆమె కెరీర్‌లో 25వ టైటిల్‌గా నిలిచింది. ఆమె ఇప్పుడు డబ్ల్యూటిఏ ఫైనల్స్‌లో 255తో ఆల్‌టైమ్ స్థానంలో ఉంది. ఆ మ్యాచ్‌లో తొలి సెట్ ఓడిపోయినప్పటికీ స్వల్ప తేడాతో ముగిసింది. మొదటి సెట్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం 30 నిమిషాలు మాత్రమే పట్టింది. ప్రారంభ గేమ్‌లో స్వియాటెక్‌ను బ్రేక్ చేసి వెనక్కి తిరిగి చూడలేదు. 24 ఏళ్ల స్వియాటెక్ రెండవ సెట్‌ను ప్రారంభించడానికి స్క్రిప్ట్‌ను తిప్పికొట్టి అలెగ్జాండ్రోవాను వెంటనే బ్రేక్ చేసింది. కానీ తదుపరి గేమ్‌లో అలెగ్జాండ్రోవా బ్రేక్ చేయడంతో జోరు మళ్లీ మారిపోయింది. టైబ్రేక్ కోసం సమయం వచ్చే వరకు ఇద్దరూ హోల్డ్స్‌ను మార్చుకున్నారు. మాజీ ప్రపంచ నంబర్ 1 మరియు ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ సింగిల్స్ విజేత అయిన ఈ టెన్నిస్ ప్లేయర్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లి, దానిని 5-2కి పెంచి, టైబ్రేక్‌ను 7-3తో ముగించి ఆధిక్యం సంపాదించింది. మూడవ ఆట ప్రారంభంలో, స్వియాటెక్ అలెగ్జాండ్రోవాకు ఒక ఆటలో మూడు డబుల్ ఫాల్ట్‌లతో బ్రేక్ ఇవ్వడంతో 2-1తో వెనుకబడింది. కానీ ఆమె కోలుకుని, సెట్‌ను 3ఆల్‌తో సమం చేసి, తదుపరి ఆటలో మ్యాచ్‌లో కేవలం రెండవసారి ఆధిక్యాన్ని సాధించింది. అక్కడి నుంచి స్కోరుబోర్డు ఒత్తిడి స్వియాటెక్‌కు అనుకూలంగా పనిచేసి టైటిల్ విజేతగా నిలిచింది.

# టీమ్ వరల్డ్‌కు టైటిల్



**న్యూఢిల్లీ:** లావర్ కప్ 2025, చివరి రోజున టేలర్ ఫ్రిట్జ్ అదరగొట్టడంతో గ్రూప్ టీమ్ వరల్డ్ విజయాన్ని సాధించింది. దీంతో టీమ్ వరల్డ్ మూడవ టైటిల్‌ను దక్కించుకుంది. లావర్ కప్‌లో టేలర్ ఫ్రిట్జ్ 6-3, 7-6(4) తేడాతో అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించి నిర్ణయాత్మక దెబ్బ కొట్టాడు. టీమ్ వరల్డ్ శాన్ ఫ్రాన్సిస్కోలో పురుషుల టీమ్ కాంపిటీషన్ టైటిల్‌ను తిరిగి పొందేందుకు టీమ్ యూరప్‌పై 15-9 తేడాతో విజయం సాధించింది. ఈ విజయం 2022 మరియు 2023లో వరుసగా రెండు విజయాలు సాధించిన తర్వాత, ఎనిమిది ఎడిషన్ల పోటీలో టీమ్ వరల్డ్‌కు ఇది మూడవ విజయంగా నిలిచింది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో క్లీన్ స్వీప్ తర్వాత టీమ్ వరల్డ్ 9-3 ఆధిక్యంలో నిలిచింది. కానీ చివరి రోజు మూడు పాయింట్లు లభించడంతో, విజయం సాధించడానికి అవసరమైన 13 పాయింట్లను చేరుకోవడానికి మార్గం సుగమమైంది. ఇక కార్లోస్ అల్కరాజ్ నార్వేకు చెందిన కాస్పర్ రూడ్‌తో జతకట్టి, అమెరికన్ జంట అలెక్స్ మిచెల్సెన్ మరియు రీల్లీ ఒపెల్కాపై 7-6(4), 6-1 తేడాతో విజయం సాధించి అంతరాన్ని తగ్గించాడు.

# వజ్రాల పరిశ్రమపై సుంకాల ఎఫెక్ట్!

## 20% వరకూ క్షీణత ఉందన్న ట్రేడర్లు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 22:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీచేసిన సుంకాల ప్రభావం శుద్ధిచేసిన, ముడి వజ్రాల ఎగుమతులపై చూపిస్తోంది. దీనివల్ల వజ్రాల ధరలు కూడా పెరుగుతున్నట్లు కేర్ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. అత్యధిక సుంకాలు మొత్తం ఈ భారంకస్టమర్లపైకే కంపెనీలు నెట్టివేస్తున్నట్లు తెలుస్తోంది. దీనితో అమెరికాలో వజ్రాల ధరలు కూడా భారీగాపెరుగుతుండటంతో కస్టమర్లు విముఖత చూపిస్తున్నారు. దీనివల్ల కట్అండ్‌పాలిష్డ్ డైమండ్స్ (సిపిడి) ఎగుమతులపై తీవ్ర ప్రభావంచూపిస్తోంది. 2026 సంవత్సరంలో సుమారు 11 బిలియన్‌డాలర్ల ఎగుమతులు జరుగుతాయని అంచనావేస్తే 17 ఉంచి 20శాతం వరకూ క్షీణించవచ్చన్న అంచనాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు భారత్‌నుంచి వచ్చే దిగుమతులపై 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. రష్యాచమురు కొనుగోలుచేస్తున్నందుకు ఈ సుంకాల్లోనే 25శాతం అదనంగా విధించారు. ఈ సుంకాల వల్ల భారత్‌లోని డైమండ్ బిజినెస్‌కు తీవ్ర విఘాతం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా వాసులే ఎక్కువగా వజ్రాలను కొనుగోలుచేస్తుంటారు. ప్రపంచంలోని మొత్తం వజ్రాలవ్యాపారంలో 90 శాతం శుద్ధిచేస్తున్న వజ్రాలు భారత్‌లోనే ఉన్నాయి. ఎగుమతులు కూడా సుమారు 47శాతం వరకూ ఉంటాయి. వజ్రాభరణాల్లో అత్యధిక వాటా వజ్రాలదే. ఎగుమతులద్వారానే ఈపరిశ్రమకు 80% రాబడులు ఉంటాయి. అమెరికా ఒక్కటే 40శాతం పాలిష్ డైమండ్లను దిగుమతిచేసుకంటున్న దేశంగా ఉంది. భారత్‌నుంచి నేరుగా ఎగుమతులు 2025లో 37శాతం అమెరికాకే వెళ్లాయి. ఇపుడు సుంకాలవల్ల ఎగుమతులు 17.5శాతం క్షీణించి 13.3 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే భారత్‌లో గనులనుంచి తవ్వకాల్లో తీసివికాకుండా ఎల్జీడీ అంటే ల్యాబ్‌గ్రోన్ డైమండ్‌లు ఇపుడు వేగంగా మార్కెట్ అవుతున్నాయి. దేశీయంగా వజ్రాల డిమాండ్ స్థిరంగానే ఉంది. సుంకాలప్రభావం అమెరికా ఎగుమతులపైనే ఉన్నా చైనాకు మాత్రం యధాతథంగా వెళుతుందని తెలుస్తోంది.

# ఫోన్‌పే రాబడులు రూ.7115 కోట్లు



**ముంబయి, సెప్టెంబరు 22:** ఐపిఒకు వస్తున్న ఆర్థికసేవలసంస్థ ఫోన్‌పే 7115 కోట్ల రాబడులు సాధించింది. వార్షిక పద్ధతిలో చూస్తే గత ఏడాదికంటే 40శాతం వ1ద్ధిని నమోదుచేసినట్లు కంపెనీల రిజిస్ట్రారుకు ఇచ్చిన నివేదికలో తెలిపింది. కంపెనీకి ఉన్న నగదు లభ్యత సానుకూలంగానే ఉంది. లావాదేవీలద్వారా వచ్చిన రాబడులు 1202 కోట్లవరకూ ఉన్నాయి. ఫోన్‌పై క్షేత్రస్థాయిని మరింత పటిష్టంచేసుకుంటున్నది. పన్నులచెల్లింపులకు ముందు రాబడులు రూ.1477 కోట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది ఇదే కాలంలో 652 కోట్లుమాత్రమే రాగా సర్దుబాటుచేసిన నికరలాభం 630 కోట్లకుపైగా ఉంది. అదే గత ఏడాది 197 కోట్లుమాత్రమే ఉన్నట్లు కంపనీ ప్రకటించింది. కంపెనీ ఇబిఐటి కూడా మొదటిసారిగా 117 కోట్లమేర సర్దుబాటు చేసింది. గడచిన రెండేళ్లలో కస్టమర్లకు ఫోన్‌పే అనేక సదుపాయాలు ప్రకటిస్తూ వస్తోంది. అంతేకాకుండా రుణపంపిణీ వ్యవస్థ, స్టాక్‌బ్రోకింగ్‌లోకి కూడా వస్తోంది. ప్రస్తుతం ఉన్న చెల్లింపులు, ఆర్తికసేవల వ్యవస్థనుంచి మరింతగా విస్తరిస్తోంది. కంపెనీ ఐపిఒకు వచ్చేందుకుగాను సెబీ వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసేందుకు కసరత్తులుచేస్తోంది.

# స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఐదేళ్లకే 25% రిటర్నులు!


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** స్మాల్ అండ్ మిడ్‌క్యాప్ మ్యూచువల్‌ఫండ్స్ ఇపుడు ఇన్వెస్టర్లను ఎక్కువ ఆకర్షిస్తున్నాయి. ఐదేళ్లకాలంలోనే 25శాతం రిటర్నులు ఇస్తున్నట్లు నిపుణులు చెపుతున్నారు. ప్రభుత్వ విధానాలు కూడా ఇందుకు మద్దతుగా నిలుస్తుండటంతో లార్జ్‌క్యాప్ ఫండ్స్ కంటే మిడ్, స్మాల్‌క్యాప్‌ఫండ్స్ ఎక్కువ రిటర్నులు ఇస్తున్నట్లు ఇక్రా విశ్లేషణచేసింది. మ్యూచువల్‌ఫండ్స్ అసోసియేషన్ గణాంకాలప్రకారంచూస్తే లార్జ్‌క్యాప్ ఫండ్స్ స్థిరత్వంతో ఉన్నాయి. చిన్న, మిడ్‌క్యాప్ కేటగిరీలు పటిష్టమైన రాబడులను ఇస్తున్నట్లు ఇక్రా పరిశీలనలో తేలింది. అలాగే వాటి నిర్వహణ ఆస్తులు కూడా పెరుగుతున్నట్లు గుర్తించింది. ఇక లార్జ్‌క్యాప్‌ఫండ్స్ అయితే స్థిరత్వం, తక్కువ అనిశ్చితి, దీర్ఘకాలిక మూలధన సంరక్షణ ఉంటుందని అంచనా. చిన్న, మధ్య తరహా సంస్థలు ఇదేమార్గంలో విస్తరణకు కూడా అవకాశం ఉంది.



మార్కెట్లను ఆకర్షించేందుకు సృజనాత్మక ఆలోచనలతో ముందుకువస్తున్నందున స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. మిడ్‌క్యాప్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు ఈవార్షిక పద్ధతిలోచూస్తే 10.9శాతం పెరిగి 4.27 లక్షలకోట్లకు చేరాయి. అదే స్మాల్‌క్యాప్‌ఫండ్స్ నిర్వహణ ఆస్తులు 9.56శాతంపెరిగి రూ.3.51 లక్షలకోట్లుగా ఉన్నట్లు ఆంఫీ నివేదికలు చెపుతున్నాయి. వీటికి భిన్నంగా లార్జ్‌క్యాప్ఫండ్స్ నిర్వహణ ఆస్తులు 5.86శాతం పెరిగి 3.90 లక్షలకోట్లకు చేరినట్లు తేలింది. ఇక ఫండ్స్‌లోకి పెట్టుబడులుకూడా అదేవిధంగా ఉన్నాయి. మిడ్‌క్యాప్‌ఫండ్స్‌లో 5331 కోట్లు ఆగస్టులో వచ్చాయి. 74.51శాతంపెరిగింది. స్మాల్‌క్యాప్‌ఫండ్స్ 4993 కోట్లు నికర పెట్టుబడులు ఆకర్షించాయి. అదేవిధంగా లార్జ్‌క్యాప్‌ఫండ్స్‌కు 2835 కోట్లవరకూ నికరరాబడులు అందాయి. 2025 ప్రారంభంనుంచి నికరంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌ఫండ్స్‌లోకి పెట్టుబడులు వరుసగా 55.01, 22.01శాతం చొప్పున పెరిగాయి. ఇక రిటర్నులపరంగా కూడా మిడ్, స్మాల్‌క్యాప్స్ మూడేళ్లు, ఐదేళ్లకే రిటర్నులు అధికంగా ఇస్తున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్లకు ఐటి, ఫార్మా సూచీల ఎఫెక్ట్

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, సెప్టెంబరు 22:** బెంచ్‌మార్క్ సూచీలు సోమవారం ప్రారంభనుంచే కొంతమేర నత్తనడకన కొనుగోళ్లుజరిగాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 466.26 పాయింట్లు క్షీణించి 82,159.97 పాయింట్లవద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఇ నిఫ్టీ సూచీ కూడా 124.70 పాయింట్లుక్షీణించి 25,202.35 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగిచింది. మార్కెట్లలో సుంకాల ఆందోళన పెరిగి ఆద్యంతం అనిశ్చితి నెలకొన్నది. హెచ్1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం వల్ల భారత్‌లోని 283 బిలిన్ డాలర్ల ఐటి ఔట్‌సోర్సింగ్ రంగంపై తీవ్రప్రభావంచూపించింది. ఫార్మాస్టాక్స్ కూడా కొంతమేర క్షీణించాయి. రెండురోజుల లాభాలనుంచి ఐటి, ఫార్మారంగాలు సోమవారం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీనికితోడు డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా కొంత తోడయినట్లు సెబి రిజిస్టరు వెల్త్‌టెక్‌ఫండ్ సంస్థ ఎన్‌రిచ్‌మనీ సిఇఒ పోన్ముడి అంచనావేసారు. నిఫ్టీసూచీ 25,206వద్దప్రారంభం అయి స్వల్పమాత్రమే పెరిగి చివరకు 25,150వద్ద ముగిసింది. ఒకదశలో 25,330వరకూ కూడా వెళ్లి ఆ తర్వాతప్రతిఘటన ఎదుర్కొంది. మిడ్‌సెషన్‌లో 25,350కిపైబడినా అమ్మకాల ఒత్తిడి నిఫ్టీని కిందకు నెట్టింది. ఇంట్రాడేలోనే 25,151 పాయింట్లుగా నమోదయింది. బ్యాంకు నిఫ్టీ కొంతమేర ఎగిసిపడింది 55,431 పాయింట్లవరకూ వెళ్లింది. ఒకదశలో 56,350 పాయింట్లను కూడా తాకింది. ఇక సానుకూలంగా సాగిన కంపెనీల్లో ఆదానిగ్రూప్, ఆదానిపవర్, ఆదాని టోటల్‌గ్యాస్, ఆదాని గ్రీన్ ఎనర్జీలు ఇన్వెస్టర్లను ఆకర్షించాయి. ఆదానిగ్రూప్‌పై ఆరోపణలను సెబీ క్లియర్‌చేయడంతో గ్రూప్ కంపెనీలకు మహర్దశ పట్టింది. ఇక జిఎస్టీ కొత్తశ్లాబ్‌లు అమలులోకి వచ్చాయి. 5,18శాతం శ్లాబ్‌లు కొత్తగా 40శాతం శ్లాబ్ లగ్జరీ ఉత్పత్తులకు అమలుచేస్తుండటంతో ఎఫ్ఎంసిజి ఇతర కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల రంగాల కంపెనీల షేర్లలో భారీ ర్యాలీ కనిపించింది. ఇక మిడ్‌క్యాప్‌సూచీ 0.78శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌కూడా 0.71శాతం క్షీణించింది. వివిధ సూచీలపరంగాచూస్తే నిఫ్టీలో మీడియా 0.48శాతం, మెటల్‌సూచీ 0.39శాతం, ఆయిల్ అండ్ గ్యాస్‌సూచీ 0.06శాతం పెరిగాయి. మరోపక్క ఐటిసూచీ 2.95శాతం, ఫార్మా సూచీ 1.41శాతం, హెల్త్‌కేర్‌సూచి 1.07శాతం క్షీణించాయి. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ అక్టోబరు 3వ తేదీనాటికి 1.59శాతంపెరిగి 1,11,611 రూపాయలకు పెరిగాయి. బ్రెంట్‌ముడిచమురు ధరలు నవంబరుకు గాను 24 సెంట్లు తగ్గిబ్యారెల్‌కు 66.44 డాలర్లుగా నడిచింది.

# ఐటి రంగంపై వీసా ఫీజు ఎఫెక్ట్ తక్కువే!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** ఐటి రంగ సంస్థల సమాఖ్య నాస్కామ్ అమెరికా వీసా ఫీజుల పెంపుపై స్పందించింది. భారత్‌కంపెనీలు ఇకపై హెచ్‌వన్‌బి వీసాలపై ఆధారపడటం తగ్గిస్తాయని అంచనావేసింది. హెచ్‌వన్‌బి వీసాలు భారీ కంపెనీలు ఈ కేటగిరీలో 14,792నుంచి 2024లో 10,162కి తగ్గాయని వివరించింది. పది టాప్ భారత కంపెనీలలో హెచ్‌వన్‌బి వర్కర్లు ఒకటిశాతం కంటే తక్కువమందే ఉన్నట్లు అంచనావేసింది. ట్రంప్ విధించిన సుంకాలు, వీసా ఫీజుల పెంపు భారత ఐటిరంగంపై తక్కువేనని నాస్కామ్ వెల్లడించింది. వైట్‌హౌస్ ఈ వీసాపెంపు వన్‌టైమ్ ఫీజు మాత్రమే అని క్లారిటీ ఇవ్వడంవల్లకూడా ఐటి కంపెనీల్లో ఆందోళన సద్దుమణిగింది. అందులోనూ కేవలం కొత్త దరఖాస్తులకు మాత్రమేనని, ప్రస్తుత వీసా హోల్డర్లకు, రెన్యువల్ వీసా హోల్డర్లకు వర్తించదని స్పష్టంచేయడంతో ఐటిరంగంలోని వర్కర్లకు కొండంత ఊరట లభించినట్లయింది. అంతేకాకుండా ఈ వీసా పెంపు 2026 నుంచి ప్రారంభం అవుతుందన్న స్పష్టత రావడంతో కార్పొరేట్లు వారి వ్యూహాలను సర్దుబాటు చేసుకునేందుకు వీలవుతున్నది. నాస్కామ్ అంచనాల ప్రకారం కంపెనీలు ఇపుడు స్థానిక స్కిల్ వర్కర్లను నియమించుకునేందుకు కొంత వెసులుబాటు వచ్చిందని అమెరికా గ్రేట్ అన్న నినాదానికి అనుగుణంగా కంపెనీలు కూడా మార్పులుచేసుకుంటాయని నాస్కామ్ చెపుతోంది. హెచ్‌వన్‌బి వీసాలు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాగా మంచి నైపుణ్యం ఉన్న వారి కొరతను ఇప్పటివరకూ తీరుస్తూ వచ్చాయి. స్థానికంగా వర్కర్లకు ఇచ్చే జీతాలకు సమాంతరంగానే నైపుణ్య వర్కర్లకు ఇస్తుండటంతో హెచ్‌వన్‌బి వీసాలకు భారీ డిమాండ్ వచ్చింది.

వాణిజ్యం




## టాక్స్ ఆడిట్ ఐటిఆర్‌లకు
# గడువు పెంపు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** ఆదాయపు పన్నుశాఖ ట్యాక్స్ పేయర్లకు గుడ్‌న్యూస్‌ప్రకటించింది. తమ అధికారిక ఇఫైలింగ్ వెబ్‌సైట్లో ఐటీఆర్ 5, ఐటీఆర్7 ఆన్‌లైన్ ఫామ్స్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. ఈ రెండు ఫారాల్లో ముందస్తుగా నింపిన డేటా ఉంటుందని పేర్కొంది. అయితే ఐటీఆర్ ఫైలింగ్ గడువు సెప్టెంబర్ 16తోనే ముగిసింది కదా ఇదేంటి మళ్లీ అనే ప్రశ్న తలెత్తవచ్చు. ట్యాక్స్ ఆడిట్ అవసరమైన ట్యాక్స్ పేయర్లకు గడువు అక్టోబర్ 31, వరకు ఉంటుంది. ఈ ఐటీఆర్ 5, 7 ఫామ్స్ సైతం స్పెషల్ కేటగిరీ ట్యాక్స్ పేయర్లకే వర్తిస్తాయి. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, హిందూ అవిభాజ్య కుటుంబాలకు ఇది వర్తించదు. ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ ప్రకారం ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫామ్ ఐటీఆర్5, ఐటీఆర్7 అందుబాటులోకి వచ్చింది. ముందస్తుగా నింపిన డేటాతో ఆన్‌లైన్ విధానంలో ఈ ఫామ్స్ దాఖలు చేయవచ్చని తెలిపింది. వ్యక్తిగత, హిందూ అవిభాజ్య కుటుంబానికి చెందిన వారు కాకుండా మిగితా వారు ఈ ఫామ్స్ ఉపయోగించుకోవచ్చు. ట్యాక్స్ ఫామ్ ఐటీఆర్5ని సంస్థలు, ఎల్ఎల్‌పీ (లిమిటెడ్ లియబిలిటీ పార్ట్నర్‌షిప్స్)లు, ఏఓపీలు, ఏజేపీలు, అసోసియేషన్ పర్సన్స్, బిజినెస్ ట్రస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, కోఆపరేటివ్ సొసైటీలు వంటి ట్యాక్స్ పేయర్లు ఉపయోగించాల్సి ఉంటుంది. ఐటీఆర్7 ఫామ్ ప్రత్యేక ట్యాక్స్ పేయర్లు ఉపయోగించాల్సి ఉంటుంది. అందులో ఛారిటబుల్, రెలిజియస్ ట్రస్టులు, రాజకీయ పార్టీలు, రీసర్చ్ ఆర్గనైజేషన్లు, న్యూస్ ఏజెన్సీలు, కాలేజీలు, యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూషన్ల వంటి ఇతర ప్రత్యేక కేటగిరీలో ఉన్న ట్యాక్స్ పేయర్లు ఐటీఆర్7 ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139(4ఎ), 139(4బీ), 139(4సి), 139(4డి) పరిధిలోకి వచ్చే వారు ఉపయోగించాలి. ఈ ట్యాక్స్ పేయర్లకు ట్యాక్స్ ఆడిట్ అవసరం అవుతుంది. ఐటీఆర్5, ఐటీఆర్7 ఫామ్స్ ఫైల్ చేసేందుకు అసెస్సీల అకౌంట్లు ఆడిట్ చేయాల్సి ఉంటుంది. వీరు ఐటీఆర్ ఫైల్ చేసేందుకు మదింపు సంవత్సరం 2025-26కి గానూ అక్టోబర్ 31 వరకు గడువు ఉంటుంది. ఇది ట్యాక్స్ ఆడిట్ అవసరమైన కంపెనీలు, ఇన్‌స్టిట్యూషన్లకు మాత్రమే వర్తిస్తుంది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు ఈ గడువు వర్తించదు. ఇప్పటికీ ఐటీఆర్ ఫైల్ చేయవచ్చు. అయితే, పెనాల్టీ, వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.